తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

19-4-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 77 పేజీలు: 10+4 వెల: 6.50







శుక్రవారం హైదరాబాద్ మక్కామసీద్ వద్ద సవరించిన వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

# రైతులకు న్యాయం

>> జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ఆ తర్వాత భారీ బైక్ ర్యాలీతో వెంకటాపూర్ మండల కేంద్రానికి చేరుకొని భూభారతి చట్టం అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం కుట్రపూరితంగా హార్డ్ బీలో 18 లక్షల ఎకరాలలో ఆరు లక్షల ఎకరాల వరకు వ్యవసాయ భూములు ఉన్నాయని ఈ భూములను భూభారతి చట్టంతో పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. పేద రైతుల కన్నీటిని తుడిచేందుకే భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని ఎన్నికల ముందు ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని మేము ఇచ్చిన హామీని ప్రజలు విశ్వసించి ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నారని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలో భూ సమస్యలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే రేవంత్ సర్కార్ లక్ష్యమని ఆయన అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణిపై ఏనాడు కూడా రెవెన్యూ సదస్సులు పెట్టలేదని, దీనితో రైతులకు వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రాష్ట్రంలో లక్షలాది మంది రైతులు భూ సమస్యలను ఎదుర్కొన్నారని తెలిపారు. గిరిజన గిరిజనేతరులు ఉండే ప్రాంతంలో భూ సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని పొంగులేటి అన్నారు. రైతులు గతంలో సాదా బైనామా కోసం ఆప్షన్ల దరఖాస్తు చేసుకున్న తొమ్మిది లక్షల 24 వేల దరఖాస్తులలో సక్రమంగా ఉన్న దరఖాస్తులను పరిష్కరించడం జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. భూభారతి చట్టం ద్వారా భూమిపై ఎవరైతే కాస్తులో ఉంటారో వారికే పాసుబుక్ ఇవ్వడం జరుగుతుందని గ్రామాలకే రెవెన్యూ అధికారులు వచ్చి సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని వివరించారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతుందని పేదవాడి చిరకాల కోరిక ఇందిరమ్మ ఇల్లు అని కులమతాలకు అతీతంగా పేదవాళ్లకు ఇల్లు మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ గత ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకువచ్చి రైతుల ఆత్మహత్యలకు కారకులు అయ్యారని నేను భూ సమస్యను పరిష్కరించడానికి రేవంత్ రెడ్డి భూభారతి చట్టం తీసుకువచ్చారని ఆమె తెలిపారు. రాష్ట్రంలో ప్రతి పేదవాడు సన్న బియ్యం తీయనాలనే సంకల్పంతో రేషన్ కార్డు హోల్డర్లకు సన్న బియ్యం అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని సీతక్క తెలిపారు. ఈ సమావేశంలో మంత్రి కొండా సురేఖ, ఎంపీ పోరిక బలరాం నాయక్, భూపాలపల్లి వరదన్నపేట ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ, కె.ఆర్ నాగరాజులు, ప్రిన్సిపల్ సెక్రెటరి రామకృష్ణారావు, ములుగు జాయింట్ కలెక్టర్ మహేందర్ జీ, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, రెవెన్యూ సదస్సుల్లో ప్రత్యేక అధికారి కిరణ్ ప్రకాష్ తదితరులు భూభారతి చట్టం గురించి మాట్లాడారు.

# ఎప్‌సెట్ హాల్‌టికెట్లు

>> రెస్పాన్స్(క్యూఆర్) కోడ్‌ను ముద్రిస్తున్నట్లు తెలిపారు. క్యూఆర్ కోడ్ మూలంగా విద్యార్థులు తమ పరీక్షా కేంద్రాలను తెలుసుకోవడం సులభతరం అవుతుందని తెలిపారు. విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టిక్కెట్లపై ముద్రించిన క్యూఆర్ కోడ్‌ను స్మార్ట్‌ఫోన్‌తో స్కాన్ చేయడం. స్కాన్ చేసిన తర్వాత గూగుల్ మ్యాప్స్ అప్లికేషన్‌లో ఒక లింక్ తెరుచుకుంటుంది, ఇది విద్యార్థులు తమ పరీక్షా కేంద్రాలకు వారి రూట్ మ్యాప్‌ను వీక్షించేందుకు వీలు కల్పిస్తుంది. దాంతోపాటు ట్రాఫిక్‌ను పరిగణనలోకి తీసుకుని వారి కేంద్రం ఎంత దూరంలో ఉంది.. అక్కడికి చేరుకోవడానికి ఎంతసమయం పడుతుందోకూడా విద్యార్థులు నిర్ధారించుకోవడానికి అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. పరీక్షల సందర్భంగా నిమిషం నిబంధనను అమలు చేయనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రంలోనికి గంటన్నర ముందుగానే అనుమతిస్తామని.. కాబట్టి విద్యార్థులు ఆలస్యం చేయకుండా త్వరగా పరీక్షా కేంద్రాలకు చేరుకొని ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని సూచించారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి జేఎన్‌టీయూహెచ్ పరిధిలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో తనిఖీలను ప్రారంభించినట్లు తెలిపారు. మే 15 లోపుగా తనిఖీలను పూర్తి చేయనున్నట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

# ఎఐ డేటా సెంటర్

>> శంలో ఈ పెట్టుబడుల ఒప్పందం కుదిరింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమక్షంలో ఎన్‌టిటి డేటా, నెయిసా నెట్‌వర్క్స్ నుంచి బోర్డు సభ్యుడు కెన్ కట్సుయామా, డైరెక్టర్ తడావోకి నిషిమురా, ఎన్టీటీ గ్లోబల్ డేటా సెంటర్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అలోక్ బజ్‌పాయ్, నెయిసా సిఇఒ, ఎన్టీటీ గ్లోబల్ డేటా ఛైర్మన్ షరద్ సంఘీ ఈ ఒప్పందంలో పాల్గొన్నారు. దేశంలో అతిపెద్ద ఏఐ కంప్యూట్ మౌలిక సదుపాయం హైదరాబాద్‌లో నిర్మించబోయే ఈ సదుపాయం 400 మెగావాట్ల డేటా సెంటర్ క్లస్టర్. 25,000 జిపియులతో దేశంలోనే అత్యంత శక్తివంతమైన ఎఐ సూపర్ కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలను సమకూరుస్తుంది. దేశంలో తెలంగాణను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాజధానిగా మార్చాలనే లక్ష్యానికి అనుగుణంగా ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటుంది. ఎన్‌టిటి డేటా, నెయిసా కంపెనీలు సంయుక్తంగా ఏఐఫస్ట్ సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేసేందుకు ఈ క్లస్టర్ కొత్త ఆవిష్కరణల కేంద్రంగా అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. 500 మెగావాట్ల వరకు గ్రిడ్, పునరుత్పాదక విద్యుత్తు మిశ్రమంతో ఈ క్లస్టర్ నిర్వమిస్తారు. లిక్విడ్ ఇమ్మర్షన్ వంటి అత్యాధునిక కూలింగ్ టెక్నాలజీలను అవలంబిస్తారు. ఈ ప్రాజెక్టును అత్యున్నత ఇఎస్‌జి (ఎన్విరాన్‌మెంటల్, సోషల్, గవర్నెన్స్) ప్రమాణాలతో అభివృద్ధి చేస్తారు. ఈ క్యాంపస్ తెలంగాణలోని విద్యా సంస్థల భాగస్వామ్యంతో ఏఐ ప్రతిభను పెంపొందిస్తుంది. రాష్ట్ర డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్‌కు దోహదం చేస్తుంది. ఈ భారీ పెట్టుబడుల ఒప్పందంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానాలు పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని అన్నారు. నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా, సింగిలో విండో అనుమతులను ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. వీటితో పాటు రాష్ట్రంలో ప్రతిభావంతులైన నిపుణులు అందుబాటులో ఉండటంతో ఏఐ సంబంధిత డిజిటల్ సేవల్లో రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తుందన్నారు. ఎడబ్ల్యూఎస్, ఎస్‌టిటి, టిల్‌మన్ హోల్డింగ్స్, సిటిఆర్ఎల్ఎస్ వంటి పెద్ద కంపెనీల డేటా సెంటర్ ప్రాజెక్టుల వరుసలో ఎన్‌టిటి భారీ పెట్టుబడుల ఒప్పందంతో దేశంలో ప్రముఖ డేటా సెంటర్ హబ్‌గా హైదరాబాద్ స్థానం మరింత బలపడిందని అన్నారు. టోక్యోలో ప్రధాన కార్యాలయం కలిగిన ఎన్‌టీటీ డేటా, ఐటి సేవలు, డేటా సెంటర్లు, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో పేరొందిన కంపెనీ. 50 కంటే ఎక్కువ దేశాల్లో 1,93,000 మంది ఉద్యోగులతో, ప్రపంచంలోని టాప్ 3 డేటా సెంటర్ ప్రొవైడర్లలో ఈ కంపెనీ ఒకటి. పబ్లిక్ సర్వీసెస్, బీఎఫ్ఎస్ఐ, హెల్త్‌కేర్, మాన్యుఫాక్చరింగ్, టెలికాం వంటి రంగాలకు ఈ సంస్థ సేవలు అందిస్తుంది. నెయిసా నెట్‌వర్క్ ఏఐఫస్ట్ క్లౌడ్ ప్లాట్‌ఫాం సంస్థ, నిర్దిష్ట ఏఐ కంప్యూట్ సొల్యూషన్స్‌ను అందించటంపై ఈ కంపెనీ దృష్టి సారిస్తుంది..

# పెట్టుబడులు పెట్టండి

>> స్తోంది' అన్నారు. 'టోక్యో చాలా గొప్ప నగరం. ఇక్కడి మౌలిక సదుపాయాలు, పర్యావరణ పరిరక్షణ, ఆవిష్కరణలు అద్భుతం. జపాన్ ప్రజలు సౌమ్యులు, మర్యాదస్తులు, క్రమశిక్షణ కలిగినవారు. మీ నుంచి నేను ఎంతో నేర్చుకున్నాను. హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడానికి టోక్యో నుంచి చాలా నేర్చుకున్నాను' అని సిఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, నైపుణ్యం గల ప్రతిభ, స్థిరమైన విధానాలను తమ ప్రజా ప్రభుత్వం అందిస్తుందని జపాన్ వ్యాపారవేత్తలకు స్పష్టం చేశారు.. లైఫ్ సైన్సెస్, గ్లోబల్ కెపాబులిటీ సెంటర్లు, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వెహికిల్స్, టెక్స్ టైల్స్, ఏఐ డేటా సెంటర్లు, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని.. భారత్, జపాన్ కలిసికట్టుగా ప్రపంచానికి అద్భుతమైన భవిష్యత్తును నిర్మిద్దామని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో భారత రాయబారి సిబి జార్జ్ మాట్లాడుతూ భారత్,జపాన్ మధ్య బలపడుతున్న ఆర్థిక సంబంధాల గురించి చెప్పారు. జెట్రో (జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్) బెంగళూరు డైరెక్టర్ జనరల్ తోషిహిరో మిజుటానీ మాట్లాడుతూ.. తెలంగాణతో సహకారాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలోనే మొదటి నెట్ జీరో ఇండస్ట్రియల్ సిటీగా హైదరాబాద్లో నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ, దేశంలోనే అద్భుతంగా నిర్మించ తలపెట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్‌పై ప్రచార వీడియోలను రాష్ట్ర ప్రభుత్వం ఈ వేదికపై ప్రదర్శించింది. ఎలక్ట్రానిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రిక్ వెహికిల్స్, టెక్స్‌టైల్స్, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో జపాన్ కంపెనీలకు తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలు, అవకాశాలను రాష్ట్ర వాణిజ్య పరిశ్రమల శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ వివరించారు. పార్టనర్‌షిప్ రోడ్‌షో తర్వాత తెలంగాణ ప్రతినిధి బృందం, జపాన్‌లోని పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో ముఖాముఖి సమావేశమైంది.

# యునెస్కో గుర్తింపు

>> భగవద్గీత, నాట్య శాస్త్రం చేర్చడం అంటే మన కాలాతీత జ్ఞానం, గొప్ప సంస్కృతికి ప్రపంచవ్యాప్తంగా దక్కిన ఘనమైన గుర్తింపు. గీత, నాట్యశాస్త్రం శతాబ్దా లుగా నాగరికత, చైతన్యాన్ని పెంపొందించాయి. ప్రపంచానికి స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి" అని ప్రధాని మోదీ అన్నారు. యునెస్కో తన మెమరీ ఆఫ్ ది వరల్డ్ రిజిస్టర్‌లో 74 కొత్త డాక్యుమెంటరీ హెరిటేజ్ కలెక్షన్స్ జోడించింది.



టోక్యో నగరంలోని సుమిదా నదిలో పడవ ప్రయాణం చేస్తున్న సిఎం రేవంత్ రెడ్డి బృందం

# జలరవాణా రివర్ ఫ్రంట్‌ను పరిశీలించిన సిఎం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్18:** జపాన్ పర్యటనలో ఉన్న తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి టోక్యో నగరం మధ్యలో నుంచి ప్రవహించే సుమిదా నదిలో పడవలో ప్రయాణించారు. జల రవాణాకు అనుగుణంగా రూపొందించిన రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేయడం, నది పక్కనే పొడవాటి పై ఓవర్ల నిర్మాణం. అవసరమైనచోట ఎలివేటెడ్ కారిడార్లను పరిశీలించారు. హైదరాబాద్‌లో మూసీ పునరుజ్జీవంప్రాజెక్టులోనూ అక్కడి తరహా అభివృద్ధి సాధాసాధ్యాలపై అధికారులతో చర్చించారు.

# నేడు జెఇఇ మెయిన్ ఫలితాలు

>> స్పందించింది. మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఫైనల్ కీ అందుబాటులో ఉంటుందని ఎక్స్ వేదికగా ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. ఫైనల్ కీని ఎన్‌టిఏ మధ్యాహ్నం అప్‌లోడ్ చేసింది. జెఇఇ మెయిన్ సెషన్ -2 ఫైనల్ కీని ఎన్‌టిఏ తమ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఫలితాలను శనివారం లోపు విడుదల చేస్తామని ప్రకటించింది. జెఇఇ మెయిన్ రెండో విడత పరీక్షలను ఏప్రిల్ 2 నుంచి 9 వరకు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది జనవరిలో జెఇఇ మెయిన్ మొదటి సెషన్ పరీక్షలను నిర్వహించి.. ఫలితాలను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు రెండో విడత పరీక్షలకి సంబంధించిన ఫైనల్ కీని ఎన్‌టిఏ విడుదల చేసింది. రెండు విడతల పరీక్షల్లోని ఉత్తమ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకొని విద్యార్థులకు ర్యాంకులను 19(శనివారం)లోపు కేటాయించనున్నట్టు ప్రకటించింది.

# నిందితుడు విడుదల

>> స్టెయిన్స్ వెంటనే కుటుంబంతో తన దేశానికి వెళ్లకుంటే తీవ్ర పరిణామా లుంటాయని బజ్‌రంగ్‌దళ్ నాయకుడు ధారా సింగ్ అలియాస్ రాంపాల్ హెచ్చరించాడు. అయితే ఈ హెచ్చరికలను స్టెయిన్స్ పట్టించుకోలేదు. దీంతో స్టెయిన్స్ తాత్కా లికంగా ఏర్పాటు చేసుకున్న టెంటులో పెద్ద కుమారుడు పిలిప్, ఆరేళ్ల చిన్న కుమారుడు తిమోతి వుండగా ధారా సింగ్ తన అనుచరులతో కలిసి టెంటుపై పెట్రోల్ పో సి నిప్పంటించాడు. ఈ దాడి నుంచి తప్పించుకునేందుకు స్టెయిన్స్ ఇద్దరు పిల్లలు ప్రయత్నించగా ధారా సింగ్ అతని అనుచరులు కర్రలతో దాడిచేసి మంటల్లో పడవేశారు. దీంతో ముగ్గురు మంటల్లో సజీవ దహనమయ్యారు. ఈ ఘటన ప్రపంచ వ్యాప్తంగా సంచలనం రేపింది. దీంతో ఈ కేసు విచారణను కేంద్రం సిబిఐకి అప్పగించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడుగా ధారా సింగ్‌ను చేర్చగా మొత్తం 14 మందిని నిందితులుగా చేర్చారు. 2003లో సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం ధారా సింగ్‌కు మరణ శిక్ష, మిగతా వారికి జీవిత ఖైదు శిక్ష విధించింది. దీని తరువాత 2005లో ఒడిషా హైకోర్టు ధారా సింగ్ సహా అందరు నిందితులకు జీవిత ఖైదు శిక్షను ఖరారు చేసింది 2011లో సుప్రీం కోర్టు ఒడిషా హైకోర్టు తీర్పును సమర్థించింది. జీవిత ఖైదు పడ్డ వారిలో అప్పుడు 25 ఏళ్ల వయస్సు మహేంద్ర హేంబ్రాం కూడా వున్నాడు. ఇప్పుడు. అతనికి 50 ఏళ్లు. ఇంతకాలం ఇతను జైల్లో వుండగా శుక్రవారం విడులయ్యాడు. కాగా తనను ఈ కేసులో అన్యాయంగా ఇరికించారని, తాను నిర్దోషినని హేంబ్రాం మీడియాతో మాట్లాడుతూ తెలిపాడు. హేంబ్రాం విడుదలను విహెచ్‌పి స్వాగతించింది. కాగా ఇదే కేసులో జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తున్న ధారా సింగ్ ఇంకా జై ల్లోనే వున్నాడు. ఈ కేసులో జీవిత ఖైదు పడ్డ వారిలో కొందరు అనారోగ్య కారణాలతో మరణించారు.

# మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు

>> సభ విజయవంతమే లక్ష్యంగా పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పోచం పల్లి శ్రీనివాస్‌రెడ్డి, హన్మకొండజిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు, మాజీవిప్ దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మె ల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఒడితెల సతీష్‌కుమార్, మహిళా నేతలు మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, టిఎస్‌పిఎస్‌సి మాజీ మెంబర్ సుమిత్రా తనోబా, గిడ్డంగుల శాఖ మాజీ ఛైర్మన్ రజినీ సాయిచంద్, తదితరులు పాల్గొన్నారు.

# మద్యం విక్రయాల్లో కసిరెడ్డే కీలకం

>> కసిరెడ్డి మూడు కంపెనీలు ఏర్పాటు చేసి.. కొత్త మద్యం బ్రాండ్‌లను తయారు చేసి విక్రయించిన సంగతి తనకు తెలియదన్నారు. అందులో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి పాత్ర గురించి సైతం తనకు తెలియదని సిట్ అధికారులకు స్పష్టం చేశానన్నారు. తనను అడిగిన ప్రశ్నలన్నింటికి రాజ్ కసిరెడ్డి మాత్రమే సమాధానం చెప్పగలరని ఈ సందర్భంగా సిట్ అధికారుల ఎదుట చెప్పినట్లు విజయసాయిరెడ్డి వివరించారు. ఇక మూడు కంపెనీలను రాజ్ కసిరెడ్డి లీజుకు తీసుకున్నారా? అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో తాను పైవిధంగా సమాధాన మిచ్చానన్నారు. ఇక రాజ్ కసిరెడ్డి మోసం చేసింది తనను కాదని పార్టీని.. ప్రజలనని విజయసాయిరెడ్డి అభిప్రాయపడ్డారు. హైదరాబాద్, అమరావతిలో జరిగిన భేటీల్లో.. జరిగిన విషయాలపై ఉన్నతాధికారులు అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పానన్నారు. నాటి సిఎం వైఎస్ జగన్ ఓఎస్‌డీ కృష్ణమోహన్ రెడ్డి, ఐఎఎస్ అధికారి ధనుంజయరెడ్డి ఈ సమావేశాలకు వచ్చారా? అని ప్రశ్నించగా.. తనకు గుర్తు ఉన్నంత వరకు వాళ్లెవరూ ఈ సమావేశాలకు రాలేదని తెలిపానన్నారు. కిక్ బాక్స్ గురించి చర్చించారా? అని ప్రశ్నించగా.. తనకు తెలియదని చెప్పానని పేర్కొన్నారు. అలాగే రాజ్ కసిరెడ్డి వసూలు చేసినవి ఎవరికి వెళ్లాయో కూడా తనకు తెలియదని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. అరబిందోవద్ద రూ. వంద కోట్లు అప్పుగా ఇప్పించానని.. అందుకు 12 శాతం వడ్డీకి చెల్లింపులు జరిగేలా అప్పు ఇప్పించానని సిట్ అధికారుల ఎదుట చెప్పినట్లు తెలిపారు. ఇక డీకార్ట్, అదాన్ కంపెనీలకు అప్పులు సైతం ఇప్పించానన్నారు. ఒకరికి రూ. 60 కోట్లు, మరొకరికి రూ. 40 కోట్లు ఇచ్చారని చెప్పానన్నారు. ఈ విచారణలో మరోసారి పిలిచినా వస్తానని.. సిట్ అధికారులకు తాను చెప్పానన్నారు. ప్రాంతీయ పార్టీల్లో నెంబర్ 2 స్థానం ఉండదని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. పార్టీ అధికారంలో లేని సమయంలో అన్నీ తానే చూసుకున్నానని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఇక అధికారంలోకి వచ్చాక నెంబర్ 2 అనేది మిధ్యగా భావించానని తెలిపారు. తనను వెన్నుపోటు దారుడని వైఎస్ జగన్‌కు చెప్పారని.. దీంతో 2వ స్థానం నుంచి తాను 2 వేల స్థానంకు పడిపోయానని చెప్పారు. రాజ్యసభకు తాను పోటీలోనే లేనన్నారు. ప్రజలు కోరుకుంటే రాజకీయాల్లోకి వస్తానని చెప్పారు. సిట్ అధికారులు తనను 4 ప్రశ్నలు అడిగారని, తన జవాబులతో సంతృప్తి చెందారని భావిస్తున్నానన్నారు. రాజ్ కసిరెడ్డిని ప్రశ్నిస్తే మరిన్ని వివరాలు తెలుస్తాయని వ్యాఖ్యానించారు.

# శ్వేత పత్రం విడుదల చేయాలి

>> కేసుకు, మోడీ ప్రభుత్వానికి, కిషన్ రెడ్డికి ఏం సంబంధం? 2012లో ఈ కేసు దాఖలైంది. ఈ కేసుపై న్యాయస్థానం విచారణ చేస్తోందన్నారు. నిన్న మాజీ ఎంపి అంజన్ కుమార్ యాదవ్ ఏం మాట్లాడుతున్నారు? అసలు సభ్యత ఉన్నోళ్లు మాట్లాడే భాషేనా అది అంటూ ప్రశ్నించారు. యంగ్ ఇండియా పేరుతో డూప్లికేట్ గాంధీ కుటుంబం 5 వేల మంది స్వాతంత్ర్య సమరయోధులకు చెందిన 2 వేల కోట్ల విలువైన ఆస్తులను దోచుకుని మనీ లాండరింగ్ పాల్పడితే... ఇక్కడ కాంగ్రెస్ నేతలు యంగ్ ఇండియా బ్రాండ్... ఫోర్త్ సిటీ పేరుతో వేలాది ఎకరాల విలువైన భూములను స్వాధీనం చేసుకుంటూ 50 వేల కోట్లను దోచుకునేందుకు సిద్ధమైంది. ప్రజలు వాస్తవాలు ఆలోచించాలని కోరుతున్నా... సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ (సీడబ్ల్యూసీ) నివేదిక ప్రకారం దేశంలో 8 లక్షల ఎకరాలకుపైగా వక్ఫ్ ఆస్తులున్నాయి. వీటి విలువ 10 లక్షల కోట్ల రూపాయలకు పైమాటే. వీటిపై ఏటా 12వేల కోట్ల రూపాయలకు పైగా ఆదాయం వస్తోంది. ఈ సొమ్మును ఏం చేస్తున్నారని అన్నారు. ఆడిటింగ్ ఉండదు. ఆ సొమ్మునంతా బడా ముస్లిం సంపన్నులు, ఎంఐఎం నాయకులు, ఒవైసీ కుటుంబం దోచుకుంటుందన్నారు. అధికారిక లెక్కల ప్రకారం తెలంగాణలో 77 వేల ఎకరాల వక్ఫ్ లాండ్స్ ఉన్నాయి. వీటిలో కేవలం 20 శాతం అంటే 16వేల ఎకరాల భూములు మాత్రమే దర్గాలు, మసీదులు ఆధీనంలో ఉన్నాయి. మిగిలిన 80శాతం లాండ్స్ ఎవరి చేతిలో ఉన్నాయనుకుంటున్నారు? ఓవైసీ లాంటి వారు అక్రమించుకున్నారని, ఆసుపత్రులు, ఆఫీసులు, వ్యాపారాలు చేసుకుంటూ సంపద పెంచుకుంటున్నారు తప్ప పేద ముస్లింలకు ఏనాడైనా సాయం చేయడం లేదన్నారు. వాళ్ల ఆసుపత్రుల్లోనైనా ఫీజు తీసుకోకుండా ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నారా? దమ్ముంటే చెప్పమన్లాన్నారు. 77వేల ఎకరాల్లో ఒక్క గజం కూడా పేదముస్లింలు అనుభించే పరిస్థితిలో లేరు అన్నారు. రాష్ట్రంలో ఉన్న వక్ఫ్ ఆస్తుల విలువ సుమారు 5లక్షల కోట్ల రూపాయలు. ఇంత పెద్దం మొత్తం ఆస్థి కలిగి ఉన్నప్పటికీ, పెద్ద ఎత్తున వీటిని ద్వారా ఆదాయం వస్తున్నా వాటికి లెక్కా పత్రం లేదు. ధరణి సమయంలో కూడా వేలాది ఎకకరాల వక్ఫ్ భూములు చేతులు మారాయి. ఇవన్నీ మాట్లాడుతుంటే వక్ఫ్ ఆస్తుల్లో హిందువుల జోక్యమా? అంటూ అడ్డగోలుగా మాట్లాడుతున్నారన్నారు. వక్ఫ్ ఆస్తుల ద్వారా వచ్చిన ఆదాయంతో ఇంతవరకు ఏ ఒక్క పేద ముస్లిం జీవితాన్నైనా బాగు చేశారా అన్నారు. అంతెందుకు ఇక్కడ హైడ్రాను ఏర్పాటు చేశారుకదా.. వక్ఫ్ ఆస్తులపై సర్వేచేయించే దమ్ముంటే తక్షణమే విచారణ జరిపించి ఎన్ని భూములు ఆక్రమణకు గురయ్యాయి? వక్ఫ్ ఆస్తులపై ఏటా ఎంత ఆధాయం వస్తోంది? ఆ సొమ్మును వేటి కోసం ఖర్చు చేస్తున్నారు? పేదల సంక్షేమం కోసం ఎంత ఖర్చు చేశారనే వివరాలపై శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు.

# హైదరాబాద్‌లో వర్ష బీభత్సం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్18:** హైదరాబాద్‌లో వర్షం మరోసారి బీభత్సం సృష్టించింది. ఈసారి భారీ వర్షానికి ఈదురుగాలులు తోడయ్యాయి. తూర్పు, మధ్య తెలంగాణ అల్పపీడనం ద్రోణి ప్రభావం, క్యూములోనింబస్ మేఘాలతో శుక్రవారం సాయంత్రం సుమారు 2,3 గంటల పాటు నగరంలోని వివిధ ప్రాంతాలను వర్షం అతలాకుతలం చేసింది. తర్వాత రాత్రి 8 గంటల తర్వాత కూడా వర్షం పడింది. పలుచోట్ల ఈదురుగాలులతో మొదలైన వాన క్రమక్రమంగా నగరమంతా విస్తరించింది. ఈదురు గాలులతో భారీ వర్షం కారణంగా రహదారులు క్షణాల్లోనే చెరువులుగా మారిపోయాయి. రోడ్లపై వాహనదారులు అటు ఈదురు గాలులు, ఇటు వర్షం మధ్య చిక్కుకుపోయి ఇబ్బందులు పడ్డారు. బండ్లగూడలో 8 సెంటీ మీటర్ల వర్షం నమోదు కాగా బహదూర్ పుర 7, చార్మినార్ 7, నాంపల్లిలో 6 సెంటీ మీటర్లుగా నమోదైంది. నాంపల్లి, హిమాయత్‌నగర్, ముషీరాబాద్, ఖైరతాబాద్‌లో ఒక్కసారిగా ఈదురు గాలులలో వాన కురిసింది. మొత్తంగా 21 ప్రాంతాల్లో వృక్షాలు నెలకొరిగాయి. సహాయ చర్యలకోసం హైడ్రాతో పాటు డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. నాంపల్లి రెడ్‌హిల్స్‌లో గాలుల తీవ్రతకు ఓ చెట్టు కూలి పక్కనే ఉన్న ట్రాన్‌ఫార్మర్‌పై పడింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ భారీశబ్ధంతో పేలిపోయింది. అటు బషీర్‌బాగ్‌లోని నిజాం లా కాలేజ్ ముందు కూడా ఓ చెట్టు కూలిపోయింది. దీంతో ఆ మార్గంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది ఏర్పడి వాహనాలు నిలిచిపోయాయి. లంగర్‌హౌస్ బాపునగర్ కాలనీలో భారీ వృక్షం కూలిన ఘటనలో రెండు విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయి. ఫలితంగా ఈ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తిరిగి పునరుద్ధరించేందుకు సుమారు 5 గంటల సమయం పట్టిందని అధికారులు తెలిపారు. గాలుల ఉధృతి తీవ్రంగా ఉండటంతో దాదాపు నగరమంతటా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కుత్బుల్లాపూర్, దుండిగల్, సుచిత్ర, కొంపల్లి, జగద్గిరిగుట్ట తదితర ప్రాంతాల్లోనూ ఈదురుగాలులతో మోస్తరు వర్షం కురిసింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఏరియా పరిధిలో ముందుగా ఈదురుగాలులు భయంకరమైన వాతావరణం సృష్టించాయి. దిల్‌సుఖ్‌నగర్ మలక్‌పేట, కోఠి, చాంద్రాయణగుట్ట, అమీర్‌పేట, ఖైరతాబాద్ చౌరస్తాలు జలమయంగా మారాయి. ఎక్కడాచూసినా నిలిచిపోయిన వాననీటితో ట్రాఫిక్ స్తంభించిపోయింది. బేగంపేట, రాణిగంజ్, ప్యారడైజ్, ప్యాట్నీ, మారేడ్‌పల్లి, సీతాఫల్ మండి, మోండా మార్కెట్, రెజిమెంటల్ బజార్, బోయిన్ పల్లి, ఉప్పల్, తార్నాక, ఎర్రగడ్డ, భరత్‌నగర్, కూకట్‌పల్లి, మియాపూర్, లింగంపల్లి చిగురుటాకులా వణికిపోయింది. తరువాత భారీ వర్షం మొదలైంది. మలక్‌పేటలోని రైల్వే బ్రిడ్జి కిందకు వర్షపు నీరు చేరి ట్రాఫిక్ చాలాసేపు నిలిచిపోయింది. జీహెచ్ఎంసీ సిబ్బంది వచ్చి వర్షం నీరు తోడేసిన తరువాతే వాహనాల రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి. అమీర్‌పేట్, పంజాగుట్ట, మధురనగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పరిసరాల ప్రాంతాల్లో వర్షం కురిసింది. అటు కోఠి, సుల్తాన్ బజార్, బేగంబజార్, మెహదీపట్నం, మాసబ్ ట్యాంక్, కార్వాన్, ఎల్బీనగర్, వనస్థలిపురం, భాగ్యలత, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్, అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతంలోనూ సుమారు 2 గంటల పాటు ఏకదాటిగా వర్షం కురిసింది. ఈ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది.

**మంత్రి పొన్నం సమీక్ష**

హైదరాబాద్‌లో భారీ వర్షాలు, సహాయక చర్యలపై జిల్లా ఇంఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. జీహెచ్ఎంసీ అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ కూలిన చెట్లను వెంటనే తొలగించాలని డీఆర్ఎఫ్ సిబ్బందికి ఆదేశించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నిర్దేశించిన పొన్నం రోడ్లపై నీరు నిలిస్తే వెంటనే తొలగించాలన్నారు. మరోసారి భారీ వర్షం పడనుందన్న వాతావరణశాఖ హెచ్చరికల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప బయటికి వెళ్లొద్దని, ఈదురుగాలులు వస్తున్నందున జాగ్రత్తగా ఉండాలన్నారు.

# ఒకే తాను ముక్కలు

>> కంగా పోరాటం చేసిన స్వాతంత్ర్య సమర యోధులు, ఉద్యమ కారుల వారసత్వాన్ని బిజెపి కొనసాగిస్తుందని, కేంద్రమంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి అన్నారు. మజ్లీస్ పార్టీ పాత పట్నానికి మాత్రమే పరిమితం కాలేదు. ప్రస్తుతం తెలంగాణాలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో చాపకింద నీరులా విస్తరిస్తుందన్నారు. బిజెపిని ఓడించాలనే లక్ష్యంతో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు మజ్లీస్ పార్టీకి విజయాన్ని కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ మూడు పార్టీలు ఒకే తాను ముక్కలుగా కల్సి పనిచేస్తున్నాయని ఆయన ఆరోపించారు. మజ్లీస్ పార్టీని గెలిపించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుట్రలు చేస్తున్నాయి. తెలంగాణా ప్రజలు చైతన్యంగా ఆలోచించకపోతే మళ్లీ రజాకార్ల పాలన లాంటి పరిస్థితులు దాపురించే ప్రమాదం ఉందన్నారు. మజ్లీస్ నాయకులు పాత పట్నంలో హిందువుల ఇళ్లను స్వాధీనం చేసుకుని ప్రజలకు ఖాళీ చేయించిన ఘటనలు చాలా ఉన్నాయన్నారు. తెలంగాణాను, హైదరాబాద్‌ను బలి చేసేందుకు కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు వెనుకాడటం లేదన్నారు. బిజెపి ప్రజలను జాగృతం చేయాలనే పవిత్ర ఉద్దేశ్యంతో హైదరాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తోంది. మాకు గెలుపొక్కటే ముఖ్యం కాదని, హైదరాబాద్‌ను రక్షించడం కూడా ప్రధాన లక్ష్యం అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

మజ్లీస్‌పార్టీ మతోన్మాదం, గూండాయిజాన్ని ఎదుర్కొంటూ బిజెపి ధర్మయుద్ధం చేస్తుందన్నారు. బిఆర్ఎస్ హయాంలో హైటెక్ సిటీలో రంగులు వేసి అభివృద్ధి అంటూ ప్రచారం చేసారు కానీ అభివృద్ధి పేరు చెప్పి ఎక్కడైతే రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎక్కువ ఉందో అక్కడే పనులు జరిగాయి. ఇరుకైన రోడ్లే నిర్మించారు. జిహెచ్ఎంసి స్థితి దారుణంగా మారింది. వీధిలైట్లు కొనడానికి కూడా డబ్బుల్లేని స్థితికి దిగజారిందని ఆరోపించారు. ప్రభుత్వ పనితీరు అసమర్థంగా ఉంది. పౌరసరఫరాల మెరుగుదలకు నిధులు పెరగడంలేదు.

మజ్లీస్ పార్టీ నుంచి నగరాన్ని రక్షించాలంటే ప్రజలు చైతన్యంతో ఓటు వేయాలని కిషన్ రెడ్డి పిలుపు నిచ్చారు. తెలంగాణాలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వచ్చినపుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవు తుందన్నారు. కాంగ్రెస్ నాయకులు విదేశీ పెట్టుబడుల గురించి చెబుతున్నారు. కానీ అవి ఎక్కడికి వెళ్లాయి అని ఆయన ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఆర్థిక సంస్కరణలు ,పన్నుల సంస్కరణలు, ఉగ్రవాదం, మతోన్మాదం, అరికట్టడం, సమర్థవంతమైన విదేశాంగ విధానం ఇలా అన్నింటిలో ప్రగతి కన్పిస్తుందన్నారు. హైదరాబాద్ అంటే హైటెక్ సిటీయే కాదు. అంబర్‌పేట, సనత్‌నగర్, మల్కాజ్‌గిరి ,దిల్‌షుక్ నగర్, గౌలిపుర, ఛార్మినార్, నాంపల్లి, సోమాజీగూడా, ఖైరతాబాద్, కూకట్‌పల్లి వంటి ప్రాంతాల్లో ప్రజల సౌకర్యాలు మెరుగు పర్చాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లీస్ పార్టీలు తెలంగాణాను ముంచే ఎత్తుగడలే వేస్తున్నాయన్నారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి గౌతంరావును గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## వారం - వర్జ్యం

తేది : 19-04-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
కృ.షష్ఠి సా.6.18
మూల ఉ.10.18
వర్జ్యం రా.8.29-రా.10.11
దు.తె.5.50-ఉ.7.28
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**వృషభం:** మిత్రుల నుండి శుభవార్తలు అందుకుంటారు. ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి.

**మిథునం:** కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**కర్కాటకం :** వృత్తి, వ్యాపారాలు లాభ సాటిగా సాగుతాయి. ఋణ వత్తిడులు తొలుగుతాయి. వస్తులాభం.

**సింహం:** కుటుంబ సమస్యలు పరిష్కరించు కుంటారు. ప్రముఖుల నుండి కీలక సమాచారం అందుకుంటారు.

**కన్య :** వ్యాపారాలలో మార్పులు వుంటాయి. ఉద్యోగులకు స్థాన మార్పులు వుంటాయి. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

**తుల :** అనుకోని అవకాశాలు లభిస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకోండి. ప్రయాణాలు లాభిస్తాయి.

**వృశ్చికం:** దూర ప్రాంతాల నుండి వచ్చిన వార్త కొంత గందరగోళం కలిగిస్తుంది. వివాదాలకు దూరంగా వుండండి.

**ధనుస్సు:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి.

**మకరం:** ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి.

**కుంభం:** ప్రయాణాలు లాభిస్తాయి. సన్నిహితులను కలిసి ఆనందంగా గడుపుతారు. వస్తు వస్త్రాలు కొనుగోలు.

**మీనం :** చేపట్టిన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. బంధువుల నుండి శుభవార్తలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

19-4-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 77 పేజీలు: 10+4 వెల: 6.50



టెస్లా అధినేత మస్క్‌తో ప్రధాని మోడీ ఫోన్ సంభాషణ 5లో

రుద్రారంలో తోషిబా ఫ్యాక్టరీ 7లో


# హైదరాబాద్‌లో ఎఐ డేటా సెంటర్



శుక్రవారం టోక్యోలో సిఎం రేవంత్ సమక్షంలో ఎంఒయు కుదుర్చుకున్న జపాన్ సంస్థలు

## ఎన్‌టిటి డేటా, నెయిసా సంయుక్తంగా రూ.10,500 కోట్ల పెట్టుబడులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్18:** జపాన్ పర్యటనలో ఉన్న సిఎం రేవంత్ రెడ్డి బృందం హైదరాబాద్‌లో భారీ పెట్టుబడులను సాధించింది. డిజిటల్ ట్రాన్స్‌ఫ్రర్మేషన్, ఐటీ సర్వీసుల్లో ప్రపంచంలో పేరొందిన ఎన్‌టిటి డేటా, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫస్ట్ క్లౌడ్ ప్లాట్‌ఫాం సంస్థ నెయిసా నెట్ వర్క్స్ సంయుక్తంగా హైదరాబాద్‌లో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ముందుకొచ్చాయి. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి దాదాపు రూ.10,500 కోట్ల పెట్టుబడితో ఈ క్లస్టర్ ఏర్పాటుచేసేందుకు త్రైపాక్షికఒప్పందం (ఎమ్ఒయూ) శుక్రవారం కుదుర్చుకున్నాయి. టోక్యోలో జరిగిన ఉన్నత స్థాయి సమావే >>2

## నేడు జెఇఇ మెయిన్ ఫలితాలు

### ఫైనల్ కీ విడుదలచేసిన ఎన్‌టిఎ

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** దేశంలోని ఎన్ఐటిలు, ట్రిపుల్ఐటిల్లో బిటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయస్థాయిలో నిర్వ హించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (జెఇఇ) మెయిన్స్-2కి సంబంధించిన ఫైనల్ కీని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఎ) విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన ఫైనల్ కీని ఎన్‌టిఎ శుక్రవారం మధ్యాహ్నం విడుదల చేసింది. మొదట జెఇఇ మెయిన్ రెండోవిడత ఫైనల్ కీని గురువారమే విడుదల చేస్తామని ప్రకటించిన ఎన్‌టిఎ సాయంత్రం ఫైనల్ కీని అప్‌లోడ్ చేసింది. గురువారం సాయంత్రం జెఇఇ మెయిన్స్ ఫైనల్ కీని విడుదల చేసిన ఎన్‌టిఎ.. కొద్దిసేపటికే దానిని అధికారిక వెబ్‌సైట్‌నుంచి తొలగించింది. దీంతో ఫలితాల కోసం ఎదురు చూసిన అభ్యర్థులు వారి తల్లిదండ్రులు తీవ్ర గందరగోళానికి గురయ్యారు. ఫైనల్ కీ, ఫలితాల విడుదలపై ఎన్‌టిఎ శుక్రవారంఎక్స్ వేదికగా >>2



శుక్రవారం కురిసిన భారీ వర్షానికి బషీర్‌బాగ్ వద్ద నేలకు ఒరిగిన చెట్టు

## హైదరాబాద్‌లో వర్ష బీభత్సం

కూలిన వృక్షాలు, స్తంభించిన ట్రాఫిక్ 2లో



శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో మాట్లాడుతున్న మాజీ సిఎం

## రజతోత్సవ సభలో మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు

### - మాజీ సిఎం కెసిఆర్

**మర్కుక్, ఏప్రిల్ 18 (ప్రభాతవార్త):** ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరుగనున్న బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ నేపథ్యంలో శుక్రవారం మండల పరిధిలోని కెసిఆర్ వ్యవసాయ క్షేత్రంలో ఎమ్మెల్సీ కవిత, ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు, పార్టీ మహిళ నేతలతో కెసిఆర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ ఏర్పాటులో భాగంగా మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు, సభ విజయవంతంలో వారి భాగస్వామ్యం, అనుసరించాల్సిన వ్యూహాలు, కార్యాచరణకు సంబంధించిన సూచనలు చేశారు. రజతోత్సవ >>2

## నేటి నుంచి అందుబాటులో ఎప్‌సెట్ హాల్ టికెట్లు

### ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో వివిధ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్ సెట్ కంటే ముందే ప్రైవేటు యూనివర్సిటీలు అడ్మిషన్లను చేపడుతున్నాయని.. తద్వారా మెరిట్ విద్యార్థులు కొందరు అక్కడికి వెళ్తున్న పరిస్థితి నెలకొందని తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, జేఎన్‌టియూ విసి ప్రొఫెసర్ కిషన్ కుమార్‌రెడ్డి అన్నారు. దీనిపై ప్రభుత్వంతగిన విధాన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. నేటి(శనివారం ఏప్రిల్ 19) నుంచి అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు రాసే అభ్యర్థుల హాల్ టికెట్లను అందుబాటులోకి తెచ్చామని.. ఈ నెల 29, 30 తేదిల్లో పరీక్షలను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు ఎప్‌సెట్-2025కి 3,05,774 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. ఎప్‌సెట్-2025 నిర్వహణకి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్టు వారు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను వారు శుక్రవారం జేఎన్‌టియూ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రకటించారు. విలేకరుల సమావేశంలో జేఎన్‌టియూ రెక్టార్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు, ఎప్‌సెట్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ డీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 29,30 తేదిల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలను.. మే 2 నుంచి 4 వరకు ఇంజనీరింగ్ పరీక్షలను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇంజనీరింగ్‌కి 2,19,420 దరఖాస్తులు, అగ్రికల్చర్, ఫార్మసీకి 86,101 దరకాస్తులు రాగా.. రెండింటికి కలిపి 253 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలకు 112 కేంద్రాలను ఏర్పాటు చేయగా.. ఇంజనీరింగ్ పరీక్షలకు 124 కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పరీక్షలను రెండు సెషన్‌లలో నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు .. తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈసారి మొదటిసారిగా విద్యార్థులకు జారీ చేసిన హాల్ టికెట్లపై క్విక్ >>2



ములుగుజిల్లా వెంకటాపూర్‌లో జరిగిన భూభారతి సమావేశంలో మంత్రులు పొంగులేటి, సీతక్క, కొండ సురేఖ

## భూభారతి చట్టంతోనే రైతులకు న్యాయం

### రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ములుగు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** భూభారతి చట్టంతో తెలంగాణ రాష్ట్రంలోని రైతుల సమస్యలను తీర్చుతామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టాన్ని ములుగు జిల్లాలోని వెంకటాపూర్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఈ చట్టాన్ని మండల ప్రజలకు అవగాహన కల్పించేందుకుగాను జిల్లా కలెక్టర్ అధ్యక్షతన అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క, కొండ సురేఖలతోపాటు ఎంపి పోరిక బలరాం నాయక్ హాజరయ్యారు. మొదట హెలికాప్టర్లో వచ్చిన మంత్రులను జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ పుష్పగుచ్చం ఇచ్చి స్వాగతం పలికారు. అప్పటికే వేలాదిమంది కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ములుగు చేరుకోగా వారంతా ర్యాలీగా మంత్రులనుతీసుకొని ములుగు >>2

## భగవద్గీత, నాట్యశాస్త్రానికి యునెస్కో గుర్తింపు

### ప్రతి భారతీయుడికి ఇది గర్వకారణం: ప్రధాని మోడీ



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్18:** యునెస్కో మెమరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు తార్కాణంగాపిలిచే పవిత్రగ్రంథం భగవద్గీత, భరత ముని రచించిన నాట్యశాస్త్రాలకు చోటు దక్కింది. భారతదేశ సంస్కృతి, చారిత్రక, తాత్విక వారసత్వానికి ప్రతీకలుగా గుర్తిస్తూ యునెస్కో ఈ గౌరవాన్ని కల్పించింది. ఈవిషయాన్ని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ఎక్స్ వేదికగా పంచుకున్నారు. ఈ ఘనతపై ప్రధాని మోడీ సంతోషం వ్యక్తం చేస్తూ ఎక్స్‌లో ఇలా ట్వీట్ చేశారు."ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి భారతీయుడికి ఇది గర్వ కారణం. యునెస్కో మెమరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో >>2

## మద్యం విక్రయాల్లో కసిరెడ్డే కీలకం

### సిట్ విచారణకు హాజరైన విజయసాయి

**విజయవాడ, ఏప్రిల్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం విక్రయాల్లో తాను ఎప్పుడు జోక్యం చేసుకోలేదని రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయి రెడ్డి స్పష్టం చేశారు. అప్పటి మద్యం విక్రయాల్లో కర్మ, కర్త, క్రియ అంతా రాజ్ కసిరెడ్డి అని ఆయన స్పష్టం చేశారు.శుక్రవారం ఎపి లిక్కర్ స్కామ్ వ్యవహారంపై విజయవాడ నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సిట్ విచారణకు విజయసాయిరెడ్డి హాజరయ్యారు.అనంతరం విజయసాయి రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. రాజ్ >>2

## మజ్లీస్, కాంగ్రెస్, బిఆర్ఎస్ ఒకే తాను ముక్కలు



శుక్రవారం ఎమ్మెల్సీ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

### స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్ ఎందుకు పోటీ చేయడంలేదో స్పష్టం చేయాలి: కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**బేగంపేట ఏప్రిల్ 18,ప్రభాతవార్త :** ప్రజలను దోపిడీ చేసి ఆడబిడ్డలపై అఘాయిత్యాలకు పాల్పడిన మజ్లిస్ పార్టీకి కాంగ్రెస్, బిఆర్ఎస్ జీహుజూర్ అంటున్నాయని, హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్ ఎందుకు పోటీ చేయడం లేదో స్పష్టం చేయాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు.శుక్రవారం బేగంపేట హరిత ప్లాజాలో స్థానిక ఎమ్మెల్సీఎన్నికల సన్నాహక సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ మజ్లీస్‌పై ఘాటైన వ్యాఖ్యలు చేసారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ మజ్లీస్ పార్టీకి వంగివంగి సలాం కొడుతున్న రాహుల్ గాంధీ, కెసిఆర్‌కు బిజెపిని విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. మజ్లీస్‌పార్టీ రజాకార్లకు వ్యతిరే >>2

## తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

### జపాన్ పారిశ్రామికవేత్తలకు సిఎం రేవంత్ రెడ్డి పిలుపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్18:** తెలంగాణలో పెట్టుబడులు పెట్టి అభివృద్ధి చెందాలని జపాన్ పారిశ్రామిక, వ్యాపారవేతలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానం పలికారు. శుక్రవారం టోక్యోలోని హోటల్ ఇంపీరియల్‌లో జరిగిన ఇండియా, జపాన్ ఎకనామిక్ పార్టనర్‌షిప్ రోడ్‌షోలో తెలంగాణ రాష్ట్ర అధికారిక బృందం రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించింది. వివిధ రంగాలకు చెందిన దాదాపు 150 మందికి పైగా జపాన్ పారిశ్రామికవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ రోడ్ షోలో మాట్లాడిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి జపాన్ పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు రావాలని సాదరంగా ఆహ్వానించారు. 'దేశంలోనే కొత్త రాష్ట్రం.. అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న తెలంగాణ మీకు హృదయపూర్వకంగా స్వాగతం పలుకుతోంది.. జపాన్‌ను ఉదయించే సూర్యుడి దేశం అని పిలుస్తారు. మా ప్రభుత్వ నినాదం 'తెలంగాణ రైజింగ్'. ఈ రోజు తెలంగాణ జపాన్‌లో ఉదయి >>2

## సజీవ దహన ఘటనలో నిందితుడు విడుదల



మహేంద్ర హేంబ్రాం

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** ఒడిషాలో 1999లో సంచలనం రేపిన గ్రహం స్టెయిన్స్ అతని ఇద్దరు పిల్లల సజీవ దహనం కేసులో జీవిత ఖైదు శిక్షపడ్డ మహేంద్ర హేంబ్రాం శుక్రవారం నాడు జైలు నుంచి విడుదలయ్యాడు. ఒడిషాలోని కియోంఝర్ జిల్లా జైలులో ఇంత కాలం వున్న ఇతన్ని ఆ రాష్ట్ర సర్కారు సత్ప్రవర్తన కింద విడుదల చేసింది. ఒడిషాలోని కియోంఝర్ జిల్లాలోని మనోహర్‌పూర్ గ్రామంలో 1999 జనవరి 22వ తేదీన ఈ దారుణం జరిగింది. ఒడిషాలో కుష్టు రోగులకు సేవ చేస్తున్న స్టెయిన్ కుటుంబం ఇదే ప్రాంతంలోని చర్చిలో లేదా సమీపంలోని క్రైస్తవ మతానికి చెందిన శిబిరంలో వుండేది. అయితే సేవల మాటున ఇతను మతమార్పిడికి పాల్పడుతున్నట్లు బజరంగ్ దళ్ అప్పట్లో ఆరోపించింది. ఆస్ట్రేలియాకు చెందిన >>2

## వక్ఫ్ ఆస్తులు, ఆదాయ, వ్యయాలపై శ్వేత పత్రం విడుదల చేయాలి

### మజ్లీస్ సభకు రేవంత్ ఆర్థిక సాయం : కేంద్రమంత్రి బండి సంజయ్

**హైదరాబాద్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** వక్ఫ్ భూములు, నేషనల్ హెరాల్డ్ ఆస్తులపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మనోహర్‌రెడ్డి, కార్యదర్శులు ఎస్.ప్రకాశ్‌రెడ్డి, ఉమారాణి, అధికార ప్రతినిధులు విఠల్, రాణి రుద్రమాదేవి, ఎమ్మెల్సీ అభ్యర్థి గౌతమ్‌రావు, యువమోర్చా రాష్ట్ర అధ్యక్షులు మహేందర్ తదితరులతో కలిసి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా మజ్లిస్ పార్టీ హైదరాబాద్‌లో నిర్వహించబోతున్న బహిరంగ సభకు రేవంత్‌రెడ్డి సర్కార్ ఆర్థిక సహకారం అందిస్తోందని వ్యాఖ్యానించారు. సభలు, సమావేశాలు, ఆందోళనల పేరుతో అల్లర్లకు కుట్ర చేస్తున్నాయని చెప్పారు. ఇదే జరిగితే హైదరాబాద్‌లో బెంగాల్ తరహా పరిస్థితులు ఉత్పన్నమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కట్టడి చేయాల్సిన అవసరం ఉందని, లేనిపక్షంలో జరగబోయే పరిణామాలకు రేవంత్‌రెడ్డి సర్కారే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. నేషనల్ హెరాల్డ్ కేసు విషయంలో బిజెపికి ఏం సంబంధమని బండి సంజయ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలంతా ధర్నా చేయాల్సింది ఇడి ఆఫీస్ ముందు కాదని, ఆ ఆస్తులను కాజేసేందుకు కుట్రచేసిన సోనియాగాంధీ నివాసం ఎదుటఅని సూచించారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ నేతలుచేసింది బూతు ధర్నా. ప్రధానిని, కేంద్ర మంత్రి పట్ల గౌరవం లేకుండా బూతులు మాట్లాడిన కాంగ్రెస్ నేతలను ఏమనుకోవాలో పార్టీ రాష్ట్ర ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి సమాధానం చెప్పాలన్నారు. వాళ్లు మాట్లాడిన బూతులను మీరు సమర్థిస్తున్నారా? అంటూ ప్రశ్నించారు. ఈ >>2


సీతారామ ప్రాజెక్టులో లోపాలు ఎన్నెన్నో 5లో





వార్త

మాట ఇవ్వటానికి తొందరపడొద్దు. ఇచ్చిన మాట నెరవేర్చడానికి వెనుకాడవద్దు.

-లియో టాల్‌స్టాయ్

# అమలు చేయలేని చట్టాలెందుకు?

రోజా మొక్కకు ముళ్లు, మొగ్గలుంటాయి. ముల్లు గుచ్చుకున్నప్పుడు నొప్పి కలుగుతుంది. మొగ్గలు లభ్యమైనప్పుడు ముఖం వికసిస్తుంది. ఈ వికార వికాసాలు ఆయా వ్యక్తుల మనోభావాలపై ఆధారపడి ఉంటాయి. ప్రభుత్వం చేసే చట్టాలు కొందరికి బాధ కలిగించవచ్చు. మరికొందరికి ఎంతో ఊరట కలిగించవచ్చు. పాలకులు ఇలాంటి విషయాల్లో సమగ్ర అధ్యయనం చేసి తాము చేసే చట్టాల వల్ల ఎవరికి ఉపయోగం, మరెవరికి నష్టం, నష్టపోయిన వారిని ఎలా ఆదుకోవాలి, అమలులో సాధక బాధకాలు, సాధ్యాసాధ్యాలు, అసలు ఆ చట్టం అమలు చేసే సామర్థ్యం, అందుకు తగిన సిబ్బంది ఉందా? తదితర అంశాలను పరిశీలించి చట్టం చేయాలి. బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగడం నిషేధిస్తూ కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టం సమగ్ర అధ్యయనం అనంతరం విడుదల చేశారా? అనే విషయంలో అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. మద్యపానం, ధూమపానం రెండూ మానవజాతిని పట్టిపీడిస్తున్న రెండు భూతాలు. ఒకటి బ్రహ్మరాక్షసి అయితే మరొకటి పిశాచం. ఇందులో మరో వాదనకు తావులేదు. మద్యపానాన్ని పెంచి పోషిస్తూ ఆదాయ వనరులుగా మల్చుకుంటున్న పాలకులు ధూమపానం విషయంలో చట్టం చేయడం కొంతలో కొంత మేలని చెప్పొచ్చు. ఊపిరితిత్తుల కేన్సర్ లాంటి మరెన్నో రోగాలకు ధూమపానం కేంద్ర బిందువని, ఎందరో వైద్యనిపుణుల అధ్యయనంలో తేలింది. ప్రపంచవ్యాప్తంగా 130 కోట్ల మందికిపైగా ధూమపానంలో మునిగితేలుతున్నారు. భారతదేశానికి సంబంధించి దాదాపు ఇరవై కోట్ల మంది పొగాకుకు అలవాటుపడుతున్నారు. ఇందులో బీడీలు తాగేవారే ఎక్కువ ఉన్నారు. బీడీలు, సిగరెట్లు తాగడం సరదాగా ఆరంభమై ఆ తర్వాత అలవాటుగా మారిపోతున్నది. పదిహేనేళ్ల వయసులోనే ఇది ఆరంభం కావడం ఆందోళన కలిగించే అంశం. దేశవ్యాప్తంగా కోట్లాది మంది రకరకాల రోగాలబారిన పడుతుంటే లక్షలాది మంది అసువులు బాస్తున్నారు. సిగరెట్ పొగలో దాదాపు నాలుగు వేల ఎనిమిది వందలకుపైగా ప్రమాదకర విషవాయువులున్నాయని గుర్తించారు. ఇవి అనేక రోగాలకు కారణమవుతున్నాయి. ఈ పొగను పారద్రోలేందుకు కేంద్ర ప్రభుత్వం దశాబ్దాల క్రితమే ప్రయత్నాలు ఆరంభించింది. అందుకు అభినందించాల్సిందే. కానీ అందువల్ల జీవనోపాధి కోల్పోతున్న కుటుంబాల గురించి పట్టించుకోకపోవడం దురదృష్టకరం. గతంలో బీడీల కట్టల మీద భయం కొల్పే పుర్రెబొమ్మ, శవం బొమ్మ ముద్రించాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో లక్షలాది మంది బీడీ కార్మికుల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమైంది. జీవనోపాధి కోల్పోతున్నామని ఆందోళనకు దిగి రోడ్లపైకి వచ్చారు. బీడీ పరిశ్రమ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కోట్లాది మందికి బతుకుతెరువు ఇస్తున్నదనేది వాస్తవం. అడవుల్లో ఉన్న లక్షలాది గిరిజన కుటుంబాలకు బీడీఆకు సేకరణ ప్రధాన ఆదాయవనరుల్లో ఒకటి. కొన్ని శతాబ్దాలుగా అదొక కుటీర పరిశ్రమగా వర్థిల్లుతున్నది. ఈ వాస్తవాలను పట్టించుకోకుండా పొగాకు వినియోగాన్ని తగ్గించేందుకు ప్రయత్నం చేయడం అవివేకమనిస్తున్నది. దీంతో వారంతా సంఘటితమై ఎదురు తిరగడం రాజకీయ ఒత్తిడిలు తోడుకావడంతో ఆనాడే విరమించుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయి. మళ్లీ 2003లో బహిరంగ ప్రదేశాల్లో ధూమపానాన్ని నిషేధించే చట్టం తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం పేర్కొన్న బహిరంగ ప్రదేశాల్లో రోడ్లు లేకపోవడం పెద్ద లోపంగా కొట్టొచ్చినట్టు కనపడింది. అంతేకాదు ఈ చట్టం అమలు చేసేందుకు అవసరమైన యంత్రాంగం కూడా లేదు. అసలు వ్యవస్థ లేదని చెప్పొచ్చు. అంతా అయోమయ పరిస్థితి. ఇక పొగాకు ఉత్పత్తులపై లక్షలాది కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. దేశవ్యాప్తంగా దాదాపు నలభైవేల కోట్ల రూపాయలకుపైగా పొగాకు వ్యాపారం జరుగుతుందనిఅంచనా. లక్షలాది మంది రైతులు పొగాకు సాగుపై ఆధారపడి ఉన్నారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి కూడా ఇప్పటికీ గుంటూరు, కృష్ణా, ఉభయగోదావరి, ఖమ్మం, నిజామాబాద్, ఆదిలాబాద్ తదితర జిల్లాల్లో పొగాకు పండిస్తున్నారు. ప్రభుత్వమే ప్రోత్సాహకాలు ఇచ్చి మరీపొగాకు పంటలను రైతులతో సాగు చేయించి అలవాటు చేశారు. రైతులతోపాటు మరెంతో మంది రైతు కూలీలు దీనిపై ఆధారపడి ఉన్నారు. ఆ కుటుంబాలు వీధిపాలు కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. వారికి ముందుగా ప్రత్యామ్నాయం చూపించాలి. అవేమీ పట్టించుకోకుండా కాగితాలపై చట్టాలు చేసిచేతులు దులుపుకుంటేప్రయోజనం ఉండదు. అంతేకాదు పొగాకు ఉత్పత్తుల అమ్మకాలపై వివిధ పన్నుల రూపంలో వేలాది కోట్ల రూపాయలు యేటా వసూలు చేసుకుంటున్నారు. ఈ ఉత్పత్తులను అమ్ముకునేందుకు లైసెన్సులు ఇస్తున్నారు. ఎక్కడ పడితే అక్కడ అమ్ముతన్నారు. దేవాలయాల ముందు పాఠశాలలు, కళాశాలల ప్రాంగణాల సమీపంలో ఒక చోటేమిటి మంచినీళ్లు దొరకని ప్రదేశాలు ఉన్నాయేమో కానీ సిగరెట్లు, బీడీలు దొరకని గ్రామాలు, ప్రదేశాలు లేవు. ఆదాయం కోసమే ప్రభుత్వం లైసెన్సులు ఇచ్చి ప్రోత్సహిస్తూ, మరొకపక్క నిషేధిస్తామని ప్రయత్నం చేయడం ఎంతవరకు సమంజసమో ఆత్మపరిశీలన చేసుకోవాలి. ప్రభుత్వానికే చిత్తశుద్ధి ఉంటే జీవనోపాధి కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయం చూపి పొగాకు ఉత్ప త్తులను, అమ్మకాలను, వినియోగాన్ని భూటాన్ దేశంలో లాగా పూర్తిగా నిషేధించాలి. అప్పుడే దీనికి పరిష్కారం దొరుకుతుంది. ధూమపానానికి కొంత వరకైనా ఫుల్‌స్టాప్ పెట్టించినవారవుతారు.

నీలో ఉన్న శక్తిని నీవు తెలుసుకున్నప్పుడే గమ్యం చేరగలవు. కనుక ముందు నీ గురించి నీవే పరిశోధించుకో.



రామకృష్ణ పరమహంస

న్యాయం గెలవడానికి ఒక్క కారణం చాలు. అన్యాయం నిలవడానికి సవాలక్ష సాకులు కావాలి.



ఆల్బర్ట్‌కామూ

## ప్రజావాక్కు



### ఒకే నిష్పత్తిలో ఉపాధ్యాయులను నియమించాలి

ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రప్రభుత్వం ఉన్నతపాఠశాలల్లో ప్రాథమిక తరగతులకు, మిగిలిన ఫౌండేషన్, బేసిక్ ప్రైమరీ స్కూళ్ల టీచర్ పీపుల్ రేషియోలో తేడాలు ఉండే విధంగా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను కేటాయిస్తున్నది. అన్నిరకాల స్కూల్స్‌లో ప్రాథమిక తరగతులు బోధించే ఎస్జీటీ పోస్టులు కేటాయించడంలో వ్యత్యాసాలు తగదు. ఈ విధానం అనుసరించడం వల్ల ఫౌండేషన్ స్కూల్స్ బేసిక్ ప్రైమరీ స్కూల్స్ పూర్తిగా నిర్వీర్యమయ్యే అవకాశంఉంది. కాబట్టి ప్రభుత్వం ప్రాథమిక తరగతులు ఉన్న అన్నీ స్కూల్స్‌లో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి ఒకే విధంగా ఉండేలా చూడాలి. బేసిక్ ప్రైమరీ స్కూల్స్‌లో 20 మంది వరకు ఒక ఎస్జీటీ, 21 నుంచి 60వరకు 2ఎస్జీటీలు, 60నుంచి 90 వరకు 3ఎస్జీటీలు ప్రభుత్వం కేటాయిస్తున్నది. ఇదే ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి విధానాన్ని బేసిక్ ప్రైమరీ స్కూల్ ఫౌండేషన్ స్కూల్స్‌కు కూడా వర్తింపజేయాలి.

-వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్

### ఆదేశిక సూత్రాలు పాటించని ప్రభుత్వాలు

సాధారణంగా ఆదేశిక సూత్రాలు అనేవిప్రభుత్వం ఎలా నడవాలి అని తెలియజేస్తాయి. మరి ఆదేశికాలబాటలో ప్రభుత్వాలు నడుస్తున్నాయా అంటే లేదనే సమాధానమే వస్తుంది. ఒక గవర్నర్ వ్యవస్థని తీసుకోండి ఇప్పటి గవర్నర్లు సర్వాంతర్యామి అనుకుంటున్నారు. కేరళ తమిళనాడు ఉదంతాలు వాటికేఉదాహరణలు. దేశంలో ఎన్నడూ లేనివిధంగా సుప్రీం కోర్టు బిల్లులను పాస్ చేయడం గవర్నర్ వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనం. గవర్నర్ కేంద్రప్రభుత్వం అధికారంలోఉన్న రాష్ట్రాలలో ఒకలాగా విపక్షపార్టీలు అధికారంలో ఉన్నరాష్ట్రాలలో మరొకలా చేయడం పరిపాటిగా మారింది.

-భారత అవినాష్, జనగామ

### శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేయాలి

విద్యార్థులకు వేసవి సెలవులు అనగానే సంతోషం. ఈ సెలవులలో ఉష్ణోగ్రతల తాకిడికి, వడగాలులు వంటి వాటి నుండి వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవడానికి ప్రభుత్వం విద్యాశాఖ ద్వారా విజ్ఞానానికి సంబంధించిన వినోదానికి సృజనాత్మకతకు, సంస్కృతిక కార్యక్రమాలు, ఆటలుపాటలు డ్రాయింగ్‌వంటి సబ్జెక్టులను కొంత జ్ఞానం సంపాదించడానికి గాను ప్రత్యేక క్లాసులు అవసరం.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### అవినీతిపై చర్యలేవి?

టిటిడి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలలో గత ప్రభుత్వఅయిదు సంవత్సరాల పాలనలో పూర్తిగా అవినీతి జరిగిందని దేవస్థానం కార్యనిర్వహణ అధికారి ప్రకటించారు. దేవస్థానం చైర్మన్, పాలకవర్గ సభ్యులు కూడా గతపాలనలో అంతా అవినీతి, దోపిడీ జరిగినట్లు పలు ఆరోపణలుచేస్తున్నారు. అలాగే, గతంలో దేవస్థానానికి చెందిన పింక్ డైమండ్ దొంగిలించారని అసత్య ఆరోపణలు చేశారు. కల్తీ నెయ్యి వ్యవహారం పై కూడా గత ప్రభుత్వ పాలనలోని పాలకవర్గాల ప్రమేయంపై కూడా ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇలా ఆరోపణలు, పత్రికా ప్రకట నలతో ఎటువంటి ప్రయోజనం లేదు. బాధ్యులను గుర్తించి చట్టపరమైనచర్యలనువేగవంతం చేస్తేనే భక్తుల మనోభావాలకు న్యాయం చేకూరుతుంది. ఇప్పటికే నమోదు చేసిన కేసుల పురోగతిపై దేవస్థానం ఒక శ్వేతపత్రం విడుదల చేస్తే దేవస్థానం పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయి.

-జి. రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

### సాంక్షన్ పోస్టులకు సబ్జెక్టులు పెట్టండి

గురుకుల విద్యాభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చాలా కృషి చేస్తుంది. గురుకులాలలో టీచింగ్ స్టాఫ్ టీచర్స్ లెక్చరర్స్ పోస్టులు సాంక్షన్ అయ్యి టీచింగ్ స్టాఫ్ ఉన్నచోట తప్పనిసరిగా సంబంధిత సబ్జెక్టులను వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభించాలి. పేదవిద్యార్థులు చదువుకునే అవకాశంఉంటుంది. గురుకుల జూనియర్ కళాశాలలో గత సంవత్సరం పోస్టులను భర్తీ చేయడం జరిగింది. తగిన సబ్జెక్టులను కూడా ప్రవేశపెట్టాలి. పేద విద్యార్థులకు ఉన్నత విద్యలను అభ్యసించడానికి కృషి చేయాలి. పేద విద్యార్థుల విజ్ఞాన అభివృద్ధికి కృషిచేయాలి.

-రాపాక రవీందర్, జనగాం

### అభివృద్ధి అంటే ఇదేనా?

అభివృద్ధి చెందుతున్న దేశంలో పరిశ్రమలు, వాహనాలు ఎక్కువ కావడంతో గాలి, నీరు కలుషితమై ప్రజలు అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ కలుషితమైన గాలిని పీల్చడం వల్ల కేన్సర్ అనే భయంకరమైన వ్యాధి ప్రజలను పట్టి పీడిస్తోంది. జల కాలుష్యం వల్లదాహమేస్తే నీళ్ల తాగడానికి భయపడిపోతున్నారుప్రజలు. గత్యంతరంలేక ప్లాస్టిక్‌బాటిల్‌లో నిల్వ చేసిన నీళ్లతో తృప్తిపడుతున్నారు. ఈ నీళ్ల తాగడం వల్ల ఆరోగ్యానికి మంచిది కాదనితెలిసినా తప్పడంలేదు. అభివద్ధి అంటే దేశాన్ని కాలుష్యంతో నింపే పరిశ్రమలను ప్రోత్సహించడం కాదు.

-కె. నాగేంద్ర, హైదరాబాద్

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# అన్నదాతల కష్టం వర్షార్పణం

**పొరుగునున్న చైనా, తైవాన్, జపాన్ లాంటి దేశాలు వ్యవసాయరంగంలో నూతన పరిశోధనల ద్వారా పంటల దిగుబడిని పెంచడమే కాక, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకుంటూ పురోగాభివృద్ధివైపు అడుగులు వేస్తుంటే మనం మాత్రం వ్యవసాయ పరిశోధనలను దాదాపు మూలకు పెట్టి దశాబ్దాల నాటి కాలంచెల్లిన వంగడాలతో పొద్దుబుచ్చుతున్నాం. పెరిగిన అవసరాలకు, వాతావరణ పరిస్థితులు తట్టుకునే విధంగా కొత్త వంగడాలు లేవు. నీటి యాజమాన్యంలో ఆధునీకరణ లేదు. ఎరువులు, పురుగు మందులు ఉపయోగించడంలో మెలకువలు కనిపెట్టడం లేదు. అ వసరం మేరకు గోడౌన్‌లు కానీ శీతల గిడ్డంగులు కానీ లేవు. అన్నింటి కంటే ముఖ్యంగా ఏ సమయంలో ఏ పంటకు గిరాకీ ఉంటుందో గిట్టుబాటు ధర వస్తుందో చెప్పే యంత్రాంగం లేదు. ఫలితంగా వ్యవసాయం నష్టాల ఊబిలో కూరుకుపోతున్నది. ఖర్చులు పెరిగి రాబడి తగ్గి అప్పుల పాలవుతున్నారు.**

దామెర్ల సాయిబాబ

'తల్లి గర్భం నుండి ధనము తేడెవ్వడు, వెళ్లిపోయెడినాడు వెంట రాదు..లక్షాధికారి అయిన లవణమన్నమె కాని మెరుగు బంగారం మింగబోడు విత్తమార్జన చేసి, విర్రవీగుటె కానీ, కూడ బెట్టిన సొమ్ము కుడవబోడు పొందుగా మరుగైన భూమి లోపలపెట్టి దానధర్మము లేక దాచి దాచి తుదకు దొంగలకిత్తురో దొరలకవునో తేనెజుంటీగ లియ్యవా తెరువరులకు... అని నర్సింహశతకకారుడు ఏనాడో చెప్పాడు. ఇందులోని పరమార్థం పట్టించుకునేవారు రానురాను తగ్గిపోతున్నారు. డబ్బు సంపాదన ఏకైక లక్ష్యంగా జీవనం సాగించేవారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతున్నది. ఈసంపాదన ఆరాటంలో మంచి, చెడు నీతినియమాలు అన్నీ వదిలేస్తున్నారు. మానవతా, నైతిక విలువలు అడుగంటిపోతున్నాయి. అందుకే స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా లక్షలాది కోట్ల రూపాయలు నిరుపేదల అభ్యున్నతికి వెచ్చించినా, వెచ్చిస్తున్నా ఆ ఫలాలు చేరవలసిన వారికి ఇంకా చేరడం లేదనే చెప్పొచ్చు. ప్రభుత్వం వెచ్చిస్తున్న నిధుల్లో నాలుగోవంతు లబ్ధిదారులకు చేరినా, దేశం ఎంతో అభివృద్ధి చెంది ఉండేదని స్వయంగా కేంద్ర పెద్దలేగతంలో బహిరంగంగానే సెలవిచ్చారు. కోట్లాది రూపాయల ధనం ఏమైపోతున్నదో, లోపం ఎక్కడున్నదో ఎవరిలో ఉన్నదో సామాన్యులకు అర్థం కాదు. అన్నింటికంటే ముఖ్యంగా వ్యవసాయమే ఏకైక జీవనాధారంగా అరకొర వసతులతో గ్రామాల్లోనే ఉంటూ జీవనం సాగిస్తున్న కల్లాకపటం ఎరుగని కోట్లాదిమంది రైతులపై ఈభారం పడుతున్నది. భూమిని నమ్ముకున్నవారు ఎన్నటికీ చెడిపోరనేది పాతకాలం నమ్మకంగా మారిపోయింది. గ్రామాల్లో ఉంటూ భూమిపైనే ఆధారపడుతూ వ్యవసాయమే జీవనాధారంగా బతకడం ఒక శాపంగా పరిణమిస్తున్న దురదృష్టపు రోజులు దాపురించాయి. ప్రకృతి సహాయ నిరాకరణ, మరొకపక్క తోటి మనిషి దోపిడీతో రైతు కుదేలైపోతున్నాడు. విత్తే దగ్గర నుంచి విక్రయించే దాకా రకరకాల మోసాలకు గురవుతున్నాడు. మరో జీవనోపాధి లేక, ఏ అవకాశంరాక, గ్రామాల్లోనే ఉంటున్నారు. ఏమాత్రం అవకాశం దొరికినా వ్యవసాయాన్ని, పుట్టి పెరిగిన గ్రామాన్ని వదిలిపెట్టి పట్టణాలు, నగరాల బాట పట్టేందుకు వెనుకాడడం లేదు. ఇప్పటికీ దేశవ్యాప్తంగా కోట్లాది మంది రైతులు నగరాల బాట పట్టారు. కరోనా ఉధృత సమయంలో ఎన్ని కోట్లమంది వ్యవసాయ కూలీలు, రైతులు వలస వెళ్లారో బయటపడింది. ఇక మరొకపక్క ప్రకృతి కూడా రైతులపై పగబట్టినట్లు వ్యవహరిస్తున్నది. అతివృష్టి అనావృష్టితో రైతులు అతలాకుతలమవుతున్నారు. గత నెల రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న అకాల వర్షాలతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతున్నది. ఆరుగాలం కష్టం వర్షార్పణం అవుతున్నది. గత పది, పదిహేను రోజులుగా తెలంగాణలో కురుస్తున్న అకాల వర్షాలు రైతులకు కంటిమీద కునుకు లేకుండాచేస్తున్నది. రైతుల సంక్షేమం కోసం వేలాది కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నామని చెప్పుకుంటున్న పెద్దలు అమ్ముకోవడానికి తెచ్చిన ధన్యాన్ని వర్షం నుంచి కాపాడుకునేందుకు పంపిణీ చేయాల్సిన టార్పాలిన్‌లు అందించలేకపోతున్నారు. చివరకు మార్కెట్లో పోసిన ధాన్యం రాసులు కూడా వర్షానికి కొట్టుకుపోతున్నాయంటే ఎవరిని నిందించాలి? ఎవరికి చెప్పుకోవాలి? ఇక ధాన్యం నిల్వలను కొనుగోలు చేసేందుకు కేంద్రాలను ప్రారంభించినా సకాలంలో కొనలేకపోతున్నారు. కొనుగోలు ప్రక్రియ నత్తనడక నడుస్తుండడంతో అన్నదాతలుపడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. కాంటా వేసే సమయంలో గరిష్టంగా రెండు నుండి ఐదు కిలోల వరకు కోతలు విధిస్తున్నారు. రైతులకు కనీస వసతులు కల్పించడంలో మార్కెట్ కమిటీలు ఘోరంగా విఫలమవుతున్నాయి. కొందరు అధికారులు సృష్టించే సమస్యను తట్టుకోలేక మరొకవైపు ఆరబోసే ఖర్చులు భరించలేక పొలాల నుంచే నేరుగా మిల్లర్లు నిర్ణయించిన ధరలకే అమ్ముకుంటున్నారు. ఇక పండ్ల తోటల రైతులపరిస్థితి మరింత దారుణంగా ఉంది. యేడాది పాటు రాత్రింబవళ్లు కష్టపడి పెట్టుబడి అంతా పెట్టి మరో నెల రోజుల్లో పంట చేతికి అందుతుందన్న సమయంలో ఒక్క రోజు ఒక గంట వీచిన ఈదురు గాలులకు మొత్తం పండ్లు రాలిపోతే ఆ రైతుల పరిస్థితి వేదనా భరితంగా ఉంది. అలాని పాలకులు వ్యవసాయం పట్ల ఏమీ చేయడం లేదని చెప్పడం లేదు. అటు కేంద్ర ప్రభుత్వం కానీ, ఇటు రాష్ట్ర ప్రభుత్వంకానీ రైతు సంక్షేమమే తమ ధ్యేయమని చెప్పుకుంటూ ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి లక్షలాది కోట్లు ఖర్చుపెట్టారు. సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు అందించే కార్యక్రమం ఏనాటి నుంచో కొనసాగుతున్నది. ఇన్ని ప్రోత్సాహకాలు ఇస్తున్నా రైతుల పరిస్థితి ఏమాత్రం ఆశాజనకంగా లేదు. రోజురోజుకు అన్నదాత కృంగిపోతున్నాడు. ఎందుకు జరుగుతున్నది? మూలాల్లోకి ఎందుకు వెళ్లడం లేదు? అన్నింటికంటే ముఖ్యంగా సకాలంలో రుణసహాయం అందించడంలో విఫలమవుతున్నారనే చెప్పొచ్చు. రుణమాఫీ ఒక రాజకీయ నినాదంగా మారింది. రుణమాఫీలు ఇచ్చినా సకాలంలో జమచేయకపోడం వల్ల వడ్డీలకు వడ్డీలు పెరిగి ఉపయోగం లేకుండాపోతున్నది. మరొకపక్క ఈ రుణమాఫీ ఆశతో సకాలంలో రుణాలు చెల్లించకుండా వేచి చూడడంతో రైతులకు అది గుదిబండగా తయారవుతున్నది. మళ్లీ కొత్త అప్పులు పుట్టడం లేదు. దీంతో ప్రైవేట్ వ్యాపారులపై ఆధారపడక తప్పడంలేదు. ఇప్పటికీ రైతు చేస్తున్న ప్రతి వెయ్యి రూపాయల అప్పులో సగానికిపైగా వడ్డీ వ్యాపారుల నుంచే తెచ్చుకుంటున్నారు. ఇక వడ్డీల విషయం చెప్పాల్సిన పని లేదు. నలభైశాతం మందికి పైగా రైతులకు సాధారణ వడ్డీకి అప్పు లభిస్తుండగా పదిహేను శాతం నుంచి ముప్పైశాతం వరకు చక్రవడ్డీలు తెచ్చుకుంటున్నారు. ఇదంతా ఒక ఎత్తైతే వ్యవసాయరంగాన్ని నకిలీ, నాసిరకం విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయి. వ్యవసాయానికి మూలం విత్తనాలు అనేది అందరికి తెలిసిందే. తలతాకట్టుపెట్టి అప్పోసొప్పో చేసి పెట్టుబడి పెట్టి నెలల తరబడి ఇంటిల్లిపాది కాయకష్టం చేసి నోటికందుతున్న దశలో తాము నకిలీతో మోసపోయామని తెలిస్తే ఆ రైతే కాదు ఆయన కుటుంబం మొత్తం కుప్పకూలిపోతుంది. గిట్టుబాటు ధర కూడా పెద్ద సమస్యే. అటు ఆటుపోట్లను అన్నింటిని తట్టుకొని పంటలు చేతికి వచ్చిన తర్వాత అమ్ముకోవడం కూడా ఇటీవల గగనమైపోతున్నది. ఇలాంటి సమస్యలు ఎన్నో రైతులను కుంగదీస్తున్నాయి. గత మూడు, నాలుగు దశాబ్దాలుగా వ్యవసాయరంగాన్ని పాలకులు నిర్లక్ష్యం చేశారనే చెప్పొచ్చు. మనదేశంలో మొత్తం భూభాగంలో నలభైఆరు శాతానికిపైగా వ్యవసాయోగ్యమైనదనే అంచనా. చైనా వంటి దేశాల్లో పది, పదకొండు శాతానికి మించి లేదు. పారిశ్రామికంగా సాఫ్ట్‌వేర్ వంటి సేవలపరంగా ఎంత అభివృద్ధి సాధించినా ఇప్పటికీ భారత్‌లో నూటికి అరవైశాతం మందికిపైగా గ్రామాల్లోనే ఉంటూ వ్యవసాయం మీదనే ఆధారపడి జీవిస్తున్నారు. కానీ పాలక పెద్దలు అగ్రభాగంలో ఉన్న అధికశాతాన్ని విస్మరించి ముప్పై, నలభై శాతం ఉన్న ప్రజల మీదనే దృష్టి కేంద్రీకరిస్తున్నారు. అందుకే నగరాలు, పట్టణాల్లో లక్షీపతుల సంఖ్య ఎంతో పెరిగిపోతున్నది. ఇంకొక పక్క గ్రామాల్లో నిరుపేదల సంఖ్య అంతకు పదిరెట్లుగా పెరుగుతున్నది. పొరుగునున్న చైనా, తైవాన్, జపాన్ లాంటి దేశాలు వ్యవసాయరంగంలో నూతన పరిశోధనల ద్వారా పంటల దిగుబడిని పెంచడమే కాక, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకుంటూ పురోగాభివృద్ధివైపు అడుగులు వేస్తుంటే మనం మాత్రం వ్యవసాయ పరిశోధనలను దాదాపు మూలకు పెట్టి దశాబ్దాల నాటి కాలంచెల్లిన వంగడాలతో పొద్దుబుచ్చుతున్నాం. పెరిగిన అవసరాలకు, వాతావరణ పరిస్థితులు తట్టుకునే విధంగా కొత్త వంగడాలు లేవు. నీటి యాజమాన్యంలో ఆధునీకరణ లేదు. ఎరువులు, పురుగు మందులు ఉపయోగించడంలో మెలకువలు కనిపెట్టడం లేదు. అవసరం మేరకు గోడౌన్‌లు కానీ శీతల గిడ్డంగులు కానీ లేవు. అన్నింటికంటే ముఖ్యంగా ఏ సమయంలో ఏ పంటకు గిరాకీ ఉంటుందో గిట్టుబాటు ధర వస్తుందో చెప్పే యంత్రాంగం లేదు. ఫలితంగా వ్యవసాయం నష్టాల ఊబిలో కూరుకుపోతున్నది. ఖర్చులు పెరిగి రాబడి తగ్గి అప్పుల పాలవుతున్నారు. ఇప్పటికైనా పాలకులు ఆలోచించాలి. నిజమైన భారత దేశం గ్రామాల్లో ఉన్నదని గ్రామ స్వరాజ్యం సాధించిన రోజే స్వాతంత్ర్య ఫలాలు అందినట్లని మహాత్ముడు చేసిన ప్రవచనం నేటికీ ప్రామాణికమైనదే. ఆ కోణంలో ఆలోచించాలి. ఇప్పుడు రైతులకు కావాల్సింది వాచావాత్సల్యం కాదు, రైతులు ఆత్మవిశ్వాసం కోల్పోవడం దేశానికి ఏమాత్రం క్షేమం కాదు.

## ఒక్క మాట

# వలస జీవులకు శాపం కాలుష్యం

గొనప అప్పన్న

ప్రకృతి అందాలతో కళకళలాడిన కోనసీమ, ఒకప్పుడు పచ్చని భూమి, శక్తివంతమైన గాలి, ప్రకృతిలో నిలబడిన జీవన విధానం మరిచి, ఇప్పుడు అభివృద్ధి పేరుతో నశించిపోతున్నది. గోదావరి నది ఒడ్డున వేలాది ఏళ్లుగా శ్రేష్టమైన వ్యవసాయ సంపదను పోషించిన ఈ భూమి, క్రమంగా ప్రకృతి, పర్యావరణ, ప్రజల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఈ మార్పు ఏ మాత్రం శాస్త్రీయంగా కాకుండా, చమురు తవ్వకాల వలన ఉద్భవించిన పరిణామాల వల్ల ఏర్పడింది. 1980లలో ఒక పరీక్షాత్మక బోర్‌వెల్‌గా ప్రారంభమైన ప్రస్థానం, నేటి వరకు శతాధిక చమురు బోర్లుగా విస్తరించింది. మొదట్లో అభివృద్ధికి చిహ్నంగా కనిపించిన ఈ తవ్వకాలు, నేడు ఒక పారిశ్రామిక వలయంగా మారి కోనసీమని చుట్టుముట్టాయి. ముమ్మిడివరం, రాయవరం, అమలాపురం మండలాల్లో ప్రతి నాలుగు కి.మీ.లకు ఒక బోరు ఉండే స్థితి ఏర్పడింది. రోజూ సగటున 17,000 బారెళ్ళ క్రూడ్ ఆయిల్‌ను వెలికి తీస్తున్నారు. ఇది దేశ ఆర్థికవ్యవస్థలోని చిన్న శాతం మాత్రమే అయినా, ప్రాంతీయంగా ఇది విపరీతమైన పర్యావరణ నాశనానికి దారితీస్తోంది. ఈ తవ్వకాలు భూకంపాలను ప్రేరేపిస్తున్నాయి. ఇది 'ఇన్‌డ్యూస్డ్ సీస్మిసిటీ'గా పిలవబడుతుంది. అమెరికాలోని ఒక్లహోమా రాష్ట్రంలో ఫ్రాకింగ్ కారణంగా వచ్చిన మినర్ భూకంపాలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అధ్యయనాల అంశంగా మారాయి. అదే తరహాలో కోనసీమలో ఇటీవల ఆరు నెలల వ్యవధిలో ఐదు చిన్న ప్రకంపనలు నమోదయ్యాయి. ప్రజలు భయభ్రాంతులకు లోనవుతున్నారు. కొంతమంది రైతులు తమబావుల్లో మంటలు వచ్చాయని పేర్కొన్నారు. ఇదంతా యాంత్రికంగా భూమిలోకి పంపే ప్రెషర్, చమురుతో పాటు వెలువడే గ్యాస్‌ల కారణంగా ఏర్పడుతున్న పరిణామాలు. ప్రభుత్వ స్థాయి పర్యవేక్షణలు అంతగా ఉండకపోవడం వల్ల వీటి ప్రభావం తక్కువగానే మాట్లాడబడుతోంది కానీ మౌనంగా పెరుగుతున్న ప్రమాద ఘడియలు. వైద్యపరంగా అంటే, గాలి, నీరు, నేల అన్నీ కలుషితమవుతున్నాయి. గాలిలో హైడ్రోకార్బన్ వాసనలు గణనీయంగా పెరిగాయి. ఒక ఆరోగ్య పరిశోధన ప్రకారం, శ్వాసకోశ సంబంధిత వ్యాధుల సంఖ్య 42 శాతం పెరిగింది. గర్భిణీ స్త్రీలలో జబ్బులు, శిశువుల పుట్టుకలలో లోపాలు, చర్మ వ్యాధులు పెరిగాయి. డాక్టర్లు ప్రజలకు దీన్ని నేరుగాచెప్పలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఎందుకంటే ఆయిల్ కంపెనీల ప్రభావం స్థానిక హాస్పిటల్స్ కూ చేరుతోంది. పర్యావరణ పరిరక్షణ కోసం ఉద్దేశించిన నిబంధనలు మాత్రం ఒక విపరీతమైన చిత్తశుద్ధిని కోల్పోయాయి. ఒకప్పుడు ఏడాదికి రెండు పంటలు వేసే రైతు ఇప్పుడు ఒకే సీజన్‌కే పరిమితమవుతున్నారు. బోర్ల చుట్టు పక్కల ప్రాంతాల్లో నూనె పొరల వల్ల నీటి నిల్వలు కలుషితమవుతున్నాయి. గ్రామీణ నీటిపారుదల వ్యవస్థలు దెబ్బతింటున్నాయి. మత్స్యకార కుటుంబాల జీవితం కూడా నిలుపుదలేని నష్టాన్ని ఎదుర్కొంటోంది. సముద్రాల్లోకి పారవేసే ఫార్మా వ్యర్థాలు, నూనె మిశ్రమాలు, గ్యాస్ లీకులు వల్ల చేపల వాసన మారుతోంది. జనాభా గణాంకాలూ మరింత గంభీరమైన సంకేతాలను ఇస్తున్నాయి. 2011 జనగణనప్రకారం ముమ్మిడివరం మండలం జనాభా 1.12లక్షలు. 2021లో మాత్రం అది 1.01లక్షలకు పడిపోయింది. ఇది సహజ మార్పుకాదు, వలసల వాస్తవికత. గ్రామాల్లో పాఠశాలలు మూతపడుతున్నాయి. ఉపాధి లేక గ్రామాన్ని వదిలి పెట్టే రైతులు నెలకు కనీసం 300మందే ఉంటున్నారు. కుటుంబాలు బంధాల్ని తెంచుకుని నగరాలకు వలస వెళ్తున్నాయి. మట్టిలో కలిసిన జీవనశైలి నగరకాలుష్యంలో అర్థరహితంగా మిగిలిపోతోంది. ప్రతి బోరుతవ్వకానికి ముందు సమగ్ర భూగర్భ అంచనాలుచేయాలి. డ్రోన్‌సర్వేలు, భూగర్భ నమూనాల విశ్లేషణ, నేరుగా ప్రజలకు సమాచారం అందించేందుకు డేటా హక్కు చట్టాన్ని వాడాలి. ఆయిల్ కంపెనీల నిధులను ప్రకటనలకే కాకుండా, స్థానిక ఆసుపత్రులు, పాఠశాలలు, గ్రామీణ ఉపాధి కేంద్రాల కోసం వినియోగించాలి. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా నేలకి మళ్లీ జీవం పోయాలి. ఎకోటూరిజం ద్వారా స్థానికులకు ఆదాయంరావాలి. విద్యార్థులలో పర్యావరణంపై స్పష్టమైనఅవగాహనపెంచాలి. ప్రతీ గ్రామస్థుడు ఒక పర్యావరణ కార్యకర్తగా మారాలి.

# అందరికి వైద్యం ఇప్పట్లో సాధ్యమేనా!

గరిమెళ్ల రామకృష్ణ


ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గ కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నెలకొల్పుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించారు! ఆరోగ్యాంధ్రే లక్ష్యం అంటూ పలు ప్రకటనలు చేస్తున్నారు. ప్రభుత్వ లక్ష్యాన్ని, చిత్తశుద్ధిని శంకించకపోయినా వాస్తవ పరిస్థితులను మదింపు చేసుకుని సత్వర, సరైన నిర్ణయాలు తీసుకుంటేనే మెరుగైన ఫలితాలు వస్తాయి. అలాకాకుండా కేవలం ప్రకటనలకు పరిమితం అయితే ప్రజా విశ్వాసం సన్నగిల్లుతుంది. కొద్ది రోజుల క్రితం, శ్రీకాకుళం జిల్లా, ఉద్దానంలో కిడ్నీ బాధితుల కోసం ఆధునిక సదుపాయాలతో, ఎనభై కోట్లరూపాయల ఖర్చుతో ఏర్పాటు చేసిన 200 పడకల ఆసుపత్రి నెఫ్రాలజిస్టులు లేక రోజుకో కిడ్నీ బాధితుడు మరణిస్తున్నట్లు పత్రికా కథనాలు వెల్లడిస్తున్నాయి. మరి ప్రభుత్వం ఏమి చేస్తున్నట్లు? అలాగే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఫ్లోరోసిస్ వలన కిడ్నీలు దెబ్బతిని పలువురు గ్రామీణ పేదలు సరైన చికిత్స అందక అసువులు బాస్తున్నారు. ఈ వాస్తవాలు ప్రభుత్వానికి తెలియవా? పలువురు మృత్యువాత పడి, పత్రికల్లో కథనాలు వచ్చిన తర్వాత హడావిడి చేయడం ప్రభుత్వానికి పరిపాటి అయింది. మరోవైపు వివిధ ప్రైవేటు ఆసుపత్రులకు ఎన్.టి.ఆర్. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చెల్లించాల్సిన బకాయిలు మూడు వేల రెండు వందల కోట్ల రూపాయలు. వారు ప్రతి నెలా సేవలు నిలిపివేస్తామంటే ప్రభుత్వం కొంత మొత్తం సర్దుబాటు చేసే పరిస్థితి చూస్తున్నాం. అలాగే అసలు రాష్ట్ర ప్రభుత్వ వైద్యశాఖలో ఖాళీలు ఎన్ని? ఎప్పుడు భర్తీ చేస్తారో ప్రభుత్వం వద్ద ఒక నిర్దిష్ట ప్రణాళిక లేదు? రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఆస్పత్రుల్లో వైద్యసేవలకు అవసరమైన వైద్య పరికరాల నిర్వహణ కూడా అంతంత మాత్రమే! ఉపకరణాలు పనిచేయక, టెక్నీషియన్ల లేక రక్త పరీక్షలు కూడా బయట చేయించుకోవడం నిత్యం కొనసాగుతున్న దుస్థితి. గ్రామాల్లో ప్రాథమికారోగ్య కేంద్రాల్లో వసతులు, సదుపాయాలు నామ మాత్రమే! కొన్ని అద్దె భవనాల్లో కొనసాగుతూ, నామ మాత్రపు సేవలు అందిస్తున్న వైనం పాలకులకు, ప్రజాప్రతినిధులకు తెలియనిది కాదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చేయవలసిన వైద్యసేవలకు కూడా జిల్లా ఆసుపత్రులకు పంపడం, జిల్లా ఆసుపత్రుల్లో చేయవలసినవి, విశాఖ, విజయవాడ, గుంటూరు, తిరుపతి వైద్యశాలలకు పంపించడం వైద్య సేవలు అందించడంలో మరోలోపం. అటు రోగులకు కూడా ఎంతో వ్యయప్రయాసలతో కూడిన అదనపు భారం! రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేదలకు ప్రభుత్వ వైద్య



సేవలు ఈ విధంగా కొనసాగడం చాలా బాధాకరం! సుదీర్ఘ కాలం విధులకు హాజరు కాని 55మంది వైద్యులను లోకాయుక్త ఆదేశాల మేరకు ఇటీవల తొలగించారు. ఇప్పటికీ వైద్యులు సర్వీస్‌రూల్స్, సమయ పాలన పాటించకపోవడం ఒక సాధారణ విషయంగా పాలకులు భావిస్తున్నారు! గత ప్రభుత్వం నాబార్డు వారి రుణ సదుపాయంతో ప్రచారం కోసం హడావిడిగా ఏర్పాటు చేసిన వైద్యకళాశాలల్లో నిబంధనల ప్రకారం ఉండవలసిన సదుపాయాలు, సిబ్బంది లేని పరిస్థితి, ఆ లోపాలను సరిదిద్దడం ప్రస్తుత పాలకులకు మరో తలకుమించిన భారంలా మారింది. రాష్ట్ర తాజా బడ్జెట్‌లో ప్రతి పౌరునికి 25లక్షల రూపాయల వరకు ఆరోగ్య బీమా కల్పించి వైద్యసేవలు అందిస్తామని చెప్పారు. ఇంకా ఆ ప్రతిపాదన కార్యరూపం దాల్చిన దాఖలాలు లేవు! ఇన్ని జటిలమైన సమస్యలను గాలికి వదిలేసి ప్రభుత్వం నియోజకవర్గానికి ఒక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అని చెప్పడం అతిశయోక్తిగా ఉంది. ప్రభుత్వం వద్ద నిధులు లేని పరిస్థితి, జీతాలకు, తీసుకువచ్చిన రుణాలపై వడ్డీల చెల్లింపులకు మరల అప్పు తీసుకుని వస్తున్నారు! ఈ వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం కొన్ని ఆచరణాత్మక నిర్ణయాలు, చర్యలు తీసుకుంటే ప్రజలకు మేలు జరుగుతుంది. ముఖ్యమంత్రి గారు ఇక్కడ కూడా వివిధ కేంద్ర పథకాలు రాష్ట్రంలో సమర్థవంతంగా అమలు పరిస్తే, ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలను అందించవచ్చు. ఆ విధంగా రాష్ట్రంపై భారాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వం వయోవృద్ధులకు ఆయుష్మాన్ భవ ద్వారా ప్రతి వృద్ధునికి ఐదు లక్షల రూపాయల వరకు ఉచిత వైద్య భీమాను కల్పించిన నేపథ్యంలో రాష్ట్రంలోని వయోవృద్ధులందరినీ ఈ పథకంలో చేర్పించితే దాదాపు నలభై లక్షల మందికి ఉచిత వైద్య సదుపాయం అందుబాటులోకి వస్తుంది. మరో మంచి స్కీము పారిశ్రామిక కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ఈ.ఎస్.ఐ. ఆరోగ్య పథకం. ఈ పథకం ద్వారా ఇప్పటికే దాదాపు 12లక్షల పారిశ్రామిక కార్మికుల కుటుంబాలకు వైద్య సేవలు అందుతున్నాయి. రాష్ట్ర విభజనతో ఈ.ఎస్.ఐ. ఆసుపత్రులన్నీ తెలంగాణాకు దక్కటం, విభజిత ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం కొత్త వైద్యశాలలు మంజూరు చేసినా రాష్ట్రపాలకులు వాటిని నెలకొల్పడంలో ఉపేక్షించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ.ఎస్.ఐ. వైద్య సేవలను గరిష్ట స్థాయిలో పారిశ్రామిక కార్మికులకు, కార్మిక కుటుంబాలకు అందుబాటులోకి తీసుకురావడానికి గట్టి కృషి చేయాలి. ఈ పథకం ద్వారా రానున్న రోజుల్లో కనీసం నలభై లక్షల కుటుంబాలకు వైద్య సేవలు అందేలా ప్రయత్నం జరగాలి. ప్రభుత్వం ఆచరణాత్మక నిర్ణయాలతో మెరుగైన ఫలితాల కోసం కృషి చేయాలి, నేల విడిచి సాము చేయడం వలన ఎటువంటి ప్రయోజనం ఉండదు. ఈ వాస్తవాన్ని పాలకులు గ్రహించాలి!

## ఉక్రెయిన్ యుద్ధం ముగించకుంటే..

# మా దారి మేం నిర్ణయించుకుంటాం



### యుఎస్ విదేశాంగ మంత్రి రూబియో

**ప్యారిస్, ఏప్రిల్ 18:** రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధానికి ముగింపు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్న అమెరికా ఇక ఎంతోకాలం వేచిచూడలేదని, తన దారి తాను చూసుకుంటుందని ఆ దేశ విదేశాంగమంత్రి మార్కో రూబియో చెప్పారు. యూరోపియన్, ఉక్రెయిన్ నేతలతో సమావేశం తర్వాత ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. మా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యున్నత స్థాయిలో యుద్ధానికి ముగింపు పలికేందుకు వారాలు, నెలల తరబడి ప్రయ త్నాలు చేస్తున్నారని, ఇక యుద్ధానికి ముగింపు సాధ్యమా, కాదా అనేది మేము తేల్చుకో వాల్సిన సమయం వచ్చిందని చెప్పారు. 'యుద్ధానికి ముగింపు పలికే విషయంలో మా అధ్యక్షుడు చాలా గట్టిగా ప్రయత్నిస్తున్నారు. చాలా శక్తియుక్తులు ఉపయోగిస్తున్నారు. సంధి కుదిర్చేందుకు ట్రంప్ ఆసక్తిగా ఉన్నా ఆయనకు ప్రపంచంలో ఇతర ప్రాధాన్యతలు కూడా ఉన్నాయి. ప్రస్తుత సంధి ప్రయత్నాల్లో పురోగతి కనిపించకుంటే ఆయన దీనిని వదిలేసి ముం దడుగు వేస్తారు. ఇక నెలలు, వారాల పాటు ప్రయత్నించడం ఉండదు' అని రూబియో చెప్పారు. ఉక్రెయిన్ శాంతి ఒప్పందం త్వరలోనే సాకారం కావచ్చని ట్రంప్ గురువారం కీలకవ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్‌తో ఖనిజాల ఒప్పందం కూడా చేసుకోనున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో ఉక్రెయిన్ యుద్ధం ముగించకుంటే చర్చల ప్రయత్నాలు అమెరికా ఆపేసి తన దారి తాను చూసుకుంటుందని రూబియో కీలక వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# రష్యాకు ఆయుధాలు.. జెలెన్‌స్కీ ఆరోపణలు అవాస్తవం

### శాంతి నెలకొనాలని ఆకాంక్ష : చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్

**బీజింగ్, ఏప్రిల్ 18:** రష్యాకు చైనా ఆయుధాలు, మందుగుండు సామగ్రి సమకూరుస్తోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపణలు చేశారు. వీటిని చైనా తోసిపుచ్చింది. యుద్ధం ముగియాలని తాము బలంగా కోరుకుంటున్నామని, త్వరగా శాంతి నెలకొనలాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు చైనా విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. ఉక్రెయిన్‌పై గత మూడేళ్లుగా యుద్ధం జరుగుతున్న వేళ రష్యాతో చైనా ఆర్థికంగా బలమైన సంబంధాలు కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇటీవల ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఓ ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ చైనా తీవ్ర ఆరోపణలు చేశారు. మాస్కోకు ఆయుధాలు, మందుగుండు సామగ్రిని



చైనా సమకూరుస్తోందని నేరుగా ఆరోపించారు. అదే సమయంలో రష్యా భూభాగంలో ఆయుధాలు కూడా తయారుచేస్తోందన్నారు. ఇలా బీజింగ్‌పై జెలెన్‌స్కీ బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం ఇదే తొలిసారి. దీనిపై చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ స్పందిస్తూ ఉక్రెయిన్-రష్యా యుద్ధంపై చైనా వైఖరి స్పష్టంగా ఉందన్నారు. నిరాధార, రాజకీయ ఉద్దేశాలను వ్యతిరేకిస్తున్నామని, రష్యా దిగుమతి చేసుకుంటున్న ఆయుధాల్లో ఎక్కువగా అమెరికా, పాశ్చాత్యదేశాలవేనని ఉక్రెయిన్ బహిరంగంగా చెప్పిందన్నారు. తాము ఎవరికీ మారణాయుధాలను సరఫరా చేయలేదన్నారు. యుద్ధం ముగియాలని కోరుకుంటున్నామని, కాల్పుల విరమణను ప్రోత్సహించడంతోపాటు శాంతి చర్చలకు సహకారం అందించేందుకు చైనా కట్టుబడి ఉందన్నారు.

# ప్రధాని మోడీ ఆరోపణలు అసమంజసం

### తమిళనాడు సిఎం ఎంకె స్టాలిన్

**చెన్నై, ఏప్రిల్ 18:** ఎంత ఇచ్చినా కేంద్ర ప్రభుత్వ నిధుల కోసం తమిళనాడు ప్రభుత్వం కన్నీళ్లు కారుస్తోందని ఇటీవల ప్రధాని మోడీ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఆ వ్యాఖ్యలకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ శుక్రవారం కౌంటర్ ఇచ్చారు. గుజరాత్ సిఎంగా మోడీ ఉన్న సమయంలో ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని ఎలా నిధులు అడిగారో గుర్తు చేశారు. ఎంత ఇచ్చినా ఇక్కడ ఉన్నవాళ్లు ఏడుస్తున్నట్లు మోడీ ఆరోపించారని, ఎంత ఇచ్చినా మనం ఏడుస్తున్నామని మోడీ ఆరోపించడం సరికాదు అని స్టాలిన్ పేర్కొన్నారు. డీలిమిటేషన్ వల్ల లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య తగ్గదని



కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా హామీ ఇవ్వాలని స్టాలిన్ డిమాండ్ చేశారు. నీట్ నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేయాలని, తమిళనాడులో హిందీ భాష అమలు చేయరాదు అని సిఎం స్టాలిన్ కేంద్రమంత్రి అమిత్‌షాను కోరారు.

నిధుల అంశంపై ఇటీవల రామేశ్వరం వెళ్లిన మోడీ అక్కడ వ్యాఖ్యలు చేశారు. గత దశాబ్ద కాలంలో 2014 కన్నా ముందు కంటే మూడు రెట్లు అధికంగా నిధుల్ని కేంద్రం విడుదల చేసిందని ప్రధాని తెలిపారు. తమిళనాడులో మౌలిక సదుపాయాల్ని పెంచడమే తమ ప్రభుత్వ ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఇక రైల్వే బడ్జెట్‌లో ఆ రాష్ట్ర కోటాను ఏడు రెట్లు పెంచినట్లు చెప్పారు. ఎంత కేటాయించినా, ఇంకా కావాలన్నట్లు కొందరు ఫిర్యాదు చేస్తున్నారని మోడీ ఆరోపించారు.



## టెస్లా అధినేత మస్క్‌తో ప్రధాని మోడీ ఫోన్ సంభాషణ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18:** టారిఫ్‌ల విషయంలో భారత్, అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు కొనసాగుతోన్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలోని డోజ్ విభాగ అధిపతి, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌తో భారత ప్రధాని నరేంద్ర మోడీ ఫోన్‌లో చర్చలు జరిపారు. ఈ విషయాన్ని మోడీ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. 'టెస్లా సిఇఒ ఎలాన్ మస్క్‌తో పలు అంశాలపై మాట్లాడా. ఏ యేడాది ఆరంభంలో వాషింగ్టన్‌లో భేటీ సందర్భంగా చర్చకు వచ్చిన అంశాలనూ మేం ప్రస్తావించాం. సాంకేతికత, ఆవిష్కరణ రంగాల్లో పరస్పర సహకారానికి ఉన్న ప్రాముఖ్యతపై చర్చించాం. ఈ రంగాల్లో అమెరికాతో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు భారత్ కృతనిశ్చయంతో ఉంది' అని మోడీ రాసుకొచ్చారు. ఎలాన్ మస్క్ నేతృత్వంలోని టెస్లా, స్టార్‌లింక్ ఇంటర్నెట్ సంస్థలు భారత మార్కెట్‌లోని అడుగుపెట్టేందుకు ఆసక్తి చూపుతున్న వేళ వీరి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఫిబ్రవరిలో ప్రధాని మోడీ అమెరికాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ప్రధానితో మస్క్ భేటీ అయ్యారు. అంతరిక్షం, మొబిలిటీ, టెక్నాలజీ వంటి రంగాలపై వీరిద్దరూ చర్చలు జరిపారు. ఈ భేటీ జరిగిన కొన్ని రోజులకే.. భారత్‌లో టెస్లా నియామక ప్రక్రియ ప్రారంభించినట్లు కథనాలు వెలువడ్డాయి. ఇక, షోరూమ్ ఏర్పాటు కోసం స్థలం ఎంపికపైనా మస్క్ సంస్థ కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

మరోవైపు, మన దేశంలో స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్‌తో ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ జియో, సునీల్ భారతీ మిట్టల్‌కు చెందిన భారతీ ఎయిర్‌టెల్ ఒప్పందం చేసుకున్నాయి. అయితే, స్టార్‌లింక్‌కు భారత్ ఇంకా అనుమతులు మంజూరు చేయలేదు. ఈ క్రమంలోనే ఆ సంస్థ ప్రతినిధులు బృందంతో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ ఇటీవల సమావేశమయ్యారు. స్టార్‌లింక్‌కు ప్రస్తుతమున్న భాగస్వామ్యాలు, భారత్‌లో భవిష్యత్ పెట్టుబడులు ప్రణాళికపై చర్చలు జరిపారు.

## స్కైరూట్ సంస్థచే రామన్-2 ఇంజన్

# హాట్ ఫైర్ టెస్ట్ సక్సెస్



**శ్రీహరికోట (తడ),ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** స్కైరూట్ సంస్థ వారు మరో రాకెట్ ప్రయోగానికి సిద్ధమవుతున్నారు. గతంలో విక్రమ్ పేరుతో ఒక రాకెట్‌ను ఈసంస్థ రూపొందించి శ్రీహరికోట నుంచి ప్రయోగించిఉన్నారు. ఈ రాకెట్ సామర్థ్యాన్ని మరింత పెంచడం కోసం కీలక పరీక్షలు ఇప్పటికే స్కైరూట్ చేపట్టింది. తాజాగా రాకెట్‌లో ఉపయోగించే రామన్-2అనే ఇంజన్ యొక్క హాట్ ఫైర్ టెస్ట్‌ను విజ యవంతంగా పూర్తి చేసింది. 200 సెకన్ల వ్యవ ధిలో ఈ పరీక్ష అనుకున్న విధంగా పూర్తయి నట్లు పేర్కొన్నారు. రామన్-2 అనేది 1.5కెఎన్ 3డి ప్రింటెడ్ ప్రెజర్ ఫెడ్ వాక్యూమ్ ఇంజన్. ఇది విక్రమ్-1 రాకెట్‌లో నాలుగవ దశకు ఉపయోగపడుతుంది. ఈ పరీక్ష విజయవంతం కావడంతో స్కైరూట్ వారి ప్రయోగం అతి త్వరలోనే చేపట్టే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు. శ్రీహరికోట నుంచి ఈ స్కైరూట్‌ను ఇస్రో సహకారంతో ప్రయోగిస్తారు.



## మెక్సికోలో విమానం హైజాక్ యత్నం

# ముగ్గురు ప్రయాణికులకు కత్తిపోట్లు.. హైజాకర్ కాల్చివేత

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** మెక్సికో దేశంలోని బెలిజి నగరంలో 14 మంది ప్రయాణీకులతో వెళుతున్న ఓ చిన్న విమానాన్ని అమెరికాకు చెందిన మాజీ సై నికుడు హైజాక్‌కు ప్రయత్నించాడు. విమానంలో ప్రయాణం చేస్తున్న సదరు వ్యక్తి వున్నట్లుండి కత్తితో ముగ్గురు తోటి ప్రయాణీకులపై దాడికి దిగి విమానాన్ని దారి మళ్లించాలని డిమాండ్ చేశాడు. అయితే కత్తిపోట్లకు గురైన ప్రయాణీకుల్లో ఒక వ్యక్తి తన వద్ద వున్న లైసెన్స్ రివాల్వర్‌తో హైజాకర్‌ను కాల్చి చంపాడు. మెక్సికోలోని కో రోజల్ నుంచి 14 మంది ప్రయా ణీకులు, ఇద్దరు సిబ్బందితో కూడిన విమానం గురువారం ఉదయం స్థానిక కాలమానం ప్రకారం ఉదయం ఎనిమిదిన్నర గంటల సమ యంలో శాన్ పెడ్రో అనే పర్యాటక ప్రాంతానికి వెళుతుండగా ఇందులోనే ప్రయాణిస్తున్న అమెరికాకు చెందిన అకిన్యేల టేలర్ (45) అనే మాజీ సైనికుడు వున్నట్లుండి కే కలు వేస్తూ తన వద్ద వున్న కత్తితో ప్రయాణీకులపై దాడికి దిగాడు. అనంతరం విమానాన్ని అమెరికాకు మళ్లించాలని కేకలు వేశాడు. అయితే ఇతని దాడిలో కత్తిపోట్లకు గురైన ముగ్గురు ప్రయాణీకుల్లో ఒకతను తన వద్ద వున్న రివాల్వర్‌తో టేలర్‌పై కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో టేలర్ తీవ్రంగా గాయపడి కిందపడిపోగా ఇతర ప్ర యా ణీకులు అతన్ని కట్టివేసి వెంటనే దీనిపై పోలీసులకు, విమానాశ్రయ అధికారులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలిసిన వెంటనే బెలిజి నగరంలో అత్య వసర పరిస్థితిని ప్రకటించారు.

అనంతరం విమానాన్ని పైలట్ సురక్షితంగా బెలిజిలో దించాడు. కాగా ఈ ఘటనలో గాయపడ్డ హైజాకర్ ఆసుపత్రిలో చనిపోగా ఇతని దాడిలో కత్తిపోట్లకు గురైన ముగ్గురిలో ఇద్దరికి తీవ్రంగా గాయాలు తగిలాయి. వీరిని ఆసుపత్రిలో చేర్పించారు. కాగా హైజాకర్ విమానాన్ని ఎందుకు హైజాక్ చేయాలనుకున్నాడనే దానిపై బెలిజి నగర పోలీసులు విచారణ చేబట్టారు. దీనిపై అమెరికా ప్రభుత్వానికి వారు సమాచారం అందించారు.

# సీతారామ లిఫ్ట్‌లో లోపాలు ఎన్నెన్నో

## సర్కార్ తొందరపాటే అనర్థాన్ని తెచ్చిపెట్టిందా?

## హెచ్‌డిఎ నివేదికే నిండా ముంచింది !

**అశ్వారావుపేట-ప్రభాతవార్త:** అత్యంత ప్రతిష్ఠాత్మక 'సీతారామా లిఫ్ట్ ఇరిగేషన్' నిర్మాణాల విషయంలో నాటి ప్రభుత్వ పెద్దలు.. ఇందులోని ఇంజనీర్లకు ఊపిరి సలపకుండా చేయడం వల్లనే అనర్థం వచ్చిపడుతున్నదనే ఆందోళనకర అంశం బయటపడుతున్నది. 4 ప్యాకేజ్ లోని డ్రెయిన్ క్రాస్ పిల్లరొకటి నిట్టనిలువునా కుప్ప కూలిన నేపథ్యంలో అనేకమంది నిపుణులు దీనిమీదే మధనపడుతున్నట్లు తెలుస్తున్నది. పేరు వెల్లడించేందుకు ఇష్టపడని ఓ సీనియర్ ప్రభాతవార్త వద్ద మనసువిప్పి మాట్లాడారు. ఓపక్క అప్పటి ముఖ్యమంత్రి- మంత్రులు-ప్రత్యేకాధికారి స్మితాస బర్వాల్-కలెక్టర్లు ఇలా ప్రతీ కీలక విభాగం., ఈ నిర్మాణంలో పాలుపంచుకున్న చాలామంది ఇం జనీర్లను పరుగులు పెట్టించినట్లు వెల్లడవుతున్నది. తొందరగా పూర్తయిపోవాలని, ఆగమేఘాలమీద అన్ని పనులూ నిముషాల వ్యవధిలో చేతికందాలని, తీవ్ర వత్తిడి తెచ్చి ఎక్కడా నిద్ర పోనివ్వలేదట. దీనికితోడు అడుగడుగునా రివ్యూ మీటింగ్‌లంటూ ప్రాణం తోడేయడంతో నాణ్యతపై తీవ్ర ప్రబావం పడిందంటూ కొందరు లోలోపల మధన పడిపోతున్నారని సమా చారం. ఇంతపెద్ద స్ట్రక్చర్ పదికాలాల పాటు ప్రజలకు సేవలందించాల్సిన మెగా ప్రాజెక్ట్ పూర్తికావా లంటే., ఈనాడు ఎంత అధునాతన టెక్నాలజీ అందుబాటులో ఉన్నా, ఓ క్రమపద్ధతిలో ఓ నిర్ణీత కాలవ్యవధిలో నిర్మాణాలు జరగాలనే మాట చెప్పడానికి మనం ఇంజనీర్లం కానక్కరలేదు. నిరక్షరాస్యుల్ని అడిగినా వాళ్ళూ ఇదే అంటారు. గరిష్ఠంగా రూ.13వేల కోట్లు పైచిలుకు ప్రజా ధనంతో నిలబెట్టాల్సిన మహా కట్టడాన్ని ఇంత అనాలోచితంగా ఎలా ముందుకు తీసుకు వెళ్లారో, నిజంగా చెప్పుకోవడానికే సిగ్గనిపిస్తున్నది. పాసెజ్ పిల్లర్ ఛిద్రమైన క్రమంలో ఇలాటి లోతైన విష యాలెన్నో బయటికి వస్తున్నాయి. ప్రభుత్వం కంగారు పెట్టేయడం తో మరో గత్యంతరం లేక ఇంజనీర్లే ఈవిధమైన దగాకోర్ కట్టడాలు పూర్తిచేసి సమాజాన్ని నిలువునా ముంచారా అనే ప్రశ్నలు ఉత్పన్నమౌ తున్నాయి. మన సాంకేతిక పరిజ్ఞానం చంద్ర మండలంపై కాలుపెట్టే దాకా చేరినా, ఈ లిఫ్ట్‌లో చోటుచేసుకున్నపనికిమాలిన నిర్ణయాలు తలవం చు కునేలాచేస్తున్నాయి. దీనిపై లోతుగా విశ్లేషిద్దాం.

**'ఎస్‌బిసి' పరీక్షకు ముందే కాంక్రీట్ పనులు చేపట్టారా ?**

ఏదేని కాంక్రీట్ స్ట్రక్చర్ పిల్లర్ పునాదులు వేసేప్పుడు 'సాయల్ బేరింగ్ కెపాసిటి (ఎస్‌బిసి)' పరీక్ష చేయాల్సి ఉంటుంది. నదులు-కాలువల మీద నిర్మాణాలప్పుడు మరింత జాగ్రత్త అవసరం. అలాంటిది మట్టి పరీక్ష చేయకుండానే పిల్లర్లు నిలబెట్టేశారనే ధృవపడని రహస్యం ఒకటి బయటపడింది. కన్‌స్ట్రక్షన్ పూర్తయాక వరంగల్ ఎన్ఐటి (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి) నిపుణులు వీటిని పరిశీలించిన సదర్భంలో విషయం తెలిసిందనేది ఓ వార్త. ఇక్కడే ఇంజనీర్ల పొరబాట్లు సమర్ధించుకోడానిక్కూడా వీల్లేకుండా ఉన్నాయి. ఎందు కంటే పిల్లర్ కిందిభాగంలోని మట్టి నమూనా టెస్ట్‌లో 'హెచ్‌డిఆర్' అంటే 'హార్డ్ డిసిన్టిగ్రేటెడ్ రాక్' అనే ఫలితాన్ని కనిపెట్టారని అంటున్నారు. 'డిసిన్టిగ్రేటెడ్' అంటే 'విఛ్ఛిన్నకర లక్షణం' అని అర్థం. మరింత విడమరచి చెప్పాలంటే ఈ నిర్మాణాల కిందున్న నేలలో పైకి రాయిమాదిరి కనిపించే భౌతిక స్వరూపం చూడ్డానికి గట్టిగా-పటిష్ఠంగా ఉన్నా., చివరికి దీని అసలు స్వరూపం మాత్రం విచ్ఛిన్నమయ్యేదని ఇంజనీర్లకు తెలిసిపోయింది. ఇక్కడే వీళ్ళు ఇరుక్కుపోయారు. ఎలా అంటే ప్రస్తుత కూలిన ప్రదేశంలో పిల్లర్ల నిర్మాణం జరిగినప్పుడు "హెచ్‌డిఆర్" పరీక్షని ముందుగా చేసి ఉండాలి. ఇలా చేసి ఉంటే ఇక్కడి భూమిలో కనిపించేవి రాళ్ళల్లా ఉన్నా అవి మోసం చేస్తున్నాయని గ్రహించి., తదనుగుణమైన మరో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చి పబడ్బందీగా నిర్మాణాలు చేపట్టి ఉండేవాళ్ళు. కాబట్టి నిర్మాణానికి ముందు సాయల్‌బేరింగ్ కెపాసిటీని అంచనా వేయలేదని (మట్టి సామర్థ్యం) ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు.

**పిల్లరే కాదు..శ్లాబూ బీటలు వారింది**

రామవరం-కమలాపురం పంప్‌హౌస్‌ల మధ్యన కూలింది కేవలం డ్రెయిన్ క్రాస్ స్ట్రక్చర్ పిల్లరే కాదు. దాని పైభాగపు శ్లాబు కూడా కదిలింది. పైకెక్కి చూస్తే ఎవరికైనా ఇది కనపడుతుంది. కింద బలమైన ఊతం లేనప్పుడు పైనుండే నిర్మాణం ఎలాగూ బలహీన పడుతుంది. ఇంజనీర్లు ఎంత సమర్థించుకున్నా ఇది సర్వసాధారణం. పిల్లర్‌లేకున్నా పైపోర్షన్‌కి ఇబ్బంది లేదని వీళ్ళు చెప్పగలరా ? ఒకవేళ ఆ మాటఅంటే కనుక అసలు కిందిభాగంలో పిల్లర్ నిర్మాణమే అవసరం లేదు కదా. నిర్మించారంటే అర్థమేంటీ..పై భాగానికి ఇది సపోర్ట్‌గా ఉండాలనే కదా. అంతే కాదు.,ఈ సంఘటనలో ఈ ఇంజనీర్లు చెబుతున్న విషయాలు చాలా ఆశ్చర్యాన్ని కలిస్తున్నాయి.

**సైడ్‌లెయింగ్ సర్వనాశనమైంది**

పాసేజ్ పిల్లర్ నిర్మాణంలో ఇంజినీర్లు ఎంత అక్రమానికి పాల్పడ్డారో అక్షర రూపంలో చెబితే అర్థం కాదు. అక్కడికి వెళ్ళి చూస్తే తుగ్లక్ నిర్ణయాలనిపించక మానదు. ఇప్పుడేదైతే కూలిందో ఈ పిల్లర్‌ని "కెనాల్ సైడ్ లెయింగ్" లో కలిపి నిలబెట్టేశారు. కాలువ మధ్యలో ఎలాగూ రెండు పిల్లర్లు బలంగా ఉన్నాయి కదా మళ్ళీ దీనికి కూడా పునాది ఎందుకనుకున్నారో ఏమోగానీ.,నిజంగా తుగ్లక్ పరిజ్ఞానాన్నే వాడారు. లెయింగ్‌లో కలిసి పిల్లర్ నిర్మించేశారు. కనీసం పునాది తీసినట్లుగా అక్కడ ఆనవాళ్ళు లేవు. పైగా ఓ ఇంజనీర్ ప్రభాతవార్తతో మాట్లాడుతూ 4 వప్యాకేజ్ చాలా ప్రమాదకరమైందని, చూడ్డానికి నల్లరాళ్ళల్లా అనిపిస్తాయి గానీ.,తీరా బలమైన రాళ్ళని భ్రమపడి ఆమేరకు కాంక్రీట్ పనులు చేస్తే ఇలానే కుప్పకూలుతాయని చాలా హాస్యాస్పదంగా వ్యాఖ్యానించారు. కంటికి రాళ్ళల్లా కనిపిస్తే అవి రాళ్ళో మట్టో కూడా పరీక్ష చేయకుండానే వీళ్ళు కాంక్రీట్ వర్కు చేసేస్తారా ? మరి అలానే చేస్తున్నారిక్కడ. లెయింగ్‌లో కలిపి ఏదో తూతూమంత్రంగా పిల్లర్ వేయడం వల్ల, పిల్లర్‌తో పాట అటు ఇటూ దీనికి ఆనుకుని ఉన్న లెయింగ్ భాగమంతా ఛిద్రమైంది. ఆ పెచ్చుల్ని పరిశీలించేందుకు సందర్శకులను పంపాలి. ఎంత మందంతో ఉన్నాయో.,ఆ ధ్వంసమైన సిమెంట్



# ప్రియుడి కోసం భర్త హత్య

## వీడియో కాల్‌లో దృశ్యాలు చూపిన మహిళ

## మధ్యప్రదేశ్‌లో దారుణం.. నిందితుల అరెస్టు

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** మధ్యప్రదేశ్‌లో దారుణం వెలుగు చూసింది. ప్రియుడి మోజులో పడి కట్టుకున్న భర్తను మరో ఇద్దరి సహకారంతో హత్య చేసిన భార్య ఉదంతం ఇది. భర్తను హత్య చేశాక ఈ దృశ్యాలను సెల్‌ఫోన్‌లో వీడియో కాల్ ద్వారా ప్రియుడికి చూపింది. ఈ దారుణానికి పాల్పడ్డ మహిళతో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేశారు. మధ్యప్రదేశ్‌లోని షాహ్‌పూర్ లోని ఇండోర్ ఇచ్ఛాపూర్ జాతీయ రహదారిపై వద్ద గల ఐటిఐ సమీపంలో ఈ నెల 12వ తేదీ రాత్రి రాహుల్ (25) అనే యువకుడి హత్య జరిగింది. రోడ్డు పక్కన తలతో పాటు ఒంటిపై కత్తిపోట్లతో తీవ్రమైన గాయాలు కావడంతో ఇతను చనిపోయాడు.

దీనిపై సమాచారం అ ందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సమీపంలోని సిసి కెమెరాలను పరిశీలించగా రాహుల్ భార్య ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తేలింది. ప్రియుడి మోజులో భ ర్తను హత్య చేసినట్లు తేలింది. ఈ హత్యలో ఒక మైనర్ బాలుడితో పాటు లలిత్ అనే మరో వ్యక్తి వున్నట్లు తేలింది. పథకం ప్రకారం రాత్రి ఎనిమిది గంటల సమయ ంలో భర్తతో కలిసి బైక్‌పై వచ్చిన సదరు మహిళ ఐటిఐ కాలెజి వద్ద రాగానే స్పీడ్ బ్రేకర్ వుండడంతో బైక్ వేగం తగ్గగానే అంతకు ముందు అక్కడే మాటువేసిన ఇద్దరి చే త దాడి చేయించింది. మొదట వాహనం వేగం తగ్గగానే ఇద్దరు (అందులో ఒకడు మైనర్) రాహుల్‌ను కిందపడవేసి సమీపంలో గల పొదల్లో లాక్కువెళ్లారు.

అనంతరం బీరు బాటిళ్లతో రాహుల్ తలపై కొట్టారు. అనంతరం ఒంటిపై అదే బాటిళ్లతో పాటు కత్తులతో 36 సార్లు పొడిచి హత్య చేశారు. కాగా ఈ దృశ్యాలను రాహుల్ భార్య తన ప్రియుడికి వీడియో కాల్ ద్వారా చూపింది. కాగా ఈ ఘాతుకం అనంతరం హత్యకు పాల్పడ్డ మహిళ తనకు సహకరించిన ఇద్దరితో కలిసి రైలులో ఇటార్సికి అక్క డి నుంచి బస్సులో ఉజ్జయినికి పారిపోయింది. కాగా దీనిపై లోతుగా విచారించిన పోలీసులు హత్యకు పాల్పడ్డ మహిళతో పాటు ఆమెతో పాటు వున్న ఇద్దరిని అరెస్టు చేశారు. పరారీలో వున్న ప్రియుడి యువరాజ్ కోసం గాలిస్తున్నారు.

# నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తుంటే బిఆర్ఎస్ నేతలకు కడుపుమంట

### ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్

**హైదరాబాద్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తుంటే బిఆర్ఎస్ నేతలకు కడుపుమంటగా ఉందని ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ మండిపడ్డారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే నిరుద్యోగులకు సంబంధించి పాత, కొత్త నోటిఫికేషన్లు, వేసి 57 వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది అన్నారు. తెలంగాణ ఉద్యమమే ఉద్యోగాల కోసం జరిగిందన్నారు. బిఆర్ఎస్ అధికారంలోకి వస్తే యేడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని మోసం చేసిందన్నారు. గతంలో ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడుగా పోరాటం చేసి, నోటిఫికేషన్లు వేయాలని పోరాటం చేశామన్నారు. గతంలో గ్రూప్ 1లో జరిగిన అవకతవకలపై న్యాయస్థానం ఆశ్రయిస్తే, భయంతో చేసిన తప్పును బిఆర్ఎస్ ప్రభుత్వం, టిజిపిఎస్‌సి అధికారులు ఒప్పుకున్నారు, పరీక్షలు రద్దు చేశారన్నారు. మొదటి నుంచి గ్రూప్ 1పై బిఆర్ఎస్ నేతలు వరుసగా కేసులు వేస్తూ వస్తుందన్నారు. మొదటి నుంచి నోటిఫికేషన్లు ఆపాలని, ఏదో ప్రయత్నం చేస్తూనే ఉన్నారూ అన్నారు. ఎమ్మెల్సీ కవిత గత పదేళ్లు ఎక్కడ ఉన్నారో తెలియదన్నారు. టిజిపిఎస్‌సి పేపర్లు లీకు అయినప్పుడు, ఇంటర్ పేపర్లు లీకు అయితే, విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటే కవిత కనీసం పరామర్శించిన పాపాన పోలేదు. అప్పుడు ఎమ్మెల్సీ కవిత లిక్కర్ బిజినెస్‌లో బిజిగా ఉన్నారన్నారు.

బిఆర్ఎస్‌లో కవిత, కెటిఆర్ ఒకరికి ఒకరితో పోటీ పడుతున్నారని, ఆధారాలు ఉంటే కవితను ముఖ్యమంత్రి దగ్గరకు తీసుకెళ్లి మాట్లాడిస్తామన్నారు. తప్పులు జరిగితే ఆధారాలతో నిరూపిస్తే ప్రభుత్వం సరిదిద్దుతుందన్నారు. ఇలాగే మీరు మాట్లాడితే తెలంగాణ ప్రజలు, నిరుద్యోగులు రాళ్లతో తరిమికొట్టే పరిస్తితి వస్తుందన్నారు.

# సోనియా గాంధీని విమర్శించే స్థాయి బండి సంజయ్‌కి లేదు

### టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్

**హైదరాబాద్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీపై నకిలీ గాంధీ అంటూ వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ తన వాఖ్యలను తక్షణం వెనక్కి తీసుకోవాలని టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అన్నారు. శుక్రవారం గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. సోనియా గాంధీ తెలంగాణ రాష్టం ఇవ్వడంతోనే బండి కేంద్ర మంత్రి అయ్యాడన్నారు. గాంధీ కుటుంబం ఎప్పుడు పైసలు, అధికారం కోసం ఎప్పుడు ఆశ పడలేదన్నారు. రాహుల్ గాంధీకి దేశ వ్యాప్తంగా వస్తున్న ప్రజా ఆదరణను చూసి కుట్ర చేశారు. నేషనల్ హెరాల్డ్ ఆస్తులను సీజ్ చేయడం నేరం అన్నారు. చట్టాలను కాల రాసేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోంది. రాజకీయ దురుద్దేశంతోనే సోనియా, రాహుల్‌పై ఛార్జీషీట్ నమోదు చేశారన్నారు. మోడీ అధికారంలోకి వచ్చాక 1,68 వేల కోట్లు మాఫీ చేశాడని, సంపన్న వర్గాల కోసం అంబానీకి 48 వేల కోట్లు మాఫీ చేశాడుడన్నారు. బిజెపికి ఇవి చివరి ఎన్నికలుగా మిగిలి పోనున్నాయన్నారు.


**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)**
Lenin Center, Governorpet, Vijayawada - 520 002 (A.P.)

**E-PROCUREMENT SHORT TENDER NOTICE**

Tender invites the following bids which can be downloaded on AP e- Procurement portal as per the scheduled dates stated below.

| S.No | NIT No | Name of the Work |
|---|---|---|
| 1 | 13/PROC/ MAU61-USI0HB(OTH)/123/ 2025-HB/2nd Call, Dated: 18.04.2025 | RFP for "Selection of an Agency for conceptualization, installation, and operation of an Immersive Tech Exhibition (Amaravati Experience Centre) on QCBS tendering basis. |
| 2 | 14/PROC/MAU61-USI0HB(OTH)/121/ 2025-HB/2nd Call, Dt:18.04.2025 | Preparation of 3D model of Amaravati Government Complex (AGC) to display at Hon'ble Prime minister's programme at Amaravati" - **Estimate Cost: Rs.88.50 Lakhs.** |

The bids can be downloaded on AP e-procurement portal from **19.04.2025** to **22.04.2025** up to **14:00 Hrs.** Due date for submission of Bid **22.04.2025** up to **15.00 Hrs.** Technical bid opening **22.04.2025 @16.00 Hrs.** For further details Please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in**

Sd/- Commissioner, APCRDA, Vijayawada.

# ఎంఎంటీఎస్ రైలులో యువతిపై అత్యాచారయత్నం ఫేక్

## రీల్స్ చేస్తూ ప్రమాదవశాత్తూ కిందపడినట్లు గుర్తించిన పోలీసులు

**హైదరాబాద్ (కంటోన్మెంట్), ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** ఎంఎంటీఎస్ రైలు బోగీలో ఒంటరిగా ఉన్న యువతిపై ఓ యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడనే ఆరోపణ పోలీసులు ఫేక్ అని తేల్చారు. అతని నుంచి తప్పిం చుకునే ప్రయత్నంలో బాధితురాలు రైలు నుంచి బయటకు దూకానని చెప్పడం ఒట్టిదే అని తేలింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అనంతపురం జిల్లా ఉర్వకొండ ప్రాంతానికి చెందిన యువతి (23) మేడ్చల్లో ఓ మహిళా హాస్టల్లో ఉంటూ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తోంది. గతనెల 22న తన సెల్‌ఫోన్ మరమ్మతు కోసం సికింద్రాబాద్‌కు వెళ్లి పని ముగించుకుంది. అనంతరం ఎంఎంటీఎ ట్రైన్‌లో మేడ్చల్‌కు బయలుదేరింది. మహిళల కోచ్‌లో ఆమె ఎక్కింది. కొంపల్లి సమీప ప్రాంతంలోని రైలు బ్రిడ్జి వద్ద కిందపడి గాయపడిన ఆమెను స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో స్థానిక ఆస్పత్రికి తరలించారు. అదే అక్కడి నుంచి వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసుల విచారణలో ఓ అగంతకుడు తనపై లైంగిక దాడికి యత్నించాడాని, తప్పించుకొనే ప్రయత్నంలో నడుస్తున్న ట్రైన్‌లోంచి దూకేశానని వివరించింది. అప్పట్లో ఈ సంఘటన తీవ్ర సంచలనంగా మారింది. రాజకీయ పార్టీలు మహిళలకు భద్రత కరువైంది. రక్షణ లేదని, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు గాంధీ ఆస్పత్రి వద్ద గగ్గోలు పెట్టారు. పోలీసులు కూడా ఈ సంఘటనను చాలెంజింగ్ తీసుకున్నారు. యువతి తెలిపిన కోణంలో పోలీసులు దాదాపు రెండు వందల సీసీ కెమెరాలను పరిశీలించారు. వందమందికి పైగా విచారించారు. అనేక కోణాల్లో విచారించిన పోలీసులకు ఏమాత్రం క్లూ దొరకలేదు. రెండు,మూడు సార్లు యువతిని విచారిస్తే చెప్పిందే మళ్ళీమళ్ళీ చెబుతుండడంతో పోలీసులు పలు బృందాలుగా ఏర్పడి లోతైన విచారణ జరిపారు. అయినా ఎక్కడా కూడా యవతి తెలిపినట్లుగా ఏ చిన్న ఆధారం కూడా దొరకలేద. చికిత్స పొందిన యువతిని పోలీసులు తాను చెబుతున్నట్లుగా ఎక్కడా ఆధారాలు లేవని, పలు సందేహాలు వ్యక్తం చేస్తూ లోతుగా విచారించగా అసలు విషయం నెమ్మదిగా కక్కింది. రీల్స్ వీడియోలు చేస్తుండగా ప్రమాదవశాత్తు పడిపోయానని, విచారణలో ఈ విషయం చెబితే తననే తిడతారని భయంలో అలా చెప్పానని తెలుపడంతో పోలీసులు అవాక్కయ్యారు. పోలీసులను తప్పుదోవ పట్టించిందని పోలీసులు గుర్తించారు. న్యాయ సంబంధమైన అంశాలను పరిశీలించి కేసును మూసివేసే యోచనలో రైల్వే పోలీసులు ఉన్నట్లు తెలుస్తోంది.

# యువ వికాసానికి 16,23,764 దరఖాస్తులు

## యూనిట్ విలువ ఆధారంగా నాలుగు కేటగిరీలు
## ఎంపికైన ఎస్సీ, ఎస్టీ, బిసిలకు రెండు విడతలుగా జమ

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అలమలు తలపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ వర్గాల నుండి భారీగా దరఖాస్తులు వచ్చాయి. సంక్షేమ శాఖ అధికారుల వివరాలు ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకానికి మొత్తం 16,23,764 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా కేటగిరీ నాలుగు కింద 12.41 లక్షల దరఖాస్తులు వచ్చాయి. యువ వికాసం పథకానికి వచ్చిన దరఖాస్తులను వారు పేర్కొన్న యూనిట్ విలువ ఆధారంగా సంక్షేమ శాఖ అధికారులు నాలుగు కేటగిరీలుగా విభజించారు. రూ.50వేల లోపు ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకున్న వారిని కేటగిరీ 1లో చేర్చారు. రూ.50వేల నుంచి రూ.లక్ష మధ్య ఉన్న దరఖాస్తుదారులను కేటగిరీ 2లోను, రూ.లక్ష నుంచి రూ.2 లక్షల మధ్య ఉన్న దరఖాస్తులు కేటగిరీ 3లో, రూ.2 లక్షల నుంచి రూ 4 లక్షల మధ్య ఉన్న దరఖాస్తులను కేటగిరీ 4లో చేర్చారు. కేటగిరీ 1 కింద వంద శాతం రాయితీతో రూ.50వేల రుణం మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, ఈ కేటగిరీకి 39,401 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఇక కేటగిరీ 2లో 93,233 దరఖాస్తులు, కేటగిరీ 3లో 2,49,434 దరఖాస్తులు, కేటగిరీ 4లో ఏకంగా 12,41,696 దరఖాస్తులు వచ్చాయి.

మొత్తం దరఖాస్తుల్లో 75శాతం నాలుగో కేటగిరీ కిందనే దరఖాస్తు చేయడం గమనార్హం. ఎందుకంటే.. రూ.4లక్షల విలువైన యూనిట్ విలువలో 70 శాతం రాయితీతో దాదాపు రూ.28లక్షల వరకు రాయితీ వచ్చే అవకాశం ఉంది. దీంతో ఎక్కువ మంది కేటగిరీ4నే ఎంచుకున్నారు. కాగా రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో కాంగ్రెస్ సర్కార్ రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతోపాటు ఓబీసీ వర్గాలకు దరఖాస్తు చేసుకొనే అవకాశాన్ని కల్పించింది. మొత్తం ఐదు లక్షల మందిని ఎంపిక చేసి వారికి రాయితీపై యూనిట్లను అందజేయనున్నారు. ఇందుకోసం బడ్జెట్ లో ఆరువేల కోట్లను ప్రభుత్వం కేటాయించింది. అంతేకాకుండా ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు రాయితీపై ఆర్థిక సహాయం అందించడమే కాకుండా వారికి అవసరమైన నైపుణ్యాభివృద్ధికి శిక్షణ కూడా ప్రభుత్వం ఇవ్వనుంది. ఈ పథకం కింద అర్హత పొందిన వారికి రెండు దఫాలుగా వారి అకౌంట్లలో నగదు జమకానుంది. తొలుత సగభాగం యూనిట్లు కొనుగోలు చేసే సమయంలో, మిగిలిన సగభాగం యూనిట్లు కొనుగోలు చేసిన తరువాత అందజేయనున్నట్లు సంక్షేమ శాఖ అధికవర్గాలు వెల్లడించాయి.

# గిరిజన జనాభాలో కొత్తగూడెం అగ్రస్థానం

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో షెడ్యూల్ ట్రైబ్ (గిరిజనులు) జనాభాను చూస్తే అత్యధికంగా కొత్తగూడెం జిల్లా అగ్రస్థానంలో ఉంది. ఈ జిల్లాలో నాలుగు లక్షల మంది గిరిజన జనాభా ఉన్నట్లు ప్రభుత్వ సర్వేలో వెల్లడైంది. అలాగే 3 లక్షల మందితో మహబూబాబాద్ రెండో స్థానంలోను, 2.25 లక్షలతో ఆదిలాబాద్ మూడో స్థానంలో ఉన్నాయి. ఇక రాష్ట్రంలోని నల్గొండ జిల్లాలో 2.10 లక్షల మంది గిరిజనులు, ఖమ్మంలో 2 లక్షల మందితో అధిక జనాభాను కలిగి ఉన్న జిల్లాగా నమోదైంది. అదేవిధంగా రాష్ట్రంలో లక్ష నుంచి లక్షన్నర మధ్య రంగారెడ్డి, సూర్యాపేట, కొమరం భీమ్, నాగర్ కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాలు, 50 నుండి లక్ష జనాభా మధ్యన కలిగిన షెడ్యూల్ ట్రైబ్స్ జిల్లాలు వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ మంచిర్యాల, నిర్మల్, ములుగు ఉన్నాయి. వీటితో పాటు, హైదరాబాద్‌లో 50,000, భువనగిరిలో 44,000, వనపర్తిలో 46,000 ఎస్టీల జనాభా ఉంది. 20 నుండి 40 వేల మధ్యన గిరిజన జనాభా గలిగిన జిల్లాలు జనగాం, హనుమకొండ, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, నారాయణపేట, జోగులాంబగద్వాల్, కరీంనగర్, పెద్దపల్లి, జోగులాంబ గద్వాల తక్కువ జనాభాతో కలిగి ఉన్న జిల్లాలుగా ఉన్నాయి.




ఇందిరాపార్కు వద్ద నిరుద్యోగుల ధర్నాలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

# గ్రూప్-1 ఫలితాల అవకతవకలపై సిబిఐచే విచారణ జరిపించాలి

## ఎంపి ఆర్.కృష్ణయ్య డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** గ్రూప్-1 పరీక్షా ఫలితాలలో అనేక అవకతవకలు జరిగాయని, మూల్యాంకనంలో తప్పులు చేశారని, పరీక్షా కేంద్రాల కేటాయింపులో కూడా అవకతవకలు జరిగాయని వీటిపై సిబిఐచే న్యాయ విచారణ జరిపించాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం తప్పదని హెచ్చరించారు. తెలంగాణ నిరుద్యోగ జెఎసి ఛైర్మన్ నీల వెంకటేష్, జనార్థన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరాపార్కు వద్ద నిరుద్యోగులు మెరిట్ అభ్యర్థులకు పాస్ కాలేదని నిర్వహించిన ధర్నాలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అవకతవకలకు బాధ్యులైన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని, గ్రూప్-1 ప్రశ్నపత్రాలు లీకేజీ, ఒఎంఆర్ షీట్ల లోపాలు, బయోమెట్రిక్ హాజరు లేకపోవడం వంటి అంశాలపై బాధ్యులైన అధికారులపై విచారణ జరిపి శిక్షించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రూప్-1 పరీక్షలు తిరిగి నిర్వహించాలని, పారదర్శకంగా విధి విధానాలను పున:సమీక్షించి, పూర్తి బయోమెట్రిక్, సిసి కెమెరాల పర్యవేక్షణతో పారదర్శక పరీక్షల నిర్వహణ జరగాలని, బాధిత అభ్యర్థులకు నష్టపరిహారం ఇవ్వాలని, ఏకంగా రెండు పరీక్షలు రద్దు కావడం వల్ల వేలాది మంది అభ్యర్థులు మానసికంగా, ఆర్థికంగా నష్టపోయారని వారికి కూడా నష్ట పరిహారం చెల్లించాలని, న్యాయ విచారణ హైకోర్టు లేదా రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో విచారణ కమిషన్ వేయాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో బిసి నేతలు గుజ్జ సత్యం, పగిళ్ళ సతీష్, రాందేవ్, పృథ్వీ, సుధాకర్, నరేందర్, రవియాదవ్ లింగంముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# తార్నాక ఆర్‌టిసి ఆస్పత్రిలో క్యాథ్‌ల్యాబ్ సేవలు

## అందుబాటులోకి 12 బెడ్ల ఎమర్జెన్సీ కేర్ యూనిట్

## ప్రారంభించిన ఎండి విసి సజ్జనార్

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** తార్నాకలోని టిజిఎస్ఆర్‌టిసి ఆసుపత్రిలో గుండె జబ్బులకు సంబంధించిన క్యాథ్ ల్యాబ్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. క్యాథ్ ల్యాబ్‌తో పాటు 12 బెడ్లకు విస్తరించిన ఎమర్జెన్సీ కేర్ యూనిట్‌ను శుక్రవారం సంస్థ ఎండి విసి సజ్జనార్ ప్రారంభించారు. ఈ కార్య క్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, వెంకన్న, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శైలజా మూర్తి, మెడికల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శ్రీనివాస్ తో పాటు ఐఓసీఎల్ నుంచి సురజ్ కుమార్, భాస్కర్ రావు, కైలాస్ కాంత్, నిర్మాన్ ఆర్గనైజేషన్ నుంచి శాంతి కుమార్, అనురాధ, ఫ్యాక్ట్స్ ఫౌండేషన్ ఎండి శ్రీనివాస్ కుమార్, అశోక్ లేలాండ్ ప్రతినిధులు నీరేష్ తివారి, సూర్యనారాయణ, రమేష్ శాస్త్రి పాల్గొన్నారు. ఫ్యాక్ట్స్ ఫౌండేషన్ సహకారంతో తార్నాక ఆసుపత్రిలో క్యాథ్ ల్యాబ్‌ను సంస్థ ఏర్పాటు చేయగా.. క్రిటికల్ కార్డియక్ కేర్ యూనిట్‌కు అశోక్ లేలాండ్ సంస్థ సహకరించింది. ఎమర్జెన్సీ కేర్ యూనిట్ విస్తరణకు నిర్మాణ్ డాట్ ఓఆర్‌జీ అనే సంస్థ ద్వారా ఐఓసీఎల్ ఆర్థిక సాయం చేసింది. సజ్జనార్ మాట్లాడుతూ.. ఆర్‌టిసికి ప్రధాన వనరులైన ఉద్యోగులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే సంస్థ ఆరోగ్యంగా ఉంటుం దని యాజమాన్యం భావిస్తుందన్నారు. అందుకే తార్నాక ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా తీరిదిద్దామని చెప్పారు. దేశంలో ఏ ఆర్‌టిసిలో లేనివిధంగా ఉద్యోగులకు ఇక్కడ కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. తార్నాక ఆస్పత్రిలో 2021లో ప్రతిరోజు సగటున 600 మంది ఔట్‌పేషంట్లు రాగా.. ప్రస్తుతం దాదాపు 2 వేలకు పెరిగిందని తెలిపారు. ఆర్‌టిసి ఉద్యోగుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని క్యాథ్ ల్యాబ్, క్రిటికల్ కార్డియక్ కేర్ యూనిట్‌తోపాటు ఎమర్జెన్సీ కేర్ యూనిట్ విస్తరణకు సహకరించిన ఐఓసీఎల్, ఫ్యాక్ట్స్ ఫౌండేషన్, అశోక్ లేలాండ్ సంస్థల ప్రతినిధులను ఆర్‌టిసి ఎండి విసి సజ్జనార్ అభినందించారు. సాంకేతికతను వినియోగించుకుని ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. భవిష్యత్‌లోనూ సిబ్బంది ఆరోగ్యసంరక్షణకు ఎన్నోకార్యక్రమాలను యాజమాన్యం తీసుకువస్తుందన్నారు.

# వారసత్వ సంపదను రక్షించుకుందాం

## మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** వారసత్వం అనేది జీవి మనుగడకే కాకుండా సమాజ మనగుడకూ మైలురాయిగా నిలుస్తుందని, ఒక సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే అన్ని రంగాలు కలిసి పని చేయాల్సి ఉంటుందని, ఇందు లో వారసత్వం అనే అంశం ప్రధానపాత్ర పోషిస్తుందని పర్యాటక, సాంస్కృ తిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రపంచ వారసత్వ దినోత్స వాన్ని పురస్కరించకుని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సంవత్సరం థీమ్ ద్వారా, ప్రకృతి విపత్తులు, సంఘర్షణల వల్ల ప్రపంచవ్యాప్తంగా అనేక వారసత్వ ప్రదేశాలు ఎదుర్కొంటున్న సవాళ్లపై దృష్టి సారించామన్నారు. గత 60 సంవత్స రాల్లో ఐసివోఎమ్‌వోఎస్ (ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆన్



మాన్యుమెంట్స్ అండ్ సైట్స్) చేపట్టిన చర్యల ద్వారా సేకరించిన అనుభవాల నుంచి మనం ఏం నేర్చుకోవచ్చో, భవిష్యత్ లో అపాయాలను ఎలా ఎదుర్కొనాలో పై అంశంపై చర్చకు ఇది ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కాలక్రమంలో, తెలంగాణ ప్రపంచ వారసత్వ జాబితాలో తన స్థానాన్ని స్థిరంగా పెంచుకుంటూ వస్తుందని, 2021 లో రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు లభించగా, ఈ సంవత్సరం ముడుమాల్ నిలువురాళ్లకు యునెస్కో ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో స్థానం దక్కడం తెలంగాణకు గర్వకారణమని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం తన విస్తృత సాంస్కృతిక, ప్రకృతి సంబంధ వారసత్వాన్ని రక్షించేందుకు, పునరుద్ధరించేందుకు, ప్రోత్సహించేందుకు అనేక కీలక చర్యలు తీసుకుంటుందని, ఈ ప్రయత్నాలు మన వారసత్వం భవిష్య తరాలకు స్ఫూర్తిగా, విజ్ఞాన భండారంగా, ఐక్యతకు చిహ్నంగా నిలబడేలా చేస్తాయని వివరించారు. వీటిని సంరక్షించి తరతరాలకు అంతే భద్రంగా అందించాల్సిన సమిష్టి బాధ్యత మనందరిపై ఉందని అన్నారు.

# అకాల వర్షాలకు 15,600 ఎకరాల్లో పంట నష్టం

## వ్యవసాయ శాఖ అంచనా

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** నెల రోజుల కింద భూగర్భ జలాలు అడుగంటి రాష్ట్ర వ్యాప్తంగా 2.50లక్షల ఎకరాల్లో వరి పంట ఎండిపోగా, ప్రస్తుతం ఆకాల వర్షాలకు 15,600 ఎకరాల్లో చేతికి వచ్చిన పంట నష్టం జరిగింది. రాష్ట్రంలో ఇటీవల కురిసిన ఆకాల వర్షాలకు 15,600 ఎకరాల్లో చేతికి వచ్చిన పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. వీటిలో ప్రధానంగా వరి, మొక్కజోన్న పంటల్లో ఎక్కువ నష్టం జరిగినట్లు గుర్తించింది.

మార్చి 21 నుండి ఈ నెల 15 వరకు కురిసిన వడగళ్ల వానలతో జరిగిన పంట నష్టంపై వ్యవసాయ శాఖ నివేదికలు తెప్పించింది. దాదాపు 16 జిల్లాల్లోని 78 మండలాల్లో సుమారు 15,600 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అంచనా వేశారు.

దెబ్బతిన్న పంటల్లో అత్యధికంగా 9,500 ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. అలాగే మరో 4,900 ఎకరాల్లో మొక్కజొన్న, 380 ఎకరాల్లో మామిడి ఇతర పంటలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. పంటనష్టంపై పూర్తి నివేదిక అందగానే నష్టపరిహారం చెల్లింపునకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గత ఏడాదిలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటకు ప్రభుత్వం రూ.10వేలు పరిహారం పంపిణీ చేసింది. ఈ సారి కూడా ఆకాల వర్షాలకు కూడా రూ.12వేలు ఇచ్చేందుకు వ్యవసాయ శాఖ ప్రతిపాదనలు పంపినట్లు తెలియవచ్చింది. కాగా అన్నదాతలపై వరుసగా ప్రకృతి కన్నెర్ర చేసి కంటనీరు పెట్టిస్తోంది.

మొన్నటి వరకు వివిధ పంటలకు సాగు నీరందక భూగర్భజలాలు అడుగంటి పోవడం, వివిధ ప్రాజెక్టులకు సం బంధించిన రిజర్వాయర్లలో మట్టాలు తగ్గిపోయి, సాగు నీరందక రాష్ట్రంలోని పలు జిల్లాల్లో చేతికొచ్చిన పంట పశువుల మేతగా మారింది. ఈ పరిస్థి తుల్లో మరికొన్ని జిల్లాల్లో అకాల వర్షాలతో పంట కోసే ముందు అకాల వర్షాలు, ఈదురు గాలులతో ధాన్యం పూర్తిగా నేలపాలైంది. దీంతో అన్నదాతల బతుకు అతలాకుతలంగా మారింది.

# బస్తర్ బచావో.. భారత్ బచావో

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలు కాల్పుల విరమణ పాటించాలి

## భారత్ బచావో సభలో మేధావుల, రాజకీయ నాయకుల పిలుపు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఏప్రిల్ 18 , ప్రభాతవార్త:** బస్తర్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రబుత్వాలు, మావోయిస్ట్ పార్టీల మధ్య కాల్పుల విరమణ జరగాలని హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భారత్ బచావో ఆధ్వర్యంలో కాల్పుల విరమణకు మద్దతుగా సభ నిర్వహించారు. ప్రొ. హరగోపాల్ మాట్లాడుతూ కేంద్రం, మావోయిస్ట్ పార్టీ మధ్య జరుగుతున్న యుద్ధంలో నక్సల్స్ పేరుపై అత్యధికంగా ప్రాణాలు కోల్పోతోంది ఆదివాసీలేనని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో ఆదివాసీలకు పొందుపర్చిన షెడ్యూల్ 5, 6లను ప్రభుత్వాలు కఠినంగా అమలు పరచాలన్నారు. మేధావుల సమక్షంలో ఏర్పడ్డ ప్లానింగ్ కమిటీ నివేదికను సమీక్షించాలని, ఆదివాసీల పట్ల మానవీయంగా వ్యవహరించాలని మావోయిస్ట్ పార్టీ తో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరిపి బస్తర్‌లో కాల్పుల విరమణ జరపాలన్నారు. ఆదివాసీ



భారత్ బచావో ఆధ్వర్యంలో కాల్పుల విరమణకు మద్దతుగా సభలో పాల్గొన్న ఎఐసిసి ప్రధాన కార్యదర్శి భక్తచరణ్‌దాస్, ప్రొ.హరగోపాల్, డాక్టర్ రియాజ్, వినోద్‌కుమార్, ప్రొ.కోదండరామ్ తదితరులు

నాయకురాలు సోనీ సోరి మాట్లాడుతూ బస్తర్‌లో సల్వా జుడుమ్, ఇతర ఆదివాసీలపై విపరీతమైన హింస జరుగుతోందని, నక్సల్స్ పేరుపై ఆదివాసీలను హింసిస్తున్నారన్నారు. ఆదివాసీలను అరెస్ట్ చేసి జైల్లో పెట్టి హింసిస్తున్నారన్నారు. బస్తర్‌లో ఎక్కడ చూసిన పోలీస్ క్యాంపులే ఉన్నాయన్నారు. బస్తర్‌ని కాపాడటం అంటే భారతదేశాన్ని కాపాడినట్టేనని ఈ వేదిక నుండి ప్రతి ఒక్కరికి విజ్ఞప్తి చేశారు. ప్రొ. కోదండరామ్ మాట్లాడుతూ రాజ్యాంగ పరిధిలోనే ప్రభుత్వాలు పనిచేయాలి. ఒకవేళ ఆ పరిధి దాటితే ప్రభుత్వాలకే హానికరం. మావోయిస్టు పార్టీ పిలుపిచ్చిన చర్చాలను నేను ఆహ్వానిస్తున్నాను. ఈ కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల నాయకురాలు సోనీ సోరీ, ఎఐసిసి జాతీయ ప్రధాన కార్యదర్శి భక్త చరణ్‌దాస్, ప్లానింగ్ కమిషన్ పూర్వ ఛైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎంపి మధు యాష్కి, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, దాసోజు శ్రవణ్‌కుమార్, ఎఐసిసి కార్యదర్శి డా. ఎస్.ఏ. సంపత్‌కుమార్, సి.పి.ఐ.(ఎం.ఎల్) న్యూడెమాక్రసి అధికారప్రతినిధి జె.వి. చలపతి రావు, సిపిఐ రాష్ట్రస్థ కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

# అధిక దిగుబడులకు భూసార పరీక్షలు

## వానకాలం నాటికి ఫలితాలు వచ్చేలా

## వ్యవసాయ శాఖ చర్యలు

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** వ్యవసాయ భూముల్లో అధిక దిగుబడులు వచ్చేందుకు వ్యవసాయ శాఖ దృష్టిసారించింది. పంట పొలాల్లో మంచి దిగుబడులు రావాలంటే నేల ఎంత సారవంతంగా ఉందనేది తెలియాల్సి ఉంటుందని భావించిన అధికారులు అందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వ్యవసాయ భూమిలో నత్రజని, భాస్వరం, పొటాష్ పరిమాణాల్లో మార్పులను భూసార పరీక్షల ద్వారా గుర్తించి అందుకు అనుగుణంగా పంటల సాగు చేపట్టనుంది. ఇందుకు సాయిల్ టెస్టులపై వనయవసాయ శాఖ అధికారులు దృష్టి సారించారు. ఈ భూసార పరీక్ష ఫలితాలు వచ్చే వానాకాలం సీజన్ మొదలయ్యే నాటికి రైతులకు అందేలా చేయాలనే దిశగా ప్రణాళికను రూపొందించారు. రాష్ట్రంలో పంటల సాగులో రసాయనిక ఎరువులు, యూరియా వాడకం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో రైతు వేదికల పరిధిలోని క్లస్టర్ల వారీగా మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు చేయనుంది. వీటి ఫలితాలును సంబంధిత రైతులకు అందించనుంది. ఇందుకు గాను క్షేత్ర స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు చెందిన భూముల్లో మట్టి నమూనాలను సేకరించి, వాటిని పరీక్షా కేంద్రాలకు తరలించనున్నారు. ఇందులో ప్రధానంగా సాంకేతికను ఉపయోగించనున్నారు. ఈ నేపథ్యంలో మొబైల్ యాప్ ద్వారా జీపీఎస్ ఆధారంగా పంట భూముల మట్టి నమూనాలను తీసుకుని ఆ చిత్రాన్ని అప్ లోడ్ చేయనున్నారు. వీటి పరీక్షా ఫలితాలు వచ్చిన తదుపరి అవి రైతుల ఫోన్లకు మెసేజ్‌లతో పాటు, భూసార కార్డులు సైతం చేరేలా సాఫ్ట్ వేర్ రూపొందించే పనిలో అధికారులు ఉన్నారు.

# టెట్రా ప్యాక్‌లో అందుబాటులోకి రానున్న మద్యం!

## ప్రణాళికలు సిద్ధం చేస్తున్న అధికారులు

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** ఎక్సైజ్‌శాఖ తన ఆదాయాన్ని పెంచుకునేందుకు అనేక మార్గాలను అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా కొంత శాతం మద్యం ధరలను పెంచింది. అంతే కాకుండా టెట్రాప్యాక్‌ల ద్వారా మద్యాన్ని అందిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి త్వరలో ఒక ప్రకటన విడుదల కానుందని తెలిసింది. ఫ్రూట్ జ్యూస్ తరహాలో మద్యాన్ని అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలుస్తోంది. 50 రూపాయలకు లిక్కర్ టేట్రా ప్యాకెట్ అందించేలా చర్యలు తీసుకోబోతున్నట్లు సమాచారం అందుతోంది. ఇందులో 60, 90, 180 ఎంఎల్ మధ్య.. ఈ కొత్త మద్యం ప్యాకెట్లు అందుబాటులో ఉండేవిధంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిసింది. ఈ విధంగా చేయడం ద్వారా సామాన్యుడికి కూడా అందుబాటులో ఉండే అవకాశం లభిస్తుంది. ఇప్పటికే ఇప్పటికే కాంగ్రెస్ పాలిత రాష్ట్రమైన కర్నాటకలో టెట్రాక్ ప్యాక్‌లో మద్యం అందుబాటులో ఉండగా ఇదే విధానాన్ని తెలంగాణలో కూడా అమలు చేయనుకున్నట్లు సమాచారం. ప్రభుత్వం ఇందుకు సంబంధించి పచ్చ జెండా ఊపితే మందుబాబుల కష్టాలకు తెరపడినట్లే అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఈ అంశంపై సిఎం లోతుగా అధ్యయనం చేసి, చర్చించి అనంతరం నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ఇప్పటికే కొద్ది కాలం క్రితం బీర్ల ధరలను పెంచిన ప్రభుత్వం మరో సారి లిక్కర్ ధరలు పెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. లిక్కర్‌పై రూ.10 పెంచే అవకాశం ఉన్నట్లు సమాచార కాగా, వేసవి కాలం పూర్తి కాగానే దీనికి సంబంధించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

# అంగన్‌వాడీలకు గుడ్ల టెండర్ల గడువు పెంపు


**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్లను సరఫరా చేసేందుకు టెండర్ల ప్రక్రియకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ గడువు పొడిగించింది. కోడిగుడ్ల సరఫరా కోసం కాంట్రాక్టర్ల ఎంపికకు సంబంధించిన మరో నెల రోజులపాటు గడువును పెంచుతూ నిర్ణయం తీసుకుంది. 37,500 అంగన్‌వాడీ కేంద్రాలకు యేటా 36.96 కోట్ల కోడిగుడ్లను సరఫరా చేసేందుకు కాంట్రాక్టర్ల ఎంపికను చేపట్టింది. రాష్ట్రంలోని ఏడు జోన్ల పరిధిలో ఏడుగురు కాంట్రాక్టర్ల ఎంపికకు టెండర్లను పిలిచింది. ఇందుకు వచ్చిన బిడ్లను ఈ నెల 11న తెరవాలని నిర్ణయించినా, టెండర్ల నిబంధనలపై అభ్యంతరాలు రావడంతో గడువు తేదీని ఐదు రోజులు పొడిగించింది. టెండర్ల ప్రక్రియపై కొందరు హైకోర్టులో పిటీషన్ దాఖలు చేసినట్లు తెలియవచ్చింది.

# అక్రమార్కుల్లో భయం పుట్టిస్తున్న శిక్షలు

## గంజాయి, డ్రగ్స్ నిందితుల్లో పెరుగుతున్న గుబులు

## శిక్షలు పడుతున్న జిల్లాల్లో టాప్‌లో మెదక్, సంగారెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** ఎక్సైజ్ శాఖ నమోదు చేసిన కేసుల్లో వరుస శిక్షల తీర్పులు గంజాయి, డ్రగ్స్ నిందితుల్లో గుబులు పుట్టిస్తున్నాయి. గంజాయి, డ్రగ్స్ పట్టుబడిన కేసుల్లో వరుసగా నిందితులకు శిక్షలు పడుతు న్నాయి. డ్రగ్స్, గంజాయి శిక్షలు పడుతున్న జిల్లాలో తెలంగాణలో మెదక్, సంగారెడ్డి జిల్లాలు టాప్‌లో నిలిచాయి. ఎక్సైజ్ శాఖ అంటేనే ..మద్యం, తయారీ, అమ్మకాలపైనే యంత్రాంగం దృష్టి పెడుతారు అనే అపవాదు ఉంది. కాని ఎక్సైజ్‌శాఖలో ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్టీఎఫ్, డీటీఎఫ్, ఎక్సైజ్ టీమ్‌లు ఉంటాయనే విషయం చాల మందికి తెలియదు. మద్యం అమ్మకాలతో పాటు నాన్ డ్యూటీపెయిడ్ లిక్కర్, డ్రగ్స్, గంజాయి, ఆల్ఫ్రోజోలం, క్లోరో హైడ్రేడ్, కల్తీ మద్యం తయారీ, అక్రమ రవాణపై ప్రత్యేక దృష్టి పెట్టి దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తారనే విషయం చాల మంది తెలియదు.ప్రత్యేక శిక్షదాడులు నిర్వహించే టీమ్‌ల పర్యవేక్షణ అధికారిగా ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌కు సీనియర్ ఐపీఎస్ అఫిసర్ వి.బి.కమలాసన్‌రెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ డెరెక్టర్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి కేసుల నమోదు, నిందితుల అరెస్టులతో వదిలి వేయకుండా నిందితులకు కేసుల్లో శిక్షలు పడితేనే అందరిలో భయం ఉంటుందని, శిక్షలు పడితే క్రైమ్ రేట్ తగ్గుతుందనే అలోచనలతో చాల కేసుల్లో చార్జీషీట్స్ రాయడం నుంచి పంచనామా వరకు ఎక్సైజ్ శాఖకు అన్ని స్థాయిల్లో పోలీస్ ఆకాడమీలో శిక్షణ ఇప్పించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపాలని ఇచ్చిన అదేశాల మేరకు ఎక్సైజ్‌శాఖ డెరెక్టర్ పరిధిలో పని చేసే నాలుగు ఎస్టీఎఫ్ టీమ్‌లతో దాడులను ముమ్మరం చేయించడం గంజాయి, డ్రగ్స్‌ను పెద్ద మొత్తంలో పుట్టుకోవడం, కేసులు నమోదు చేస్తూ ఉండడంతో ఎక్సైజ్‌శాఖకు పోలీసుల స్థాయిలో గుర్తింపు లభించింది.ఆపరేషన్ ధూల్‌పేట్‌తో గంజాయి అమ్మకాలకు చెక్ పడిరది. 2024లో 1162 ఎన్‌పీడీఎస్ కేసుల నమోదు, 6400 కేజీల గంజాయి 683.81ఎండీఎంఎ డ్రగ్స్‌ను పట్టుకొని ఎక్సైజ్ శాఖ సత్తా చాటారు.శిక్షలు పడుతున్న జిల్లాల్లో టాప్‌లో మెదక్, సంగారెడ్డి ఎక్సైజ్ శాఖలో తెలంగాణ జిల్లాలో నమ్మోదైన కేసుల్లో ఎక్కువ శిక్షలు పడుతున్న జిల్లాల్లో సంగారెడ్డి, మెదక్ జిల్లా మొదటి, రెండో స్థానాల్లో నిలిశాయి. సంగారెడ్డిలో 21 కేసుల్లో శిక్షలు పడ్డాయి, మెదక్‌లో 10 కేసుల్లో శిక్షలు పడ్డాయి. ఖమ్మం, కొత్తగూడంలో 9 కేసుల్లో శిక్షలు, హైదరాబాద్ మల్కాజిగిరిలో 6, మొత్తంగా తెలంగాణలో 60 కేసుల్లో నిందితులకు శిక్షలుపడ్డాయి. మహబూబ్‌నగర్‌లో తొలిసారిగా 5.030 కేజీల హాషీష్ అయిల్‌ను ఒరిస్సా నుంచి హైదరాబాద్‌కు సరఫరా చేస్తు ఉండగా పట్టుబడిన ఇద్దరు నిందితులు నర్తం రాయ్, ధర్మేంధర్ కుమార్ రాయ్‌లకు పదేళ్ల 5జైలు శిక్ష, రూ. లక్ష చొప్పున జరిమానా విధించారు. సంగారెడ్డిలో గురువారం అద్దెంకి సంగప్పా అనే వ్యక్తి ఐదేళ్ల 5జైలు శిక్ష, రూ.25 వేల జరిమానా విధించారు. సంగారెడ్డిలో వరుసగా గత రెండు మూడు నెలల నుంచి 6 కేసుల్లో శిక్షలు పడ్డాయి. 2024లో చేపట్టిన ఆపరేషన్ ధూల్‌పేట్‌లో భాగంగా 100 గంజాయి కేసుల్లో పట్టుబడిన నిందితులకు, హైదరాబాద్‌తోపాటు ఇతర జిల్లాల్లో గంజాయి, డ్రగ్స్‌తో పట్టుబడిన 950 కేసుల్లో నిందితులకు భారీగా శిక్షలు పడే అవకాశం ఉంటుందని భావిస్తుంది. నిందితులకు శిక్షలు పడడం పెరిగితే క్రైమ్ రేట్ తగ్గు తుందని అంచనా ఎక్సైజ్‌శాఖ వేస్తుంది. కేసుల్లో నిందితులకు శిక్షలు పడినపుడు మళ్లీ క్రైమ్ చేయడానికి భయపడుతారు. మిగితావారు కూడ నేరాలు చేయడానికి భయపడుతారు. శిక్షలుపడితే క్రైమ్ రేట్ తగ్గుతుంది. నేరస్తులు గంజాయి, డ్రగ్స్‌తో పట్టుబడినపుడు సరియైన రీతిలో పంచనామా, చార్జీ షీట్ రాసి, పంచులను పెట్టినపుడు కేసు బలంగా ఉంటుంది. ఈ మధ్యకాలంలో ఎక్సైజ్‌శాఖలో నమోదు చేసిన కేసుల్లో శిక్షలు పడుతుండటం గమనార్హం.



## బెంగాల్ ఘటనలపై బంగ్లా అనుచిత వ్యాఖ్యలు.. ఖండించిన భారత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్18:** పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న పరిణామాలపై బంగ్లాదేశ్ చేసిన వ్యాఖ్యలను భారతదేశం తిరస్కరించింది. వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఈ మధ్య పశ్చిమ బెంగాల్‌లో నిరసన కారులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఈ పరిస్థితి కొన్ని ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలకు దారితీసింది. దీనిపై బంగ్లాదేశ్ అధికారి మీడియాతో మాట్లాడుతూ అనుచిత వ్యాఖ్యలు చేయడం వివాదాస్పదమైంది. ఈ వ్యాఖ్యలపై తాజాగా భారత విదేశాంగ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ "పశ్చిమ బెంగాల్‌లో జరిగిన సంఘట నలకు సంబంధించి ఢాకా చేసిన వ్యాఖ్యలను తిరస్కరిస్తున్నాము. బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై జరుగుతున్న వేధింపులపై భారతదేశం వ్యక్తం చేస్తున్న ఆందోళనలకు కప్పిపుచ్చేందుకు ఢాకా కపట ప్రయ త్నాలు చేస్తోంది. అనవసరమైన వ్యాఖ్యలు చేయడం మాని బంగ్లాదేశ్ తమ దేశంలో సొంత మైనారిటీల హక్కులను కాపాడుకోవడంపై దృష్టి పెట్టడం మంచిది" అని హితవు పలికారు. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ముఖ్య సలహాదారు ముహమ్మద్ యూనస్ ప్రెస్ సెక్రటరీ షఫీకుల్ ఇస్లాం ఇటీవల మీడియాతో మాట్లాడుతూ, బెంగాల్‌లో జరిగిన హింసలో ముగ్గురు ముస్లిం సోదరులు ప్రాణాలు కోల్పోవడం, ఆస్తి నష్టం కలిగించేలా దాడులు జరగడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్ సంఘటనలో బంగ్లాదేశ్‌ను ఇరికించడానికి భారతదేశం చేస్తున్న ప్రయత్నాన్ని ఢాకా తీవ్రంగా నిరసిస్తోందని అన్నారు. ఇండియాలో మైనారిటీలుగా ముస్లిం ప్రజలను రక్షించడానికి అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన న్యూఢిల్లీ, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని కోరారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ముస్లిం సమాజం నిరసనలు వ్యక్తం చేసిన సమయంలో ముర్షిదాబాద్‌తో సహా పశ్చిమ బెంగాల్‌లోని కొన్ని ప్రాంతాలు గత కొన్ని రోజులుగా మతపరమైన హింసను చవిచూశాయి.

## మల్టీ జోన్-2 పరిధిలో 262 మంది కానిస్టేబుళ్లకు పదోన్నతులు

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మల్టీ జోన్-2 పరిధిలో 262 మంది కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతులు కల్పిస్తూ ఐజి సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా చార్మినార్ జోన్‌కు చెందిన వారు. పదోన్నతులు పొందిన వారిలో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 73 మంది, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 147 మంది, సంగారెడ్డి పరిధిలో 18 మంది, వికారాబాద్‌కు చెందిన 17 మంది, డిప్యూటేషన్‌పై వున్న మరో ఏడుగురు ఉన్నారు. పదోన్నతులు అందుకున్న వారు ఇప్పుడున్న ప్రాంతాలలోనే కొనసాగుతారు.

## ప్రభుత్వ వైద్యులకు సిఎం రేవంత్‌రెడ్డి ప్రశంసలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 18:** తెలంగాణ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రైవేటు లాంటి వైద్యం లభించిందని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తి చేసిన ట్వీట్‌పై సిఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. 'నేను రాను బిడ్డో సర్కార్ దవాఖానాకు అన్న నానుడిని తిరగ రాశారు. తాము తలచుకుంటే అసాధ్యాన్ని సుసాధ్యం చేయగలమని నిరూపించి ఉస్మానియా ఆసుపత్రి వైద్యులు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచారు. ఇతర వైద్యులకు మీరు ఆదర్శంగా నిలిచారు. మీకు నా అభినందనలు అని ఆయన ట్వీట్ చేశారు.



ఇందిరాపార్కు వద్ద జరిగిన మహాధర్నాలో ఐక్యత చాటుతున్న ఆర్.కృష్ణయ్య మధుసూదనాచారి, జస్టిస్ ఈశ్వరయ్య, నరేందర్‌గౌడ్ తదితరులు

## పార్లమెంట్‌లో బిసి బిల్లు ఆమోదించాలంటూ బిసి నేతల మహాధర్నా

**హైదరాబాద్ (సైఫాబాద్), ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిసి రిజర్వేషన్‌ల బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించి, 9వ షెడ్యూల్డ్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తూ అనేక బిసిలు శుక్రవారం ఇందిరాపార్కు వద్ద 'మహాధర్నా' నిర్వహించారు. ఈ ధర్నాకు తెలంగాణ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిధులుగా రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, శాసన మండలిలో బిఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ సిరికొండ మధుసూదనాచారి, జస్టిస్ వి.ఈశ్వరయ్య, పిసిసి మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానం చేసి విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థలలో 42 శాతం కల్పిస్తూ తీర్మానం చేసిన బిల్లుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే పార్లమెంట్‌లో అమోదించి 9వ షెడ్యూల్డ్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రంలోని అన్ని బిసి సంఘాలు ఐక్యంగా ఉద్యమిస్తాయని హెచ్చరించారు. ధర్నాలో ఓబిసి మేధావుల ఫోరం జాతీయ అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ, బిసి నేతలు గుజ్జ కృష్ణ, గుజ్జ సత్యం, జనార్దన్, సుధాకంర్, మట్ట జయంతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల తిరుగుబాటుతోనే బిఆర్‌ఎస్ ప్రభుత్వం కూలిపోయింది : ఎంపి మల్లు రవి

**హైదరాబాద్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రజల తిరుగుబాటుతోనే బిఆర్‌ఎస్ ప్రభుత్వం కూలిపోయిందని ఎంపి మల్లు రవి అన్నారు. గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. సిఎం రేవంత్‌పై కెటిఆర్ అక్కసు ఎందుకు అంటూ ప్రశ్నించారు. పదేళ్ల పాలనలో బంగారు తెలంగాణ కాస్తా బంగారు కేసిఆర్ కుటుంబంగా మారిందన్నారు. ప్రతిపక్షాలు రాత్రింబవళ్ళు కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్నాయన్నారు. బంగ్లాదేశ్‌లో ప్రజలు తిరిగిపడినట్లు కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడతారని కెటిఆర్ వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు అన్నారు. పదేళ్లలో బిఆర్‌ఎస్ చేయనటువంటి పనులను సిఎం రేవంత్ రెడ్డి చేస్తున్నారన్నారు. దేశ చరిత్రలో మొదటిసారిగా పేదల కోసం సన్న బియ్యం పంపిణీని ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ప్రపంచస్థాయి విద్య, మౌలిక సదుపాయాలను రేవంత్‌రెడ్డి ప్రవేశ పెట్టారన్నారు.

## కంచ గచ్చిబౌలి భూముల ఆర్థిక అక్రమాలపై విచారణ జరపాలి

### ట్విట్టర్ ద్వారా ప్రధాని మోడీకి కెటిఆర్ విజ్ఞప్తి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 18:** ప్రధాని మోదీకి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక విజ్ఞప్తి చేశారు. పర్యావరణంపై ప్రధానిగా తన చిత్తశుద్ధి, బాధ్యతను నిరూపించుకోవాల్సిన సమయం ఇది. కంచగచ్చిబౌలి భూముల ఆర్థిక అక్రమాలపై విచారణ జరిపి కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు కాలేదని నిరూపించుకోవాలి అని శుక్రవారం ట్విట్టర్ ద్వారా కోరారు. హెచ్‌సీయూలో జరిగిన విధ్వంసం విషయంలో మోదీ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. హెచ్‌సీయూలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన విధ్వంసంపై ప్రధాని మోదీ మాట్లాడింది కేవలం బూటకం కాకుంటే చర్యలు తీసుకోవాలి. కంచ గచ్చిబౌలి అంశం వందల ఎకరాల పర్యావరణ విధ్వంసం మాత్రమే కాదు, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రూ.10 వేల కోట్ల ఆర్థిక మోసం. కాంగ్రెస్ చేసిన ఆర్థిక మోసంపై ఇప్పటికే సెంట్రల్ విజిలెన్స్ కమిషన్, సీబీఐ, ఆర్బీఐ, సెబీ, ఎస్‌ఎఫ్‌ఐఒలకు ఆధారాలతో సహా తెలియజేశాం. ఆర్థిక అవకతవకలు జరిగినట్టు కేంద్ర సాధికార కమిటీ కూడా నిర్ధారించింది. కంచ గచ్చిబౌలిలో రూ.10 వేల కోట్ల ఆర్థిక అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం వెంటనే విచారణ చేపట్టాలి. ప్రధానిగా పర్యావరణ పరిరక్షణ, నిర్వహణపై చిత్తశుద్ధి నిరూపించుకోవాలి. తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటి కాదని, కుమ్మక్కు రాజకీయాలు చేయడం లేదని నిరూపించుకోవాలి.

# రైతుల పేర్లతో విత్తన కంపెనీల చీటింగ్

### తప్పుడు లావాదేవీలతో శఠగోపం

### రూ.వెయ్యి కోట్ల ఆదాయపు పన్ను ఎగవేత

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** రానున్న ఖరీఫ్ (వానకాలం) సాగును దృష్టిలో ఉంచుకుని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వివిధ విత్తన కంపెనీలు మాయ చేస్తున్నాయి. రైతుల పేరుతో విత్తనాలను తయారు చేస్తున్నట్లు చూపి అడ్డదార్లలో భారీ ఎత్తున ఆదాయపు పన్ను ఎగవేస్తున్నట్లు తెలియవచ్చింది. ఈ విధంగా దాదాపు రూ.వెయ్యి కోట్ల మేర ఆదాయపు పన్నులను ఎగవేసినట్లు తెలియవచ్చింది. అనువైన పంట భూములు, విస్తృతమైన రవాణా సౌకర్యాలు ఉండడంతో పాటు, రైతుల అమాయకత్వం వెరసి విత్తన కంపెనీల వ్యవహారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్థిల్లుతోంది. తమకు అవసరమయ్యే వ్యవసాయ ఉత్పత్తులను రైతుల వద్దనుండి కొనుగోలు చేసి వాటి నుండి నాణ్యమైన విత్తనాలను తయారు చేస్తున్నాయి. ప్రయోగ దశలో కొన్ని ప్రాంతాల్లో కంపెనీలే రైతుల పొలాల్లో అవసరమైన పంట వేయించి విత్తనాలు ఉత్పత్తి చేస్తున్నాయి. రాష్ట్రంలోని వరంగల్, కరీంనగర్ తదితర జిల్లాలు, ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరు, అనంతపురం, ప్రకాశం, చిత్తూరు తదితర జిల్లాల్లో వందలాది విత్తన కంపెనీలు ఉన్నాయి. వీటిలో పలు విత్తన కంపెనీలు తామే రైతుల్లా వ్యవహరిస్తూ పన్ను ఎగవేస్తున్నట్లు తెలిసింది. రెండు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో రైతులు, వ్యాపారుల నుండి బడా కంపెనీలు 2,500 కోట్ల రూపాయల నుండి 3,900 కోట్ల రూపాయల వరకూ విలువైన పత్తిని కొనుగోలు చేస్తున్నారు. రైతులకు తమ భూముల్లో పండించే పంటకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుంది. కంపెనీల పెట్టుబడులు, రైతుల నుండి పంట ఉత్పత్తులు కొనుగోలు చేసే వ్యాపారం ఆదాయపు పన్ను శాఖ పరిధిలోకి వస్తాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆయా విత్తన కంపెనీలు సొంతంగా వేల ఎకరాల వ్యవసాయ భూములను లీజుకు తీసుకున్నట్లు తప్పుడు రికార్డులు సృష్టిస్తున్నట్లు తెలుస్తోంది. ఈవిధంగా గుంటూరు, చిత్తూరు, ప్రకాశం, విజయనగరంతోపాటు, వరంగల్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో ఈ భూములు ఉన్నాయని, అక్కడ పండించిన పంట నుంచే తాము విత్తనాలను ఉత్పత్తి చేస్తున్నట్లు లెక్కలు చూపిస్తున్నట్లు సమాచారం. విత్తనాల తయారీకి పెట్టిన పెట్టుబడి పన్ను పరిధిలోకి రాదని తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. తెలంగాణలోని ఓ బడా కంపెనీ రైతులు, వ్యాపారుల వద్ద దాదాపు రూ.500 కోట్ల నుండి రూ.1,500 కోట్ల విలువైన పత్తిని కొనుగోలు చేస్తోంది. అయితే గతంలో ఆదాయపు పన్ను అధికారులు ఆ కంపెనీ రికార్డులను తనిఖీ చేయడంతో రైతుల పేరుతో పన్ను ఎగవేస్తున్నట్లు గతంలో గుర్తించింది. అలాగే నిబంధనలకు విరుద్ధంగా నగదు తీసుకుని దానికి లెక్క చూపించకుండా పన్ను ఎగవేతలోనూ విత్తన కంపెనీలు పోటీ పడుతున్నాయి. విత్తనాల కొనుగోళ్లకు డీలర్లు, వ్యాపారులు లావాదేవీలు రూ.రెండు లక్షలు దాటితే చెక్కు లేదా డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంది. కానీ కొన్ని విత్తన సంస్థలు నగదు చెల్లించాలని డీలర్లపై వత్తిడి తెస్తున్నాయి. ఇందుకు ప్రోత్సాహకాలు, పారితోషికం కూడా ఇస్తూ ఆఫర్లు ఇస్తున్నాయి. ఈ విధంగా తెలుగు రాష్ట్రాల్లో విత్తన వ్యాపారులు, అథరైజ్డ్ డీలర్లు దాదాపు 70 శాతం నుండి 80 శాతం లావాదేవీలను నగదురూపంలోనే నిర్వహిస్తున్నాయి. విత్తన ప్రయోగ క్షేత్రాలు 50 ఎకరాల్లో లేకున్నా వేలాది ఎకరాలు లీజుకు తీసుకున్నట్లు రికార్డులు చూపిస్తున్న విత్తన కంపెనీలు రూ. కోట్ల మేర పన్ను ఎగవేసినట్లు వెల్లడవుతోంది.

# రుద్రారంలో తోషిబా ఫ్యాక్టరీ

### రూ.562 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 18:** తోషిబా కార్పొరేషన్ అనుబంధ సంస్థ టీటీడీఐ (ట్రాన్స్ మిషన్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ ఇండియా) తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ముందుకొచ్చాయి. విద్యుత్ సరఫరా, పంపిణీ రంగంలో పెట్టుబడులు, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం హైదరాబాద్ సమీపంలోని రుద్రారంలో టీటీడీఐ సర్జ్ అరెస్టర్స్ తయారీ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తుంది. వీటితో పాటు పవర్ ట్రాన్స్ఫార్మర్స్, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్స్, గ్యాస్ ఇన్సులేటెడ్ స్విచ్‌గేర్ (జీఐఎస్) తయారీ సామర్థ్యాన్ని విస్తరించడానికి ఇప్పటికే అక్కడ ఉన్న ఫ్యాక్టరీలను అప్‌గ్రేడ్ చేయనుంది. ఈ ప్రాజెక్ట్‌కు రూ. 562 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నారు. అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించే ఈ కొత్త ఫ్యాక్టరీ విద్యుత్ రంగంలో పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడంతో పాటు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుంది. రుద్రారంలో ఇప్పటికే రెండు ఫ్యాక్టరీలను విజ యవంతంగా నిర్వహిస్తున్న టీటీడీఐ, ఈ కొత్త పెట్టుబడితో మూడో ఫ్యాక్టరీ నెలకొల్పనుంది. ప్రస్తుతం ఉన్న ఫ్యాక్టరీల సామర్థ్యాన్ని విస్తరించనుంది. టోక్యోలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సమక్షంలో తోషిబా కార్పొరేషన్ ఎనర్జీ బిజినెస్ డైరెక్టర్ హిరోషి కనెటా, రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేష్ రంజన్, టీటీడీఐ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ హిరోషి ఫురుటా ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక పరివర్తనలో దేశంలోనే తెలంగాణ ముందు వరుసలో ఉందని అన్నారు. పరిశ్రమల భాగస్వామ్యాలు, వ్యూహాత్మక సహకారాలతో అన్ని రంగాల్లో ప్రపంచ పెట్టుబడిదారులను ఆకర్షిస్తోందని అన్నారు. కొత్త పెట్టుబడులకు తోషిబా చేసుకున్న ఒప్పందం పారిశ్రామిక రంగంలో కొత్త ఉత్సాహమిస్తుందని అన్నారు. టీటీడీఐ ఛైర్మన్ హిరోషి ఫురుటా మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక విధానాలు తమను ఆకట్టుకున్నాయన్నారు. కొత్త ఆవిష్కరణల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధత తెలంగాణను పెట్టుబడుల గమ్య స్థానంగా మార్చుతున్నాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ఉత్సాహంతో ఉన్నట్లు చెప్పారు.



# సైబరాబాద్‌లో ఉగ్రదాడికి హెడ్లీ, లష్కర్ ఏ తోయిబాల కుట్ర

### హైదరాబాద్‌లో హెడ్లీ ఉండాలని అనుకునేవాడు

### ఎన్ఐఎ విచారణలో వెల్లడించిన రాణా

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** భారత్ సహా పలు దేశాలలో ఉగ్ర దాడులకు వ్యూహం పన్ని అమెరికాకు దొరికిపోయి అక్కడి జైల్లో ఊచలు లెక్కపెడుతున్న క రుడుగట్టిన ఉగ్రవాది పాక్..అమెరికర్ డేవిడ్ హెడ్లీ అలియాస్ దావూద్ గిలాని 2008 ముంబాయి మారణకాండ సమయంలో సైబరాబాద్‌లోనూ దాడికి కుట్ర పన్నిన ట్లు తాజాగా వెలుగు చూసింది. పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న లష్కర్ ఏ తోయిబా సహకారంతో హెడ్లీ ఈ కుట్ర పన్నినట్లు తేలింది. దీంతో పాటు హెడ్లీ హైదరా బాద్‌లో కొంతకాలం వుండాలని అనుకునేవాడని కూడా తేలింది. ముంబాయి మారణ కాండ సూత్రధారిగా వుండి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) కస్టడీలో వున్న పాక్...కెనెడియన్ తహవూర్ రాణా హెడ్లీకి సంబంధించిన విషయాలను వెల్లడించాడు. భారత్‌పై ఉగ్రదాడులు జరుపుతున్న పాక్ ఉగ్రవాద సంస్థ లష్కర్ ఏ తోయిబా హిట్ లిస్టులో హైదరాబాద్ ఎప్పటి నుంచో వున్న విషయం తెలిసిందే. ఢిల్లీ, ముంబా యి తరువాత హైదరాబాద్‌లో లష్కర్ ఏ తోయిబా నేరుగా దాడులకు పాల్పడిన ఉదంతాలు వుం డడంతో పాటు దాని అనుబంధ సం స్థల కు చేయూతనందించిన ఉదం తాలు వున్నాయి. తాజాగా హైదరాబాద్‌లో లష్కర్ ఏ తోయిబా కుట్ర మరొకటి వెలుగు చూసింది. ఎన్ఐఎ కస్టడీలోవున్న రాణా ఈ విషయాలను వెల్లడించాడు. 2008లో ముంబాయి మారణకాండ తరహాలో సైబరాబాద్‌లోనూ ఉగ్రదాడికి హెడ్లీ కుట్ర పన్నినట్లు రాణా వెల్లడించాడు. హెడ్లీకి లష్కర్ ఏ తోయిబా సహకరించిందని అతను తెలిపాడు. హెడ్లీని 2010లో అమెరికా పోలీసులు అరెస్టు చేసి విచారించగా అతని కుట్రలు అనేకం వెలుగు చూశాయని, ఇందులో సైబరాబాద్ కూడా వుందని రాణా చెప్పాడు. తాను లష్కర్ ఏ తోయిబా తరపున పనిచేసినట్లు హెడ్లీ తనతో చెప్పాడని, ఆ సంస్థ నిర్వహించిన పలు కఠినమైన ఉగ్ర శిక్షణా క్యాంపుల్లో శిక్షణ పొందినట్లు వెల్లడించాడని రాణా తెలిపాడు. ఇందులో ఆయుధాల వినియోగం, బాంబులు పేల్చడం, వాటిని స్థానికంగానే తయారు చేయడం వంటివి వున్నాయని హెడ్లీ చెప్పినట్లు రాణా తెలిపాడు. లష్కర్ ఏ తోయిబా ఉగ్ర క్యాంపుల్లో శిక్షణ పొందిన తరువాత హెడ్లీ ఆ సంస్థ ఉగ్రవాదులు పలువురిని తరచూ కలిసేవాడని, వారంతా క లిసి సైబరాబాద్‌లో ఉగ్రదాడికి స్కెచ్ వేసినట్లు అమెరికా పోలీసుల విచారణలో వెలుగు చూసిందని రాణా తెలిపాడు. సైబరాబాద్‌లో దాడులకు రెక్కీ నిర్వహించేందుకు లష్కర్ ఏ తోయిబా హెడ్లీని కొంతకాలం హైదరాబాద్‌లో పంపాలని భావించిందని అమెరికా పోలీసుల విచారణలో తేలిందని రాణా ఎన్ఐఎ అధికారులకు తెలిపాడు. భారత్‌లో హెడ్లీ నివసించేందుకు అనువైన నగరాలలో ముంబాయితో పాటు నాగపూర్, పుణే, కోల్‌కతా, ఢిల్లీ, బెంగళూరులను లష్కర్ ఏ తోయిబా ఎంపిక చేసిందని రాణా తెలిపాడు. ఇందులో ముంబాయిలో హెడ్లీ కొంతకాలం మకాం వేసి 2008 మారణకాండకు వ్యూహం పన్నాడని రాణా తెలిపాడు. ముంబాయి మారణకాండ తరువాత లండన్, డెన్మార్క్‌లలో తదుపరి దాడులకు హెడ్లీ సిద్ధమవుతున్న తరుణంలో అమెరికా పోలీసులకు దొరికి పోయాడని, ఆ సమయంలోనే ముంబాయి దాడిలో అతని పాత్ర వెలుగు చూసిందని రాణా తెలిపాడు. రాణా వెల్లడించిన విషయాలతో ఎన్ఐఎ అధికారులు 108 పేజీలతో ఒక నివేదికను తయారుచేసి వీటి ఆధారంగా ప్రశ్నలు సంధిస్తూ వాటికి జవాబులు రాబడుతున్నారు.

# తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావడం పగటి కల

### ఎన్నికలు అయిపోగానే బద్ధశత్రువుల్లా బిజెపి, బిఆర్‌ఎస్ నేతల డ్రామాలు

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్




**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** తెలంగాణకి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చేసిందేమిటని టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ ప్రశ్నించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఎంపి మల్లురవి, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్, సిడబ్ల్యుసి సభ్యులు వంశీచంద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. ఎన్నికలు రాగానే బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీ ప్రేమ చిగురించడం పరిపాటిగా మారిందన్నారు. ఎన్నికలు అయిపోగానే బద్ధ శత్రువుల్లా బిజెపి, బిఆర్‌ఎస్ నేతల డ్రామాలు ఆడుతున్నారని అన్నారు. మీలాగా రహస్య ప్రేమను నడపడం మాకు మా పార్టీకి అలవాటు లేదన్నారు. 25 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎంపిగా అంబర్‌పేట నియోజక వర్గానికి ఏం చేశారని నిలదీశారు. తెలంగాణలో బిజెపి అధికారంలోకి వస్తుంది అనుకోవడం పగటి కలే అని ఎద్దేవా చేశారు. నిధుల సంగతి దేవుడెరుగు ఒక్కసారైనా ప్రధానిని కలిసి రాష్ట్ర అభివృద్ధి గురించి మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. కేంద్ర మంత్రిగా 15 నెల్లలో రాష్ట్రానికి తెచ్చిన నిధులు ఎన్ని అన్నారు. తెలంగాణ బిడ్డగా సిగ్గు అనిపించడం లేదా అన్నారు. కిషన్‌రెడ్డి పొద్దున లేస్తే అక్బరుద్దీన్ ఓవైసీ జపం చేయడం అలవాటుగా మారిందన్నారు. గత జన్మ లో ఇద్దరు అన్నదమ్ములు అనుకుంటానని. బిజెపి నేతలకు మతం తప్ప అభివృద్ధిపై ధ్యాస లేదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో రజాకార్ల రాజ్యం ఎందుకు వస్తుందో తెలియా లన్నారు. కేంద్ర మంత్రిగా దిగజారుడు వ్యాఖ్యలు చేయడం బాధాకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సన్నబియ్యం లాంటి చారిత్రాత్మక నిర్ణయాలు అమలు చేస్తుంటే ప్రభుత్వానికి కిషన్‌రెడ్డి అడుగడుగునా అడ్డుపడుతున్నారు. సన్నబియ్యం పంపిణీపై రాద్ధాంతం చేసే బదులు బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఆ పథకాన్ని అమలు చేసి రేషన్ షాపుల్లో మోడీ ఫోటో పెట్టుకోవాలన్నారు. కులం మతం పేరు చెప్పి ఇంకెన్నాళ్లు పబ్బం గడుపుకోవాలని చూస్తారన్నారు.
లోకల్ బాడీ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ పార్టీతో రహస్య ఒప్పందం నిజం కాదా కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. సంఖ్యాబలం లేని మీరు ఎవరి ప్రేమ అండదండలు చూసుకుని పోటీ చేస్తున్నారు. మాకు సంఖ్యా బలం లేదు కాబట్టే ఎన్నికలకు దూరంగా ఉన్నాం. రాజకీయ అవసరాల బట్టి లోకల్‌బాడి ఎన్నికల్లో మద్దతు గురించి ఆలోచిస్తాం. కులం మతం రాజకీయాలకు కాలం చెల్లింది. ఎవరికి తొత్తుగా ఉండాల్సిన అవసరం మాకు లేదు. కాబట్టే మేము గత అసెంబ్లీ, లోక్‌సభ, ఎన్నికల్లో పోటీ చేసి గెలిచామన్నారు. సబర్మతి నది గురించి మాట్లాడే మీరు మూసి సుందరీకరణకు ఎందుకు అడ్డుపడుతున్నారని సమాధానం చెప్పాలన్నారు. మెట్రో రైలు విస్తరణకు పట్టదు. విభజన హామీలు పట్టవు. రాష్ట్ర అభివృద్ధి కోసం మేము మా సిఎం, మంత్రులు ప్రధానిని కలవడానికి వస్తారు మీరు సిద్ధమా. కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన ప్రాజెక్టుల గురించి ఎందుకు మాట్లాడటం లేదు. హెచ్‌సియు భూముల్లో పారిశ్రామిక అభివృది జరిగితే యువతకు వేల ఉద్యోగావకాశాలు లభిస్తాయి. రాజకీయాలు పక్కన పెట్టి రాష్ట్రాభివృద్ధికి సహకరించాల్సింది పోయి స్వార్థ కోసం విమర్శలు చేయడం సరికాదు.
బిసిలపై చిత్త శుద్ధి ఉంటే ఢిల్లీలో ధర్నాకు ఎందుకు మీ పార్టీ నేతలు హాజరు కాలేదని ఆయన అన్నారు. బిసిల గురించి మాట్లాడే నైతిక హక్కు బిజెపి నేతలకు లేదు. బిసి బిడ్డలైన ఈటల రాజేందర్, బండి సంజయ్ బిసిల 42 శాతం రిజర్వేషన్ల గురించి ఎందుకు మాట్లాడటం లేదని ఆయన అన్నారు.

### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకంలో

## తప్పుడు సమాచారం ఇచ్చిన బిల్ కలెక్టర్ సస్పెన్షన్

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పథకంలో అవకతవకలకు పాల్పడే ఎలాంటి వారినైనా ఉపేక్షించే లేదని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవిన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి బేస్మెంట్ స్థాయి వరకు నిర్మాణం జరగకుండానే, పూర్తయిందని తప్పుడు సమాచారాన్ని అప్లోడ్ చేసిన బిల్ కలెక్టర్ జగదీష్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని మంత్రి ఆదేశాల మేరకు బిల్ కలెక్టర్ జగదీష్ ను సస్పెండ్ చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి నేడు ఆదేశాలు జారీ చేశారు. భద్రాచలం గ్రామపంచాయతీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి 18 మంది లబ్ధిదారులు బేస్మెంట్ వరకు నిర్మాణం పూర్తి చేశారనే తప్పుడు సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేశారని, దీనిపై సంబంధిత బిల్ కలెక్టరుకు మెమో జారీ చేయగా పొరపాటున ఈ సమాచారాన్ని అప్‌లోడ్ చేసినట్లు సంజాయిషి ఇవ్వడంతో ఆ బిల్ కలెక్టర్ ను సస్పెండ్ చేసినట్టు జిల్లా పంచాయతీ అధికారి వెల్లడించారు. కాగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి విధుల నిర్వహణలో ఏ విధమైన అలసత్వం వహించే ఎంతటి వారినైనా సహించేది లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## జిపిఎస్ టోల్ విధానంపై కేంద్రం స్పష్టీకరణ

### మే 1 నుంచి అమలు చేసే యోచన కేంద్రంలో లేదు

### వివరణ ఇచ్చిన కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** దేశంలో కొత్తగా ప్రవేశ పెట్టాలని భావించిన జిపిఎస్ టోల్ విధానంపై కేంద్రం స్పష్టత ఇచ్చింది. మే 1 నుంచి జిపిఎస్ టోల్ సిస్టమ్‌ను కేంద్రం అమలు చేసే ఆలోచనలో ఉన్నట్లు జాతీయా మీడియాలో వార్తలు వస్తున్న నేపథ్యంలో జిపిఎస్ టోల్ విధానంపై కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ వివరణ ఇచ్చింది. ప్రస్తుతం అమలు చేస్తున్న ఫాస్టాగ్ టోల్ వ్యవస్థ స్థానంలో జిపిఎస్ ఆధారిత టోల్ వసూలు వ్యవస్థ తీసుకొచ్చే యోచనలో ఉన్నట్లు ప్రచారం జరగగా..వాహనదారుల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం శుక్రవారం స్పందించింది. జిపిఎస్ టోల్ సిస్టమ్‌పై వస్తున్న వార్తలను ఖండించింది. ఇప్పటి వరకు అటువంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పింది. వచ్చే నెల 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా జిపిఎస్ ఆధారిత టోల్ వ్యవస్థను అమలు చేసే అంశం కేంద్రం పరిశీలనలో లేదని రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ వివరణ ఇచ్చింది. ప్రస్తుతం టోల్ ప్లాజాల వద్ద వాహనాలు సజావుగా, అడ్డంకులు లేకుండా ప్రయాణించడానికి అన్ని చర్యలు తీసుకున్నట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రయాణ సమయాన్ని తగ్గించడానికి ఎంపిక చేసిన టోల్ ప్లాజాల్లో ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఏఎన్‌పీఆర్) ఫాస్టాగ్ వ్యవస్థను అమలు చేస్తున్నామని తెలిపింది.

## రేపు బిసి గురుకులాల్లోని బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి ప్రవేశపరీక్ష

### 6,832 సీట్లకు 26,884 దరఖాస్తులు

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బిసి గురుకుల పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి వరకు ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం ఈనెల 20 ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన 109 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు బిసి గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. బిసి గురుకులాల్లో 6 నుంచి 9వ తరగతి వరకు మిగిలిపోయిన 6832 బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కొరకు దరఖాస్తులను ఈ నెల 6 వరకు స్వీకరించారు. 26,884 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. అడ్మిషన్ల కోసం ప్రవేశ పరీక్షను ఈ నెల 20(ఆదివారం)న నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షను నిర్వహించనున్నారు. మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపును చేపట్టనున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బిసి గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న 6, 7, 8, 9వ తరగతుల సీట్లను భర్తీ చేయడానికి ఈనెల 20న నిర్వహించే ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు తెలిపారు. ఇప్పటికే అభ్యర్థులందరూ హాల్ టికెట్ డౌన్లోడ్‌చేసుకున్నారని, ఇంకా హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకోని వారు ఎవరైనా ఉంటే వెంటనే తమ సొసైటీ వెబ్‌సైట్ డౌన్‌లోడ్ చేసుకొని ప్రవేశ పరీక్షకు హాజరు కావాలని సూచించారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపును చేపట్టనున్నట్టు సైదులు తెలిపారు.


**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)**
Lenin Center, Governorpet, Vijayawada - 520 002 (A.P.)

**E-PROCUREMENT SHORT TENDER NOTICE**

Tender invites the following bids which can be downloaded on AP e- Procurement portal as per the scheduled dates stated below.

| S.No | NIT No | Name of the Work |
|---|---|---|
| 1 | 13/PROC/ MAU61-USI0HB(OTH)/123/ 2025-HB/2nd Call, Dated: 18.04.2025 | RFP for "Selection of an Agency for conceptualization, installation, and operation of an Immersive Tech Exhibition (Amaravati Experience Centre) on QCBS tendering basis. |
| 2 | 14/PROC/MAU61-USI0HB(OTH)/121/ 2025-HB/2nd Call, Dt:18.04.2025 | Preparation of 3D model of Amaravati Government Complex (AGC) to display at Hon'ble Prime minister's programme at Amaravati" - Estimate Cost: Rs.88.50 Lakhs. |

The bids can be downloaded on AP e-procurement portal from 19.04.2025 to 22.04.2025 up to 14:00 Hrs. Due date for submission of Bid 22.04.2025 up to 15.00 Hrs, Technical bid opening 22.04.2025 @16.00 Hrs. For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in

Sd/- Commissioner, APCRDA, Vijayawada.

తెర

# 'దూరదర్శని' నుంచి లిరికల్ వీడియో

సువిక్షిత్ బొజ్జ, గీతిక రతన్ జంటగా నటిస్తున్న చిత్రం దూరదర్శని. కలిపింది ఇద్దరిని అనేది ఉపశీర్షిక. కార్తికేయ కొమ్మి దర్శకుడు. వారాహా మూవీ మేకర్స్ పతాకంపై బి.సాయి ప్రతాప్ రెడ్డి, జయ శంకర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణానంతర పనులను జరుపుకుంటోంది. 1990వ నేపథ్యంలో అందరి హృదయాలను హత్తుకునే ప్రేమకథగా ఈ చిత్రం రూపొందుతుంది. ఇటీవల విడుదలైన ఈ చిత్రం టైటిల్ టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. దీంతో పాటు నానీడ వెళుతుందా అనే లిరికల్ వీడియో సాంగ్‌కు కూడా అనూహ్యమైన ప్రశంసలు లభించాయి. తాజాగా ఈ చిత్రం నుంచి అనే లిరికల్ వీడియోను పాన్ ఇండియా దర్శకుడు పుష్ప, పుష్ప2 చిత్రంతో ప్రపంచవ్యాప్తంగా అందరి ప్రశంసలు అందుకున్న బ్రిలియంట్ దర్శకుడు సుకుమార్ విడుదల చేశారు. సింధుజ, శ్రీనివాసన్ ఆలపించిన ఈ బ్యూటిఫుల్ సాంగ్‌కు సురేష్ బనిశెట్టి సాహిత్యం అందించారు. ఆనంద్ గుర్రాన బాణీలు సమకూర్చారు. ఈ సందర్భంగా దర్శకుడు సుకుమార్ మాట్లాడుతూ, ఈ సినిమా హీరో సువిక్షిత్ నా రూపం వచ్చేటట్లు వరిపొలంలో ఫామింగ్ చేశాడు. నాకు అప్పట్నుంచి పరిచయం ఉంది. తనకి సినిమా అంటే పాషన్. సాంగ్ చాలా బాగుంది. ఈ సినిమా పెద్ద సక్సెస్ కావాలి. ఈ సినిమా అందరికి మంచి విజయం అందించాలి అన్నారు. హీరో సువిక్షిత్ మాట్లాడుతూ, నా అభిమాన దర్శకుడు, నాకు ఎంతో ఇష్టమైన వ్యక్తి సుకుమార్ చేతుల మీదుగా మా సాంగ్ ఆవిష్కరణ జరగడం ఎంతో సంతోషంగా, గర్వంగా ఉంది. ఈ సినిమా అందరిని 90వ దశకంలోకి తీసుకెళ్లి మీ జ్ఞాపకాల్ని గుర్తుకు తెస్తుంది. అందరికి వాళ్ల వాళ్ల ప్రేమకథలు కూడా గుర్తుకు వస్తాయి. తాజాగా విడుదలైన ఈ లిరికల్ వీడియో అందరి హృదయాలకు హత్తుకుంటుంది. 1990వ నేపథ్యంలో అందరికి కనెక్ట్ అయ్యే కథ ఇది. బ్యాక్‌డ్రాప్‌కు తగ్గ నటీనటులతో, లోకేషన్స్‌తో ఎంతో సహజంగా తెరకెక్కించిన సినిమా ఇది. ఈ సినిమా కోసం ఎంతో రీసెర్చ్ చేసి దర్శకుడు చిత్రాన్ని రూపొందించాడు. తప్పకుండా చిత్రాన్ని అందరూ ఎంతో బాగా ఎంజాయ్ చేస్తారు" అని తెలిపారు. సువిక్షిత్ బొజ్జ, గీతిర రతన్, భద్రం, కృష్ణా రెడ్డి, కిట్టయ్య, చలపతి రాజు, జెమిని సురేష్, జి.భాస్కర్, భద్రమ్, లావణ్య రెడ్డి, తేజ చిట్టూరు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కథ: నారాయణ ఆవుల, డైలాగ్స్: కాకర్ల చరణ్, లక్ష్మణ్.కె, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: జె.సుబ్బారెడ్డి, సంగీతం: ఆనంద్ గుర్రాన, పీఆర్ఓ: ఏలూరు శ్రీను, మదురి మధు.



# 'ఓదెల 2' సక్సెస్ మీట్

తమన్నా భాటియా లేటెస్ట్ బ్లాక్ బస్టర్ ఓదెల 2. సూపర్ నాచురల్ థ్రిల్లర్ ఓదెల రైల్వే స్టేషన్‌కి సీక్వెల్ ఇది. సంపత్ నంది సూపర్ విజన్ లో అశోక్ తేజ దర్శకత్వంలో, మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్‌పై డి మధు నిర్మించిన ఈ చిత్రం తమన్నా నాగ సాధువుగా అదరగొట్టారు. వేసవిలో బిగ్గెస్ట్ ఎట్రాక్షన్ లలో ఒకటిగా ఏప్రిల్ 17న విడుదలైన ఓదెల2 అన్ని చోట్ల బ్లాక్ బస్టర్ రెస్పాన్స్‌తో సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సక్సెస్ మీట్ నిర్వహించారు. సక్సెస్ ప్రెస్ మీట్‌లో మూవీ క్రియేటర్ సంపత్ నంది మాట్లాడుతూ, మేము ఈ సినిమా మీద పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేసిన ఆడియన్స్‌కి థాంక్యూ. మేము ఆశించిన రెస్పాన్స్ ఆడియన్స్ నుంచి రావడం చాలా ఆనందంగా ఉంది. తమన్నా నాగ సాధువుగా ఫస్ట్ లుక్ రిలీజ్ అయినప్పటి నుంచే ఈ సినిమాపై చాలా అంచనాల ఏర్పడ్డాయి. తన పెర్ఫార్మన్స్ ఈ సినిమాకి హైలైట్‌గా ఉండబోతుందని మేము ముందే చెప్పాము. అది ఈరోజు ఆడియన్స్ చెప్పడం చాలా ఆనందంగా ఉంది. తమన్నా వశిష్ట సింహా మధ్య పోటాపోటీ పెర్ఫార్మన్స్ ఉంటుందని చెప్పాము. అది ఆడియన్స్ విట్నెస్ చేస్తున్నారు. ఇది ముఖ్యంగా లేడీస్‌తో ఫ్యామిలీతో కలిసి చూడాల్సిన సినిమా. ఈరోజు ఒక ప్రీమియర్ లాగా మొదలైంది. ఈ వారాంతం మీ ఫ్యామిలీతో కలిసి వచ్చి ఈ సినిమాని అద్భుతంగా ఎంజాయ్ చేయవచ్చు. ఈ సినిమాలో సైకిల్ ఎపిసోడ్, క్లైమాక్స్‌లో వచ్చే రెండు సర్ప్రైజ్ ఎలిమెంట్స్, అలాగే మరికొన్ని సీక్వెన్స్ మిమ్మల్ని మంత్రముగ్ధుల్ని చేయబోతున్నాయి. ఒక మంచి ఎక్స్పీరియన్స్‌తో థియేటర్స్ నుంచి బయటికి రండి. ఈ సినిమాకి చాలా సక్సెస్ సెలబ్రేషన్స్ ఉంటాయి. ప్రేక్షకుల నుంచి వచ్చిన రెస్పాన్స్‌కి థాంక్స్ చెప్పాలని ఈ ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ సినిమాని దీవించిన శివునికి, ప్రేక్షక దేవుళ్ళకి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు అన్నారు. ప్రొడ్యూసర్ డి మధు మాట్లాడుతూ, అందరికి నమస్కారం. సుదర్శన్ 35 ఎంఎం లో ఈ సినిమాని ప్రేక్షకులతో కలిసి చూశాను. చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా అందరికీ కనెక్ట్ అయింది. ముఖ్యంగా లేడీస్ చాలా బాగా కనెక్ట్ అయ్యారు. డివైన్ ఫుల్ క్యారెక్టర్‌లో తమన్నా అద్భుతంగా చేశారు. అలాగే వశిష్ట కూడా పోటాపోటీగా చేశాడు. ఇది మర్చిపోలేని రోజు. సినిమాకు వచ్చిన రెస్పాన్స్ చాలా ఆనందాన్ని ఇచ్చింది. ముందు ముందు ఇంకా గొప్ప సెలబ్రేషన్స్ ఉండబోతున్నాయి అన్నారు. వశిష్ట ఎన్ సింహ మాట్లాడుతూ.. ఇది నాకు చాలా స్పెషల్ డే. థియేటర్స్‌లో ఆడియోస్‌తో కూర్చుని ఈ సినిమా చూశాను. ఆడియన్స్ రెస్పాన్స్ అద్భుతంగా ఉంది. ఇది నాకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది. శివతాండవం థియేటర్స్‌లో మొదలైంది. దాని విశ్వరూపం రేపట్నుంచి అందరికీ అర్థమవుతుంది. అందరికీ తెలుస్తుంది. ఇంత మంచి సక్సెస్ ఇచ్చిన ఆడియన్స్‌కి థాంక్యూ అన్నారు.



# 'బ్యాంక్ ఆఫ్ భాగ్యలక్ష్మి' ఫస్ట్ సింగిల్ రిలీజ్

యంగ్ ట్యాలెంటెడ్ దీక్షిత్ శెట్టి హీరోగా అభిషేక్ ఎమ్ దర్శకత్వంలో రూపొందుతున్న తెలుగు కన్నడ బైలింగ్వల్ క్రైమ్ కామెడీ థ్రిల్లర్ బ్యాంక్ ఆఫ్ భాగ్యలక్ష్మి. బృందా ఆచార్య హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీ దేవి ఎంటర్ టైనర్స్ బ్యానర్‌పై హెచ్ కె ప్రకాష్ ఈచిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే రిలీజిన ఈ సినిమా ఫస్ట్ లుక్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. మేకర్స్ ఫస్ట్ సింగిల్ హార ఓం సాంగ్‌ని రిలీజ్ చేసి మ్యూజిక్ ప్రమోషన్స్ కిక్ స్టార్ట్ చేశారు. జుధాన్ శ్యాండీ ఈ సాంగ్‌ని డివైన్ వైబ్‌తో పవర్ ఫుల్ నంబర్‌గా కంపోజ్‌చేశారు. ఆశ గురించి తెలియజేసే బట్టు విజయ్ కుమార్ లిరిక్స్ మీనింగ్ ఫుల్‌గా వున్నాయి. మంగ్లీ పవర్ ఫుల్ వోకల్స్ సాంగ్‌ని మరో స్థాయికి తీసుకెళ్ళాయి. ఈ సాంగ్ ఇన్స్టంట్ హిట్ అయ్యింది. ఈ చిత్రానికి అభిషేక్ జే డీవోపీగా పని చేస్తున్నారు. తేజస్ ఆర్ ఎడిటర్. రఘు మైసూర్ ప్రొడక్షన్ డిజైనర్. నటీనటులు: దీక్షిత్ శెట్టి, బృందా ఆచార్య టెక్నికల్ టీం: రచన, దర్శకత్వం: అభిషేక్ ఎమ్, నిర్మాత: హెచ్ కె ప్రకాష్, బ్యానర్: శ్రీ దేవి ఎంటర్‌టైనర్స్, సంగీతం: జుధాన్ శ్యాండీ, డీవోపీ: అభిషేక్ జే, ఎడిటర్: తేజస్ ఆర్, ప్రొడక్షన్ డిజైనర్: రఘు మైసూర్ పీఆర్వో: వంశీ శేఖర్.



# 'కిల్లర్' గ్లింప్స్ విడుదల

శుక్ర, మాటరాని మౌనమిది, ఏ మాస్టర్ పీస్ వంటి డిఫరెంట్ సినిమాలతో మూవీ లవర్స్‌ను ఆకట్టుకుంటున్న దర్శకుడు పూర్వాజ్ మరో సెన్సేషనల్ సైఫై యాక్షన్ థ్రిల్లర్ కిల్లర్ సినిమాతో ప్రేక్షకుల ముందు కొస్తున్నారు. ఈ చిత్రంలో పూర్వాజ్ హీరోగా నటిస్తుండగా, జ్యోతి పూర్వజ్ హీరోయిన్‌గా నటిస్తోంది. విశాల్ రాజ్, గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. థింక్ సినిమా బ్యానర్‌పై ఏయు అండ్ ఐ, మెర్జ్ ఎక్స్ ఆర్ సంస్థలతో కలిసి పూర్వాజ్, ప్రజయ్ కామత్, ఎ. పద్మనాభ రెడ్డి నిర్మిస్తున్నారు. కిల్లర్ పార్ట్ 1 డ్రీమ్ గర్ల్ మూవీ షూటింగ్ కంప్లీట్ చేసుకుంది. ప్రస్తుతం ప్యాచ్ వర్క్స్ జరుగుతున్నాయి. ఈ నెల 30న ఈ సినిమా గ్లింప్స్ రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ తాజాగా ప్రకటించారు. సరికొత్త సైఫై యాక్షన్ థ్రిల్లర్‌గా లవ్, రొమాన్స్, రివేంజ్, ఆర్టిఫిషల్ ఇంటెలి జెన్స్, థ్రిల్లర్ అంశాలతో ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేసేందుకు కిల్లర్ పార్ట్ 1 డ్రీమ్ గర్ల్ మూవీ ముస్తాభవుతోంది. ఈ సినిమాను త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.



నటీనటులు: జ్యోతి పూర్వజ్, పూర్వాజ్, విశాల్ రాజ్, చందూ, గౌతమ్, దశరథ, తదితరులు. టెక్నికల్ టీమ్: సినిమాటోగ్రఫీ: జగదీశ్ బొమ్మిశెట్టి, మ్యూజిక్: అషీర్ ల్యూక్, సుమన్ జీవరత్నం, వీఎఫ్ఎక్స్: వర్చువల్ ప్రొడక్షన్: మెర్జ్ ఎక్స్ ఆర్ పీఆర్ఓ: జీఎస్ కే మీడియా (సురేష్ శ్రీనివాస్), బ్యానర్స్: థింక్ సినిమా, మెర్జ్ ఎక్స్ ఆర్, ఏయు అండ్ ఐ, నిర్మాతలు: పూర్వాజ్, ప్రజయ్ కామత్, ఎ.పద్మనాభ రెడ్డి, రచన, దర్శకత్వం: పూర్వాజ్.

# రిలీజ్‌కు రెడీ 'జింఖానా'

మలయాళం బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ అలప్పుజ జింఖానా ఇప్పుడు తెలుగులో కూడా సంచలనం సృష్టించడానికి సిద్ధంగా ఉంది. ఈ స్పోర్ట్స్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఏప్రిల్ 25, 2025న రెండు తెలుగు రాష్ట్రాల థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. నస్లెన్ ప్రధాన పాత్రలో ప్రముఖ దర్శకుడు ఖలీద్ రహ్మాన్ దర్శకత్వంలో వైబ్స్, ఫైట్స్, ఫన్ బ్లెండ్‌తో ఈ చిత్రం బాక్సాఫీసు వద్ద సూపర్ హిట్ అయ్యింది. లుక్మాన్ అవరన్, గణపతి, బేబీ జీన్, సందీప్ ప్రదీప్, ఫ్రాంకో ఫ్రాన్సిస్, శివ హరిహరన్ ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించారు. ప్లాన్ బి మోషన్ పిక్చర్స్, రీలిస్టిక్ స్టూడియోస్ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి విష్ణు విజయ్ మ్యూజిక్ అందించారు, జిమ్షి ఖలీద్ డీవోపీగా పని చేశారు. నిషాద్ యూసుఫ్ ఎడిటర్. నటీనటులు: నస్లెన్, లుక్మాన్ అవరన్, గణపతి, బేబీ జీన్, సందీప్ ప్రదీప్, ఫ్రాంకో ఫ్రాన్సిస్, శివ హరిహరన్, కార్తీక్, షోన్ జాయ్, అనఘ రవి, నంద నిశాంత్ మరియు నోయిలా ఫ్రాన్సీ దర్శకత్వం: ఖలీద్ రెహమాన్ రచన: ఖలీద్ రెహమాన్, శ్రీని శశీంద్రన్, నిర్మాతలు: ఖలీద్ రెహమాన్, జాబిన్ జార్జ్, సమీర్ కారత్, సుబీష్ కన్నంచెరి, సంగీతం: విష్ణు విజయ్, డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ: జిమ్షి ఖలీద్ సాహిత్యం: సుహైల్ కోయా, ఎడిటర్: నిషాద్ యూసుఫ్ ఆర్ట్ డైరెక్టర్: ఆషిక్ ఎస్, పీఆర్వో: వంశీ శేఖర్.



# 'సింగిల్' సాంగ్ లాంచ్

కింగ్ ఆఫ్ ఎంటర్టైన్మెంట్ శ్రీ విష్ణు ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో హోల్సమ్ ఎంటర్‌టైనర్ సింగిల్‌తో అలరించబోతున్నారు. ఈ చిత్రానికి కార్తీక్ రాజు దర్శకత్వం వహించారు. గీతా ఆర్ట్స్ మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో కళ్యా ఫిల్మ్స్‌తో కలిసి చిత్రాన్ని విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి విశాల్ చంద్ర శేఖర్ సంగీత దర్శకుడు. ఫస్ట్ సింగిల్ ఒక సోల్ ఫుల్ రొమాంటిక్ మెలోడీ. సెకండ్ సింగిల్ గ్రూవ్ టు ది ఫ్రస్ట్రేషన్ యాంథమ్ సిర్రకైంది సింగిల్ బతుకు కొద్దిసేపటి క్రితం విడుదలైంది. "ఫ్రస్ట్రేషన్ యాంథెమ్"గా ఈ పాట, ఒంటరి జీవితాన్ని ఒక వేడుకలా చూపిస్తుంది. పాటలో సరదా సాహిత్యం, ఆకట్టుకునే మాస్ అప్పీల్ ఉన్నాయి. రాహుల్ సిప్లిగంజ్ వోకల్స్, రామజోగయ్య శాస్త్రి చమత్కారమైన సాహిత్యంతో ఈ సాంగ్ అలరిస్తోంది. శ్రీ విష్ణు, వెన్నెల కిషోర్‌తో కలిసి ఒంటరితనంని హ్యూమర్‌తో జోడిస్తూ చెప్పడం హిలేరియస్‌గా ఉంది. కేతికా శర్మ, ఇవానా ఈ చిత్రంలో హీరోయిన్స్. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ ఆర్ వేల్ రాజ్, ఎడిటింగ్ ప్రవీణ్ కెఎల్, ఆర్ట్ డైరెక్టర్ చంద్రిక గొర్రెపాటి. సింగిల్ మూవీ మే 9న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. నటినటులు: శ్రీవిష్ణు, కేతిక శర్మ, ఇవానా, వెన్నెల కిషోర్ తదితరులు.






# ఓటీటీలో 'శివంగి'

ఆనంది, వరలక్ష్మి శరత్‌కుమార్ ప్రధాన పాత్రలలో దేవరాజ్ భరణి ధరణ్ దర్శకత్వం వహించిన పవర్ ఫుల్ విమెన్ సెంట్రిక్ ఫిల్మ్ శివంగి. జాన్ విజయ్, డాక్టర్ కోయ కిషోర్ కీలక పాత్రల్లో నటించారు. ఇటీవలే థియేటర్స్‌లో రిలీజ్ అయిన సినిమా అందర్నీ ఆకట్టుకుంది. ఇప్పుడు ఈసినిమా భవానీ మీడియా ద్వారా ఆహా ఓటీటీలో స్ట్రీమ్ అవుతుంది. తెలుగు వర్షన్‌స్ట్రీమ్ అవుతుండగా నేటి నుంచి తమిళ వెర్షన్ ప్రసారం కానుంది. ఆద్యంతం ఆకట్టుకునే గ్రిప్పింగ్గా సాగే ఈ థ్రిల్లర్లో ఆనంది, వరలక్ష్మి శరత్‌కుమార్ పవర్ ఫుల్ పెర్ఫార్మెన్స్‌లు అందించారు. బిగినింగ్ నుంచి ఎండింగ్‌వరకు ప్రేక్షకుల్ని కట్టిపడేసే స్క్రీన్ ప్లేతో ఈ చిత్రం ప్రేక్షకుల్ని ఎంటర్టైన్ చేయనుంది. ఈ వీకెండ్‌లో డోంట్ మిస్ ఇట్.



# 'నేను-కీర్తన'కు భారీ స్పందన

చిమటా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై చిమటా రమేష్ బాబు (సి.హెచ్.ఆర్) హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం నేనుకీర్తన. చిమటా జ్యోతిర్మయి(యు.ఎస్.ఏ) సమర్పణలో, చిమటా లక్ష్మీ కుమారి నిర్మించారు. గత ఏడాది ఆగస్టు 30న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రానికి మంచి ఆదరణ దక్కింది. ఇప్పుడు ఈ చిత్రం ఓటీటీలోకి అందుబాటులోకి వచ్చింది. ఏప్రిల్ 16 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ సినిమా స్ట్రీమింగ్ అవుతోంది. 99 రూపాయల రెంట్‌తో స్ట్రీమింగ్ అవుతున్న ఈ చిత్రానికి ఓటీటీలోనూ మంచి రెస్పాన్స్ వస్తోంది. తక్కువ సమయంలోనే ఎక్కువ వ్యూస్ రాబట్టుకుంది. లవ్, సెంటిమెంట్, యాక్షన్, రొమాన్స్, కామెడీ, హర్రర్‌తో పాటు అన్ని ఎలిమెంట్స్‌తో మల్టీ జానర్ మూవీగా చిమటా రమేష్ బాబు (సి.హెచ్.ఆర్) ఈ చిత్రాన్ని రూపొందించారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ కావడంతో ఈ చిత్రానికి ప్రేక్షకులు కనెక్ట్ అవుతున్నారు. జానీ పాత్రలో రమేష్ బాబు నటించిన తీరు అందర్నీ ఆకట్టుకుంది. జానీ అన్యాయాలను ఎదురించే యువకుడిగా, అపాదలో ఉన్న వారికి సాయం చేసే వ్యక్తిగా నటించారు. అయితే ఓ విషయంలో తను శత్రువులతో పోరాడాల్సి వస్తుంది. అదే టైమ్‌లో జానీ లైఫ్‌లోకి కీర్తన వస్తుంది. ఇద్దరి మధ్య మొదలైన స్నేహం ప్రేమగా మారుతుంది. కీర్తన ప్రమాదంలో ఉన్న విషయం జానీకి తెలుస్తుంది. ఆ ప్రమాదం నుంచి కీర్తను జానీ ఎలా బయటకు తీసుకువచ్చాడనేది చాలా ఆసక్తికరంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. కుల్లు మనాలిలో చిత్రీకరించిన పాత్రలు, యాక్షన్ ఎపిసోడ్స్ హైలైట్‌గా ఉన్నాయి. ఊహించని మలుపులతో కథను హర్రర్ వైపుకు తీసుకెళ్ళాడు దర్శకుడు. రిషిత, మేఘన హీరోయిన్లుగా నటించి అందరినీ ఆకట్టుకున్నారు. రేణు ప్రియా, సంధ్య, జీవా, విజయ్ రంగరాజ్, జబర్దస్త్ అప్పారావు, జబర్దస్త్ సన్నీ తదితరలు ఇతరపాత్రల్లో మెప్పించారు. ఈ చిత్రం ఐఎమ్‌డీబీలో 8.9 రేటింగ్‌ను సొంతం చేసుకుంది. బుక్‌మై షోలో 9.3రేటింగ్‌ను సొంతం చేసుకుంది. చిత్రం: నేనుకీర్తన, నటీనటులు: చిమటా రమేష్ బాబు, రిషిత, మేఘన, రేణు ప్రియా, సంధ్య, జీవా, విజయ్ రంగరాజ్, జబర్దస్త్ అప్పారావు, జబర్దస్త్ సన్నీ, మంజునాథ్ తదితరులు, బ్యానర్: చిమటా ప్రొడక్షన్స్, సమర్పణ: చిమటా జ్యోతిర్మయి(యు.ఎస్.ఏ).



# ఆన్‌లైన్ షాపింగ్ ఆఫర్లతో జాగ్రత్త!

ప్రస్తుతం ప్రతి వస్తువు ఆన్‌లైన్‌లో కొనటం అలవాటయిపోయింది. జుట్టుకు పెట్టుకునే హెయిర్ ఆయిల్ నుండి కాలికి వేసుకునే చెప్పులవరకు ఆన్‌లైన్‌లో బుక్‌చేసుకుని తెప్పించుకుంటున్నారు. కొన్ని యాప్స్‌ల పట్ల జాగ్రత్త వహించాలి. అదే విషయం వివరంగా ఇక్కడ ప్రస్తావించారు. యాప్స్ కొనే ప్రతి వస్తువునూ విశ్లేషిస్తాయి. దాని ఆధారంగానే ప్రకటనలు చూపిస్తాయి. అందుకు నిజంగా కావాల్సిన మోడల్స్ ఆఫర్‌లో ఉన్నాయా? అని ముందుగా చెక్ చేసుకోవాలి. నిజంగా కావాల్సిన వస్తువు, డ్రెస్ వుంటే తక్షణమే ఇతర కామర్స్ కంపెనీలతో పోల్చి చూడాలి. ఒరిజనల్ రిటైలర్స్ మెయిల్స్‌కు పంపించే నోటిఫికేషన్స్ ఆన్ చేసుకున్నట్లయితే సదరు బ్రాండ్‌కు సంబంధించినదో కాదో తెలుస్తుంది. అలాగే కచ్చితమైన రేటు అర్థమవుతుంది. ఆయా బ్రాండ్స్‌ను సోషల్ మీడియాలో ఫాలో అవ్వాలి. అప్పుడే సేల్స్ విషయాలు అర్థమవుతాయి.



అవసరం లేకున్నా డిస్కౌంట్స్, కూపన్స్ ఉన్నాయని కొనవద్దు. దానివల్ల తెలియకుండా నష్టపోతారు. క్రెడిట్ కార్డు షాపింగ్ ఆధారంగానో.. రిటైల్ షాప్‌లో ఇచ్చిన ఫోన్ నెంబర్ ఆధారంగానో నోటిఫికేషన్స్ వస్తుంటాయి. పైగా యాప్స్ ద్వారా ఉండే లొకేషన్, క్రెడిట్ కార్డు లేదా డెబిట్ కార్డుతో ఫలానా బ్రాండ్స్ కొంటున్నారనే సమాచారం ఆ కంపెనీలకు తెలుస్తుంది. కాబట్టి ఫోన్ నెంబర్స్‌ను షాపింగ్ మాల్స్‌లో ఇవ్వొద్దు. నిజంగా తరచూ షాపింగ్ చేస్తున్నట్లయితే మెంబర్‌షిప్స్‌తో కచ్చితంగా లాభపడతారు. ఉచితంగానే ఆయా సంస్థల ఇతర సర్వీసులనూ పొందుతారు. అయితే ఫ్రీ మ్యూజిక్, సినిమాలను ఎన్నిసార్లు చూస్తారనే విషయాన్ని అనాలసిస్ చేసుకోవాలి. ఒకటికి రెండు సార్లు ఆలోచించాలి. మెంబర్‌షిప్ చెల్లించాక ఆయా సర్వీసులను ఉపయోగించుకోకపోతే డబ్బు వృథా అయినట్లు. ఫలానా ప్యాంట్ అద్భుతంగా ఉంది. ఈ షూ తొడిగితే భలే కంఫర్ట్. ఇలాంటి ఫేక్ రివ్యూలను నమ్మవద్దు. ఫలానా కంపెనీ వస్తువు బావుంటుందో లేదా అన్న అనుభవం ఉండాలి. లేదా స్నేహితులు వాడితే దాని గురించి తెలుసుకొని ఉండాలి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ రోజుల్లో ఫేక్ రివ్యూలు ఇచ్చే సంస్థలు పుట్టగొడుగుల్లా వచ్చాయి. అనే విషయం గుర్తుంచుకోవాలి. చెకప్ ఇన్‌స్టాలో పెయిడ్ ప్రమోషన్స్ చేస్తుంటారు. వాటికి దూరంగా ఉంటేనే మేలు. తక్కువ ధరకు వస్తున్నాయంటే దాని మాన్యు ఫాక్చరింగ్ తేది చెక్ చేయాలి. అలాగే ఫిఫ్టీపర్సంట్ డిస్కౌంట్ అంటే చాలా సార్లు ఫ్లాట్ కాదని గుర్తుంచుకోవాలి. ఒక వేళ ఫిఫ్టీ సెవెంటీ పర్సెంట్ డిస్కౌంట్ అని చూసినా.. ఇంతకు ముందు దాని ధర తెలుసుండాలి. లేదా ఇతర పోర్టల్స్‌లో చూసుకోవాలి. ఫైనల్ సేల్ అనే మార్కు ఉందా లేదా చెక్ చేయాలి. రిటర్న్ బ్యాక్ పాలసీ చూడాలి. అలాగైతే నష్టపోతారు. లేజీ పే లేటర్ ఏది చేసినా ఆ క్షణానికి డబ్బులు కట్టలేదు కదా అనిపిస్తుంది. అయితే ఆ తర్వాత బ్యాంక్ బ్యాలెన్స్ లేనప్పుడు మరీ ఇబ్బందవుతుంది. అందుకే ఆటోమేటిక్‌గా చేసుకోవాలి. ఇలా కుదరకుంటే వాటి జోలికి వెళ్లకపోవడమే మంచిది. పే లేటర్‌కు ఆన్‌టైమ్‌లో బిల్లు కట్టకపోతే సిబిల్ స్కోర్ ప్రభావితం అయ్యే అవకాశం ఉంది. వారంటీలకు ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తారు. కొన్ని రిపేర్లు వీటి పరిధిలోకి రాకపోవచ్చు.

## ఆధ్యాత్మికం

# ఏనుగు బలం

ఏనుగు సహజంగా బలమైన జంతువు. మావటి వాడు చాలా నేర్పుతో దానితో మసలుకుంటాడు. ఏనుగు తిరగబడితే ఎవరిని, దేనిని లెక్కచేయదు. అది ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తుందో మావటికే ఎరుక. ఒక్క ఏనుగు తన దంతాలతో కుమ్మేయగలదు. చరిత్రలో, పురాణాలలో ఏనుగుది ప్రత్యేక పాత్ర. ఏనుగు రణరంగంలో ఉంటే, దాని నెక్కి యుద్ధం చేసేవారు మంచి ధైర్యసాహసాలు కలిగి ఉండాలి. ఇంద్రుడు తన శ్వేత ఐరావతం నెక్కి దానవులపై యుద్ధం చేశాడు. మహాభారతంలో, రామాయణంలో, భాగవతంలో ఏనుగుది కీలకపాత్ర. ప్రహ్లాదుడిని ఏనుగులతో తొక్కించమని హిరణ్యకశపుని ఆజ్ఞ. అవి తొండంతో ఆశీర్వదించి వెనకడుగు వేయడం ఆశ్చర్యం. మనం ఏదయినా కార్యం చేయదలచి వచ్చినపుడు వెయ్యి ఏనుగుల బలం ఉంది నాకు అంటూ ఉంటాం. నిజానికి అంత బలం మనకు ఉండదు. వాడుకలో ఆ మాట అంటాం.

బలవంతుడు అంటే కండలు తిరిగినవాడు కాదు. బక్క పలుచగా ఉన్న వాళ్లు అత్యంత బలవంతులు. దృతరాష్ట్రుడు అటువంటి కోవకు చెందుతాడు. యుద్ధంలో కౌరవులు నాశనమైన తరువాత ఆ గుడ్డి రాజు ఆలోచనలో విపరీత మార్పు వచ్చింది. యుద్ధంలో ఆసాంతం భీముడే ప్రధాన పాత్ర వహించాడని తెలుసుకున్నాడు. పగ, ప్రతీకారంతో రగిలిపోయాడు. ఆశీర్వాదం కోసం ధృతరాష్ట్రుడి చెంతకు పాండవులు వచ్చినపుడు భీముని సంహరించాలని దుష్ట ఆలోచనతో ఉన్నాడు. పాండవుల అలికిడి విని 'నాయనా భీమా' అంటూ లోలోపల పళ్లు కొరుకుతూ ఆలింగనం చేసుకుంటూ ఉంటే శ్రీకృష్ణుడు వారించి మాయ కంచు విగ్రహం సృష్టించాడు. తనివి తీరా ఆ విగ్రహాన్ని తన కౌగిలిలో తుత్తునియలు చేశాడు. ఆశ్చర్యపోవడం పాండవుల వంతయింది. చూడటానికి అంధ రాజు బక్క పలుచగా ఉన్నా, వెయ్యి ఏనుగుల బలం అతనిది. కండలు పెంచిన వాడికి అటువంటి బలం ఉంటుంది అనుకోవడం భ్రమ.

- కనుమ ఎల్లారెడ్డి

## ఆరోగ్య భాగ్యం

# పల్మోనరీ టి.బి



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

టిబి మానవాళికి తెలిసిన మొదటి వ్యాధి అని చెప్పవచ్చు. ఎందుకంటే ఇది మూడు మిలియన్ సంవత్సరాల క్రితం తూర్పు ఆఫ్రికాలో మొదట వచ్చింది. అప్పటి నుండ ప్రపంచవ్యాప్తంగా 10 మిలియన్ల మంది టిబితో బాధపడుతున్నారు. అందులో అయిదు మిలియన్ల మంది ఈ వ్యాధితో మరణిస్తున్నారు. ఇది ఆగమగ తేడా లేకుండా వస్తుంది. ఇది 40 ఏళ్ల తర్వాత స్త్రీల కన్న పురుషుల్లో ఎక్కువగా కనిపించడంతో దీన్ని యువకుల దోపిడీ వ్యాధి అని పిలిచేవారు. 19వ శతాబ్దంలో టి.బితో అనేక మంది మరణించేవారు. దాంతో దీన్ని మృత్యువ్యాధులన్నింటికి కెప్టెన్ అని పిలిచేవారు. దీన్ని శృంగార వ్యాధిగా కూడా పరిగణించేవారు. గత 50,60 సంవత్సరాలలో టిబి రోగుల సంఖ్య తగ్గినా వ్యాధి తీవ్రతలో, అది రూపాంతరం చెందడంలో పెద్దగా తేడా లేకపోవడంతో దీన్ని వైట్‌డెత్, వైట్‌ప్లేగు, నల్ల ఊపిరితిత్తుల వ్యాధి, పల్మోనాలిస్ అని వివిధ పేర్లతో వ్యవహరించడమైనది. ఇది 46శాతం దక్షిణ ఆసియాలో ఎక్కువగా వస్తుంది. ఇది చైనా, దక్షిణ ఆఫ్రికా, పాకిస్తాన్, ఇండోనేషియా, నైజీరియా, ఇండియాలో ఎక్కువగా కనిపిస్తోంది. జర్మన్ వైద్యుడు మైక్రోబయాలజిస్ట్ డా.రాబర్ట్‌కోచ్ కనుగొనడంతో దీన్ని కోచ్ డిసీజ్ అని అంటారు. డాక్టర్ రాబర్ట్ కోచ్‌ని ఆధునిక క్షయశాస్త్ర పితామహుడు అని అంటారు. టి.బి అనేది లాటిన్ పదం. ఇది ట్యూబర్‌క్యులమ్ అనే పదం నుండి వచ్చింది. దీని అర్థం చిన్న వాపు, గడ్డ లేదా నోడ్యూల్. దీన్నే పిథిసిస్ అని అంటారు. ఇది మైకోబాక్టీరియం ట్యూబర్‌క్యులోసిస్ అనే రాడ్ ఆకారం బాక్టీరియా వల్ల వస్తుంది. ఇది రెండు రకాలుగా వస్తుంది. 1.బోవిన్ టైప్: ఇది జునోసిస్ వ్యాధి. ఇది పశువుల్లో, కనిపించే వ్యాధి. ఇది సోకితే జబ్బుపడరు. వ్యాధి లక్షణాలు టి.బి లక్షణాల్ని పోలి ఉంటాయి. 2.హ్యూమన్ టైప్: ఇది మనుషుల్లో కనిపిస్తుంది. ఇది అంటువ్యాధి. ఇది టి.బి ఉన్నవారు దగ్గినప్పుడు, తుమ్మినపుడు, ఉమ్మివేసినప్పుడు, మాట్లాడినప్పుడు వెలువడే తుంపర్ల ద్వారా గాలి ద్వారా వ్యాపిస్తుంది. ఇది రెండు రకాలుగా ఉంటుంది. 1. అక్యూట్ రకం: ఇది తరుణ వ్యాధిగా ఉండి ఎఫెక్టివ్‌గా ఒకరి నుంచి ఇతరులకి సులభంగా వ్యాపిస్తుంది. వ్యాధి లక్షణాల్ని బట్టి వ్యాధిని గుర్తించవచ్చు. బి.సి.జి వ్యాక్సిన్ ద్వారా, మందుల ద్వారా వ్యాధిని నయం చేయవచ్చు. 2.క్రానిక్ రకం: ఇది దీర్ఘకాలిక వ్యాధి కాబట్టి శరీరంలోని ఇతర అవయవాలకి వ్యాపిస్తుంది. ఇది మొండి వ్యాధిగా ఉండి అనేక కాంప్లికేషన్స్‌ని కలిగిస్తుంది. ఇది రకాలుగా వ్యాప్తి చెందుతుంది. 1. పల్మోనరీ ట్యూబర్‌క్యులోసిస్: ఇది ప్రధానంగా ఊపిరితిత్తుల్ని ప్రభావితం చేస్తుంది. ఇందులో మూడువంతుల కేసులు పల్మోనరీ టి.బికి చెందినవే. అంటే నూటికి 87 కేసులు వివిధ దశల్లో వ్యాధిని సంక్రమింపచేస్తాయి. దీన్నే టి.బి సంక్రమణం అంటారు. దీనిలో మొదటి దశను ప్రైమరీ ఇన్ఫెక్షన్ లేదా ప్రాథమిక సంక్రమణ అంటారు. వీరిలో క్లినికల్ లక్షణాలుండవు. కొందరిలో అలసట, దగ్గు, లోజ్వరం వంటి లక్షణాలుంటాయి.



# మిక్స్‌డ్ వెజిటబుల్ చట్నీ

కావాల్సిన పదార్థాలు :
ఉల్లిపాయలు ముక్కలు పావు కప్పు, తరిగిన పచ్చిమిర్చి- రెండు చెంచాలు, తరిగిన అల్లం-అరచెంచా, వెల్లుల్లి రెబ్బలు- నాలుగు, పసుపు- అరచెంచా, టమోటా ముక్కలు- ఒకకప్పు కేరెట్- అరకప్పు, తరిగి కొత్తిమీర,-రెండు చెంచాలు, చింతపండు రసం -రెండు చెంచాలు, పంచదార - ఒక చెంచా, ఉప్పు- తగినంత, నూనె- పావు కప్పు, ఆవాలు ఒక చెంచా, మినపప్పు, ఒక చెంచా జీలకర్ర,ఒక స్పూను, ఎండు మిరపకాయలు- రెండు, ఇంగువ- తగినంత.

తయారీ విధానం :
కేరట్, బీన్స్,కాలీఫ్లవర్‌ముక్కలను కుక్కర్‌లో ఒక విజిల్ వచ్చే దాకా ఉడికించాలి. ఆ తర్వాత బయటకు తీసి చల్లార్చాలి.
. ఒక మూకుడులో నూనె తీసుకొని అందులో తరిగిన ఉల్లిపాయలు, అల్లం, పచ్చిమిర్చి, వెల్లుల్ని రెబ్బలు వేసి దోరగా వేయించి చివరగా పసుపు వేయాలి.
ఈ మిశ్రమంలోనే టమోటాలు వేసి ఉడక నివ్వాల్సిన తరువాత ఉడికించిన కూర ముక్కలు వేయాలి. పంచదార కలపాలి.



. కూరముక్కల్లోని నీళ్ల ఆవిరి అయ్యేదాకా మగ్గనివ్వాలి. ఈ మిశ్రమాన్ని కొత్తిమీర చింతపండు రసం, ఉప్పు వేసిముద్దగా చేయాలి. దీనిని ఒక గిన్నెలో పెట్టుకోవాలి.
. వేరే మూకుడులో కొద్దిగా నూనె ఆవాలు, మినపప్పు జీలకర్ర, ఎండు మిర్చి, ఇంగువ వేసి వేయించాలి. దీనిని గిన్నెలోని పచ్చడిలో కలపాలి.

# పిల్లల వాకర్లు

అప్పుడే తప్పటడుగులు వేస్తూ, నడక నేర్చుకుంటున్న పిల్లలకి కన్వర్టబుల్, సీటెడ్ బేబీ వాకర్లు మంచి ఎంపిక. అలసటతో బుజ్జాయిలు పడిపోకుండా వాళ్లకు నచ్చినప్పుడు నడుస్తూ ఇబ్బందిగా ఉన్నప్పుడు కూర్చొనే అవకాశం ఈ రెండింటిలో ఉంటుంది. ఆటవస్తువులుగానూ ఇవి ఉపయోగపడతాయి. వాకర్లమీదే ఆకర్షించే బొమ్మలూ, పాటలూ వచ్చే డిజైన్లు ఉన్నాయి. ఏడాదిన్నర, రెండేళ్ల పిల్లలయితే పుష్‌బేబీ వాకర్‌ను ఇవ్వవచ్చు. కాళ్ల కండరాల బలం, అడుగుల్లో, అవయవాల్లో సమన్వయం పెంచడంలో ఇవి సహాయ పడతాయి. మోటార్‌స్కిల్స్‌నూ మెరుగు పరుస్తాయి. కానీ వాకర్‌ను ఉపయోగించే పిల్లలు, ఉపయోగించని వాళ్లకు ఆలస్యంగా నడుస్తున్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

# దక్షిణ మధ్య రైల్వే నుంచి డెహ్రాడూన్ బిలాస్‌పూర్‌లకు వేసవి ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 18,ప్రభాతవార్త** ప్రస్తుత వేసవి సీజన్‌లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ డెహ్రాడూన్,బిలాస్‌పూర్‌లకు ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. చర్లపల్లి నుంచి డెహ్రాడూన్ వెళ్లే నెంబర్ 07077ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 22నుంచి మే 27వరకు ప్రతి మంగళవారం చర్లపల్లి నుంచి బయలుదేరుతుంది. తిరుగు ప్రయాణంలో డెహ్రాడూన్ నుంచి చర్లపల్లి వెళ్లే నెంబర్ 07078ఎక్స్‌ప్రెస్ ఈ నెల 24నుంచి మే 29వరకు ప్రతి గురువారం డెహ్రాడూన్ నుంచి బయలుదేరుతుంది. మార్గమధ్యలో ఈ రైళ్లు కాజీపేట,రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్,బల్హార్షా, నాగ్‌పూర్,ఇటార్సీ, హబీబ్‌గంజ్, బినా,ఝాన్సీ,ఆగ్రా కంటోన్మెంట్, మధుర,హజరత్ నిజామొద్దీన్,మీరట్,రూర్‌కీ, హరిద్వార్ స్టేషన్లలో నిలుస్తాయి. అలాగే బిలాస్‌పూర్ నుంచి కాచిగూడ వెళ్లే నెంబర్ 08263ఎక్స్‌ప్రెస్ మే 12నుంచి జూన్ 2వరకు ప్రతి సోమవారం బిలాస్‌పూర్ నుంచి బయలుదేరుతుంది.

తిరుగు ప్రయాణంలో కాచిగూడ నుంచి బిలాస్‌పూర్ వెళ్లే నెంబర్ 08264ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ మే 13నుంచి జూన్ 3వరకు ప్రతి మంగళవారం కాచిగూడ నుంచి బిలాస్‌పూర్‌కు బయలుదేరుతుంది. ఈ రైళ్లు మార్గమధ్యలో భాటపారా,రాయిపూర్,దుర్గ్, రాజ్ నందగావ్, డోంగర్ ఘర్, గొండియా, వాడ్సా, బల్హార్షా, సిర్పూర్ కాగజ్‌నగర్, మంచిర్యాల, రామగుండం, కాజీపేట, చర్లపల్లి,మల్కాజిగిరి స్టేషన్లలో నిలుస్తాయి.

# నేడు థీమ్ ఇ చెక్ అంశంగా స్వచ్ఛ దివస్ - మంత్రి నారాయణ

**విజయవాడ,ఏప్రిల్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** స్వచ్ఛాంధ్ర స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని ఈ నె 19 మూడవ శనివారం విజయవంతంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు...ప్రతి నెలా మూడో శనివారం జరిగే స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంపై మంత్రి నారాయణ మున్సిపల్ కమిషనర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఈనెల థీమ్ ఇ చెక్‌గా నిర్వహించాలన్నారు.ఈ టెలికాన్ఫరెన్స్ కు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్,స్వచ్ఛాంధ్ర ఎండీ అనిల్ కుమార్ రెడ్డి,చైర్మన్ పట్టాభిరామ్ తో పాటు అన్ని మున్సిపాల్టీల కమిషనర్లు హాజరయ్యారు..కార్యక్రమం నిర్వహణ,చేయాల్సిన ఏర్పాట్లపై మున్సిపల్ కమిషనర్లకు మంత్రి నారాయణ దిశానిర్దేశం చేసారు. ఈ ఏడాది జనవరి నుంచి ప్రతి నెలా మూడో శనివారం ఈ కార్యక్రమం జరుగుతుంది..ఒక్కో నెల ఒక్కో థీమ్ తో పన్నెండు నెలల పాటు క్రమం తప్పకుండా నిర్వహించడం ద్వారా రాష్ట్రఆన్ని వందశాతం స్వచ్ఛతగా మార్చాలనేది సీఎం లక్ష్యం అని మంత్రి నారాయణ చెప్పారు...ఇప్పటికే మూడు నెలలు పూర్తికాగా ఈనెల అంటే 19 వ తేదీ శనివారం ఇచెక్ అనే థీమ్ తో కార్యక్రమం నిర్వహించాలని మంత్రి సూచించారువరుసగా మూడు నెలల పాటు సీఎం చంద్రబాబు ఏదో ఒక జిల్లాలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు..ఈ కార్యక్రమంలో కేవలం మున్సిపల్ కమిషనర్లు మాత్రమే కాకుండా అన్ని శాఖల అధికారులను,ప్రజలను భాగస్వామ్యం చేయాలని సూచించారు..స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి కార్యక్రమం విజయవంతం అయ్యేలా తీసుకోవల్సిన చర్యలపై మంత్రి నా రాయణ అధికారులకు పలు సూచనలు చేసారు. ఇ చెక్ అంటే అన్ని మున్సిపాల్టీలు,గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్లు,దుకాణాల్లో ఉన్న ఎలక్ట్రానిక్ వ్యర్ధాలను పూర్తిగా సేకరించి రీయూజ్ చేయడం.దీనికోసం మున్సిపాల్టీల్లో ప్రత్యేకంగా కలెక్షన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు..ఇప్పటికే మున్సిపాల్టీల్లో ఉన్న ఆర్ ఆర్ ఆర్ సెంటర్లను ఇవేస్ట్ కలెక్షన్ సెంటర్లుగా మార్చనున్నట్లు మంత్రి నారాయణ చెప్పారు....ఈ సెంటర్లలో ఇవేస్ట్ ను సేకరించేందుకు స్వయం సహాయక సంఘాల మహిళలకు బాధ్యతలు అప్పగిస్తామన్నారు...ఇళ్లు,దుకాణాల్లో ఉన్న పాడైపోయిన మొబైల్ ఫోన్లు,టీవీలు,ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలను ఇవేస్ట్ కలెక్షన్ సెంటర్లలో ఇవ్వడం ద్వారా వారికి తగినంత నగదు కూడా చెల్లిస్తారు..ఇదే సమయంలో మహిళలకు కూడా ఉపాధి కలగనుంది...రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాల్టీల్లో మొత్తం 222 ఇవేస్ట్ కలెక్షన్ సెంటర్లు అందుబాటులోకి రానున్నట్లు మంత్రి చెప్పారు...స్థానికంగా ఉండే మహిళా సంఘాల్లోని సభ్యులు కూడా ఇవేస్ట్

# ప్రధాని పర్యటనకు ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటు

**విజయవాడ,ఏప్రిల్18,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని పనుల శంకుస్థాపన కోసం మే 2వ తేదీన ప్రధాని పర్యటన కోసం మంత్రులతో కూడిన ఆర్గనైజింగ్ కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పురపాలక శాఖ మంత్రి నారాయణ, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, మంత్రి కొల్లు రవీంద్రలతో కూడిన ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటైంది. ప్రధాని పర్యటన కోసం నోడల్ అధికారిగా జి.వీరపాండియన్ ను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రధాని పర్యటన ఏర్పాట్లతో పాటు నిర్మాణ పనుల శంకుస్థాపన, పెట్టుబడుల ప్రారంభోత్సవ కార్యక్రమాలను ఆర్గనైజింగ్ కమిటీ పర్యవేక్షించనుంది. అమరావతి పనుల పునః ప్రారంభానికి మే రెండో తేదీన ప్రధాని మోదీ రానున్న దృష్ట్యా భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. మోదీ సభకు సుమారు 5 లక్షల మంది పాల్గొనేలా, ప్రధాన వేదిక వద్ద 50 వేల మంది కూర్చునేలా, లక్ష మంది రోడ్ల వెంబడి నిలబడి ప్రధానికి స్వాగతం పలికేలా ప్లానే చేస్తున్నారు. మే 2న సాయంత్రం 4 గంటలకు అమరాతి పనులను ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. సచివాలయం వెనక ఏర్పాటు చేస్తున్న బహిరంగసభ వేదిక వద్ద నుంచే పనులను ప్రారంభించనున్నారు. మోదీ పర్యటన దృష్ట్యా వీఐపీలతో పాటు ప్రజలు సభా ప్రాంగణానికి చేరుకునేందుకు 9 రహదార్లను గుర్తించారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ఏలూరు, ప్రకాశం సమీప జిల్లాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 250 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రధాన వేదిక తూర్పు అభిముఖంగా ఉండనుంది. వర్షం పడినా కూడా ఇబ్బంది లేకుండా వాటర్ ప్రూఫ్ టెంట్లు వేస్తున్నారు. వీఐపీ పార్కింగ్‌కు 10 ఎకరాలు, వేదికల కోసం 28 ఎకరాలను అధికారులు కేటాయించారు. పీఎం మోదీతో పాటు ప్రముఖుల కోసం 4 హెలీప్యాడ్లు అవసరం కాగా, సచివాలయం ఎదుట ఇప్పటికే మూడు హెలీప్యాడ్లు ఉన్నాయి. వీటికి అదనంగా మరొకటి రెడీ చేస్తున్నారు. హెలీప్యాడ్ నుంచి వేదిక వరకు ఇరు వైపులా రైతులు, మహిళలు నిలబడి పీఎం మోదీకి పూలు చల్లుతూ స్వాగతం పలకనున్నారు.

ఇప్పటికే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వరుస సమీక్షలు నిర్వహిస్తూ వస్తున్నారు.అమరావతి నిర్మాణాల పునఃప్రారంభోత్సవానికి ఖరారయిన ప్రధాని మోదీ పర్యటన షెడ్యూల్ అనుసరించి మే 2న సాయంత్రం 4 గంటలకు రాజధాని పనులను ప్రధాని ప్రారంభించనున్నారు. సచివాలయం వెనక బహిరంగసభ వేదికను ప్రభుత్వం ఎంపిక చేసింది. అక్కణ్నుంచే పనుల పునఃప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రధాని నిర్వహించనున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్ల ఎస్పీజీ బృందం పర్యవేక్షిస్తోంది. వీఐపీలతో పాటు ప్రజలు సభా ప్రాంగణానికి చేరుకునేందుకు 9 రహదార్లను గుర్తించామని, ఆయా రహదార్లలో ఎక్కడా ట్రాఫిక్ సమస్య కలగకుండా తగిన తగిన చర్యలు తీసుకుంటామని సీఎస్ విజయానంద్ అన్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ఏలూరు, ప్రకాశం సమీప జిల్లాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు వివరించారు.

వేసవి దృష్ట్యా ప్రధాని పర్యటనకు వచ్చే ప్రజా ప్రతినిధులు, ప్రజలు తదితరులెవరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాల్సి ఉందని సీఎస్ స్పష్టం చేశారు. అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి పీఎం మోదీ రాష్ట్రానికి రానున్న నేపథ్యంలో అట్టహాసంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సచివాలయం వెనుక 250 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రధాన వేదికను తూర్పు అభిముఖంగా ఉండేలా రెడీ చేస్తున్నారు. వర్షం పడినా కూడా ఇబ్బంది లేకుండా వాటర్ ప్రూఫ్ టెంట్లు వేయనున్నారు. ఈ నెల 28వ తేదీ నాటికి ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. వీఐపీ పార్కింగ్‌కు 10 ఎకరాలు, వేదికల కోసం 28 ఎకరాలు కేటాయించారు.

# పర్యావరణ పరిరక్షణ దిశగా పరిశోధనలు సాగాలి

## - ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య

**అత్తాపూర్ ఏప్రిల్ 18,ప్రభాతవార్త :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన, విస్తరణ సలహా మండలి 48వ సమావేశం శుక్రవారం రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియం సెమినార్ హాల్ లో విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. దీనిలో విశ్వవిద్యాలయ బోధన సిబ్బంది, శాస్త్రవేత్తలు, రైతులు, ఉద్యాన, పశుసంవర్ధక విశ్వవిద్యాలయ ప్రతినిధులు పాల్గొన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సంస్థలు, వ్యవస్థలూ మారాలని జానయ్య అన్నారు. అధునాతన సవాళ్లని ఎదుర్కొనేందుకు భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఎప్పటికప్పుడు పునర్వ్యవస్థీకరణ చర్యలు చేపడుతుందని అదేవిధంగా తాను ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత విశ్వవిద్యాలయంలో మార్పులకి శ్రీకారం చుట్టానన్నారు. వీటిని దశలవారీగా చేపడుతున్నారు. ఒకప్పుడు ఆహార భద్రత కోసం అధిక దిగుబడి విధానాలు అవలంబించారు. అందుకోసం నీటి పారుదల ప్రాజెక్టులు నిర్మించి ఎరువుల ఫ్యాక్టరీలు



వివిధ అంశాలపై రూపొందించిన సీడీ లని విడుదల చేస్తున్న ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య తదితరులు

విరివిగా స్థాపించామని వివరించారు. అందువల్ల నేడు అన్ని ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందన్నారు. 1947-50 ల మధ్యకాలంలో దేశం సాధించిన దిగుబడులు నేడు తెలంగాణ ఒకటే సాధిస్తుందన్నారు. మారిన వాతావరణ పరిస్థితులు, ఉత్పత్తి పెరుగుదల కారణంగా నేడు కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని జానయ్య అన్నారు. సహజ వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్లు, రోబోటిక్ టెక్నాలజీ వినియోగాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆ దిశగా పరిశోధనలు సాగాలని జానయ్య సూచించారు. అదేవిధంగా ప్రకృతి పరిరక్షణకు అనువైన విధానాల్ని తీసుకురావాలన్నారు. దేశవాళీ వంగడాల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జూన్ రెండవ తేదీన రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఇద్దరు, ముగ్గురు రైతులకి విశ్వవిద్యాలయం తరఫున నాణ్యమైన విత్తనాలు అందించనున్నామన్నారు. 2047 నాటికి మానవ రహిత వ్యవసాయం రానున్నదన్నారు. రాష్ట్రంలోని అధిక ఆహార ఉత్పత్తులని ఎగుమతి చేయడానికి ఉన్న అవకాశాల్ని అందిపుచ్చుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యల్ని తీసుకుంటుందని.. ఈ అంశంలో విశ్వవిద్యాలయం నాలెడ్జ్ భాగస్వామిగా ఉండనుందన్నారు. రాష్ట్రం నుండి ప్రతి ఏటా సుమారు 20వేల కోట్ల రూపాయల విలువ గల బియ్యాన్ని ఎగుమతి చేసే అవకాశం ఉందని.. కానీ అందుకు అవసరమైన వనరులు లేవన్నారు. ఆహార ఉత్పత్తులకి విలువ జోడింపుకు అవసరమైన పరిశోధనలపై దృష్టి పెట్టాలని జానయ్య సూచించారు. పరిశోధన, విస్తరణలకు సంబంధించి 2022-23, 2023-24 నివేదికలని పరిశోధన సంచాలకులు డాక్టర్ బలరాం, విస్తరణ సంచాలకులు డాక్టర్ యాకాద్రి సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా రైతులు తమ అభిప్రాయాలు పంచుకున్నారు. ఉపకులపతి జానయ్య ఇతర అధికారులతో కలిసి విశ్వవిద్యాలయం ఎలక్ట్రానిక్ విభాగం వివిధ అంశాలపై రూపొందించిన సీడీ లని విడుదల చేశారు. రిజిస్ట్రార్ డాక్టర్ జి.ఈ.సీహెచ్ విద్యాసాగర్ వందన సమర్పణ చేశారు.

# ఉపరాష్ట్రపతి వ్యాఖ్యలను సుప్రీంకోర్టు దాడిగానే భావిస్తున్నాం! : సిపిఐ రామకృష్ణ

**విజయవాడ ఏప్రిల్ 18 ప్రభాతవార్త ప్రతినిధి:** న్యాయవ్యవస్థపై ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ సంచలన వ్యాఖ్యలు చేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కె.రామకృష్ణ వ్యాఖ్యానించారు. జడ్జీలకు బాధ్యత లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన సుప్రీంకోర్టు తాజా తీర్పు రాష్ట్రపతిని ఆదేశిస్తోంది. ఇది ప్రజాస్వామ్యానికి ముప్పు అని కామెంట్ చేశారు. అయితే ఉప రాష్ట్రపతి వ్యాఖ్యలను సుప్రీంకోర్టుపై దాడిగానే భావిస్తున్నామని రామకృష్ణ అన్నారు. విజయవాడలో మీడియాతో మాట్లాడిన ఆయన భారతదేశంలో అధికారంలో ఉన్న పెద్దలు న్యాయవ్యవస్థపై దాడి చేస్తున్నారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ వ్యాఖ్యలు సుప్రీంకోర్టుపై దాడిగానే భావిస్తున్నాం.

# సూపర్ ఓవర్ కిక్



న్యూఢిల్లీ: ఐపిఎల్ మ్యాచ్‌లు ఎంత మజా ఇస్తాయో అంతకంటే ఎక్కువ కిక్ ఇచ్చేది సూపర్ ఓవర్. ప్రస్తుత ఐపిఎల్‌లో తాజాగా జరిగిన మ్యాచ్‌లోనూ ఆ ముచ్చట తీరింది. అయితే ఇప్పటి వరకు ఐపిఎల్‌లో ఎన్నిసార్లు సూపర్ ఓవర్లు జరిగాయనేది అసక్తికరంగా ఉంది. ఐపిఎల్ 2025లో తొలిసారిగా ఈ నెల 16 రాత్రి సూపర్ ఓవర్ జరిగింది. ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్థాన్ రాయల్స్ మధ్య మ్యాచ్ టై అవ్వడంతో సూపర్ ఓవర్ ఆడాల్సి వచ్చింది. ఈ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ విజయం సాధించింది. ఇలా ఇప్పటి వరకు ఐపిఎల్ చరిత్రలో 14 సూపర్ ఓవర్ మ్యాచ్‌లు జరిగాయి. ప్రస్తుతం ఐపిఎల్ 18వ సీజన్ జరుగుతుండగా, ఇప్పటి వరకు 14 మ్యాచ్‌లలో సూపర్ ఓవర్‌లో ఫలితం తేలింది. ఐపిఎల్‌లో మొదటి సూపర్ ఓవర్ మ్యాచ్ 23 ఏప్రిల్ 2009లో జరిగింది. రాజస్థాన్ రాయల్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్ తొలిసారిగా సూపర్ ఓవర్ ఆడాయి. ఇరు జట్లు 20 ఓవర్లలో 150 పరుగులు చేయడంతో సూపర్ ఓవర్ ఆడాల్సి వచ్చింది. ఇందులో మొదట బ్యాటింగ్ చేసిన కోల్‌కతా 6 బంతుల్లో 16 పరుగుల లక్ష్యానుంచగా, రాజస్థాన్ 4 బంతుల్లోనే ఛేదించింది. అలాగే 12 మార్చి

## 14 మ్యాచ్‌ల్లో సూపర్ ఓవర్‌లో ఫలితం

## మస్తు మజాగా ఐపిఎల్

2010లో కింగ్స్ పంజాబ్ 11, చెన్నై సూపర్ కింగ్స్ 20 ఓవర్లలో 136 పరుగులు చేశాయి. దీంతో సూపర్ ఓవర్‌లో పంజాబ్ 18 పరుగులు చేసి విజయం సాధించింది. 16 ఏప్రిల్ 2013లో బెంగళూరు, ఢిల్లీ డేర్‌డెవిల్స్ మధ్య మ్యాచ్‌లో ఇరు జట్లు 152 స్కోర్ చేయడంతో జరిగిన సూపర్ ఓవర్‌లో ఢిల్లీ ఇచ్చిన 12 పరుగులను 2 బంతుల్లోనే బెంగళూరు పూర్తిచేసింది. 19ఏప్రిల్ 2013న సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై రాయల్ ఛాలెంజర్స్ రెండు జట్లు 130 పరుగులు చేయడంతో జరిగిన సూపర్ ఓవర్‌లో బెంగళూరు టార్గెట్‌ను హైదరాబాద్ ఈజీగా ఛేదించింది. 2014లో కోల్‌కతాతో జరిగిన సూపర్ ఓవర్‌లో రాజస్థాన్ 11 పరుగులు చేసి గెలిచింది. 2015లో రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన సూపర్‌ఓవర్‌లో పంజాబ్ సూపర్ ఓవర్‌లో 12 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. 2017లో గుజరాత్ లయన్స్‌తో సూపర్ ఓవర్ ఫైట్‌లో ముంబై 11 రన్స్‌తో గెలిచింది. 2019లో సన్‌రైజర్స్‌తో సూపర్ ఓవర్ ముంబై ఇండియన్ 9 పరుగులు చేసి విజయానికి చేరుకుంది. 2019లో కోల్‌కతాతో జరిగగిన సూపర్ ఓవర్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ 10 రన్స్‌తో గెలిచింది. 2020లో కింగ్స్ పంజాబ్‌లో జరిగిన సూపర్ ఓవర్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ 2 పరుగులు ఛేదించి విజయం పొందింది. 2020లో ముంబైతో జరిగిన సూపర్ ఓవర్‌లో ఆర్సీబీ, 2020లో సన్‌సైజర్స్‌తో సూపర్ ఓవర్ మ్యాచ్ కోల్‌కతా నైట్‌రైడర్స్ 2 రన్స్ లక్ష్యాన్ని ఛేదించగా, 2020లో అదే రోజు రాత్రి జరిగిన మరో మ్యాచ్ సూపర్ ఓవర్‌కు వెళ్లింది. ఇందులో ట్విస్ట్ ఏంటంటే ఆ జట్లు 2 సార్లు సూపర్ ఓవర్ ఆడాల్సి వచ్చింది. పంజాబ్ కింగ్స్, ముంబై మధ్య జరిగిన మొదటి సూపర్ ఓవర్ టై అయింది. రెండు జట్లు కూడా ఐదేసి పరుగులు చేయడంతో రెండో సూపర్ ఓవర్ ఆడించగా, దీంటో పంజాబ్ 11 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. 2021లో సన్‌రైజర్స్‌తో సూపర్ ఓవర్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ 3 రన్స్‌తో గెలిచింది.



## జావెలిన్ త్రోలో భారత్‌కు స్వర్ణం

న్యూఢిల్లీ: జావెలిన్ త్రోలో భారత్‌కు స్వర్ణ పతకం దక్కింది. భారత్ స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా 2025 సీజన్‌ను స్వర్ణ పతకంతో శుభారంభం చేశాడు. దక్షిణాఫ్రికాలో జరిన పాచెఫ్‌స్ట్రూమ్ ఇన్విటేషనల్ ట్రాక్ ఈవెంట్‌లో 27 ఏళ్ల నీరజ్ చోప్రా విజేతగా నిలిచాడు. ఆరుగురు పోటీపడ్డ ఈ ఈవెంట్‌లో నీరజ్ జావెలిన్‌ను 84.52 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. దక్షిణాఫ్రికాకు చెందిన డూ స్మిట్ 82.44 మీటర్లు విసిరి రజతాన్ని సంపాదించగా, దక్షిణాఫ్రికాకే చెందిన మరో జావెలిన్ త్రోయర్ రాబర్ట్ సన్ కాంస్యం సాధించాడు. ఇక నీరజ్ పాల్గొన్న ఈ మీట్‌కు వరల్డ్ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్ ఛాలెంజర్ ఈవెంట్‌గా గుర్తింపు ఉంది. దిగ్గజం జాన్ ఎలెజ్నిను కొత్త కోచ్‌గా నియమించుకున్నాక నీరజ్ చోప్రా పోటీపడ్డ తొలి టోర్నీలో టాప్ ర్యాంక్‌లో నిలవడం విశేషం. నీరజ్ తదుపరి మే నెల 16వ తేదీన జరిగే దోహా డైమండ్ లీగ్ మీట్‌లో, ఆ తర్వాత మే 24న పంచ్‌కులాలో జరిగే క్లాసిక్ జావెలిన్ త్రో టోర్నీలో నీరజ్ చోప్రా పోటీ పడతాడు.

## వరల్డ్ బిలియర్డ్స్ ఛాంపియన్‌గా సౌరవ్



న్యూఢిల్లీ: ఐబిఎస్‌ఎఫ్ ప్రపంచ బిలియర్డ్స్ టోర్నమెంట్‌లో భారత స్టార్ క్యూయిస్టు సౌరవ్ కొఠారీ ఛాంపియన్‌గా నిలిచాడు. ఐర్లాండ్ వేదికగా జరిగిన ఫైనల్లో సౌరవ్ 725-480 పాయింట్ల తేడాతో ఏస్ క్యూయిస్టు పంకజ్ అద్వానీపై అద్భుత విజయం సాధించాడు. ఇటీవలి ఛాంపియన్‌షిప్ చరిత్రను పరిశీలిస్తే ఏకంగా 325 పాయింట్లతో సౌరవ్ అద్భుతమైన బ్రేక్ సాధించాడు. ప్రత్యర్థికి ఎక్కడా అవకాశమివ్వని సౌరవ్ 119, 112 స్కోర్లతో గేమ్‌పై పట్టు నిలబెట్టుకున్నాడు. ఈ క్రమంలో తన కెరీర్‌లో తొలిసారి ఐబిఎస్‌ఎఫ్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. అంతకు ముందు ప్రపంచ బిలియర్డ్స్ ఛాంపియన్‌షిప్ డిఫెండింగ్ ఛాంపియన్ పంకజ్ సెమీ ఫైనల్లో 1070-300తో సహచరుడు ధ్రువ్ సిత్వాలాను చిత్తు చేశాడు. ఆరంభంలో రెండు బ్రేక్‌లు సాధించి 400 పాయింట్లతో ఆధిక్యంలో నిలిచిన పంకజ్ ఆ తర్వాత అదే జోరు కొనసాగించి విజయాన్ని సొంతం చేసుకున్నాడు. 2016 నుండి పంకజ్ ఈ టోర్నీలో ఓడిపోలేదు. సరిగ్గా 35 ఏండ్ల క్రితం సౌరవ్ తండ్రి, దిగ్గజ క్యూయిస్టు మనోజ్ కొఠారీ ప్రపంచ బిలియర్డ్స్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు.

## మహిళల గ్రాండ్ ప్రిలో.... భారత్ స్టార్లు

# దివ్య, హంపి విజయం





న్యూఢిల్లీ: అంతర్జాతీయ చెస్ సమాఖ్య మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్ ఐదో అంచె చెస్ టోర్నమెంట్‌లో నాల్గవ రోజు ప్రపంచ జూనియర్ ఛాంపియన్, భారత్ స్టార్ గ్రాండ్ మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్, మరో గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి మెరిశారు. దివ్య ఖాతాలో మూడో గెలుపు చేరగా, హంపి వరుసగా రెండో విజయం నమోదు చేసింది. మంగోలియాకు చెందిన బత్ఖుయాగ్ మున్‌గున్‌తుల్‌తో జరిగిన గేమ్‌లో బల్గేరియాకు చెందిన సుర్గుల్‌సలీమోవా 55 ఎత్తుల్లో, చైనాకు చెందిన జు జినెర్ 39 ఎత్తుల్లో పోలాండ్‌కు చెందిన అలీనా కష్లిన్‌స్కాయాపై గెలుపొందారు. కాగా 10 మంది క్రీడాకారిణుల మధ్య తొమ్మిది రౌండ్ల పాటు ఈ టోర్నీ జరుగనుంది. భారత్‌కే చెందిన మరో ఇద్దరు గ్రాండ్ మాస్టర్లు ద్రోణవల్లి హారిక, వైశాలి రమేష్‌బాబుల మధ్య జరిగిన మరో ముఖాముఖి పోరు డ్రా గా ముగిసింది. జార్జియాకు చెందిన మెలియా సలోమతో జరిగిన గేమ్‌లో నల్లపావులతో ఆడిన మహారాష్ట్ర అమ్మాయి దివ్య 77 ఎత్తుల్లో విజయాన్ని అందుకుంది. రష్యాకు చెందిన పోలీనా షువలోవాతో జరిగిన గేమ్‌లో నల్లపావులతో ఆడిన హంపి 33 ఎత్తుల్లో గెలిచింది. ఇక వైశాలి, హారిక మధ్య జరిగిన గేమ్ 34 ఎత్తుల్లో డ్రా అయింది.

## మహిళల వరల్డ్ కప్‌కు పాకిస్థాన్ క్వాలిఫై

### థాయ్‌లాండ్‌పై 87 పరుగుల తేడాతో గెలుపు



న్యూఢిల్లీ: భారత్ వేదికగా ఈ ఏడాది సెప్టెంబర్-అక్టోబరులలో జరగనున్న మహిళల వన్డే వరల్డ్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌కు పాకిస్థాన్ జట్టు అర్హత సాధించింది. వరల్డ్ కప్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో టాప్-1లో నిలిచిన జట్టుకు ప్రపంచ కప్ బెర్త్‌లు లభిస్తాయి. ఈ నేపథ్యంలో క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా లాహోర్‌లో థాయ్‌లాండ్‌తో జరిగిన నాల్గవ లీగ్ మ్యాచ్‌లో పాకిస్థాన్ 87 పరుగుల తేడాతో గెలిచింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లు నష్టానికి 205 పరుగులు చేసింది. సిద్రా అమిన్ 80 పరుగులు, 9 ఫోర్లు, కెవెటన్ సనా ఫాతిమా 62 పరుగులు, 6 ఫోర్లు, ఒక సిక్స్‌తో నాటౌట్‌గా అర్ధ సెంచరీలతో రాణించారు. అనంతరం లక్ష్య ఛేదనలో బ్యాటింగ్‌కు దిగిన థాయ్‌లాండ్ 34.4 ఓవర్లలో 118 పరుగులకు ఆలౌట్ అయింది. పాక్ బౌలర్లలో సనా ఫాతిమా, నష్రా సంధూ, రమీన్ షమీమ్ 3 వికెట్లు చొప్పున పడగొట్టారు. దీంతో ఎనిమిది పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్న పాకిస్థాన్ మరో మ్యాచ్ మిగిలి ఉండగానే ప్రపంచ కప్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. ఈ నెల 19వ తేదీన జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో పాకిస్థాన్ తలపడనుంది. ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ ఓడిపోయినా ఆ జట్టుకు వచ్చిన ఢోకా ఏమీ లేదు. కాగా బాంగ్లాదేశ్ 8 పాయింట్లతో ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా వరల్డ్ కప్ టోర్నీకి అర్హత సాధించింది. బంగ్లాదేశ్ ఓడిపోయి, వెస్టిండీస్, స్కాట్లాండ్ జట్టు తమ చివరి లీగ్ మ్యాచ్‌ల్లో గెలిస్తే ఈ మూడు జట్లు 6 పాయింట్లతో సమ ఉజ్జీలుగా నిలుస్తాయి. ఈ నేపథ్యంలో మెరుగైన రన్ రేట్ ఉన్న జట్లు ప్రపంచ కప్ టోర్నీకి అర్హత సాధిస్తుంది. ఇలా రన్ రేట్ పరంగా బంగ్లాదేశ్‌కే మరో బెర్త్ దక్కే అవకాశం ఉంది.

# వాణిజ్యం

## 192% పెరిగిన పసిడి దిగుమతులు!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: ఓవైపు బంగారం ధరలు ఆకాశాన్ని తాకుతున్నా దీనిపై మోజు మాత్రం తగ్గడం లేదు. ఆ స్థాయిలో దేశంలో బంగారం దిగుమతులు పెరుగుతున్నాయి. తాజాగా మార్చి నెలకు సంబంధించిన గణాంకాలను వాణిజ్య మంత్రిత్వశాఖ విడుదల చేసింది. అంతకుముందు నెలతో పోలిస్తే దిగుమతుల విలువ 191.13 శాతం పెరిగి 4.47 బిలియన్ డాలర్లకు చేరినట్లు తెలిపింది. అంటే మన కరెన్సీలో దాదాపు రూ.38 వేల కోట్లు అన్నమాట. దిగుమతులు భారీగా పెరగడంతో అదే స్థాయిలో ద్రవ్యలోటు పెరుగుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి మార్చి మధ్య సుమారు 58 బిలియన్ డాలర్ల బంగారం దిగుమతి అయ్యింది. అంతకుముందు ఏడాది ఈ మొత్తం 45.54 బిలియన్ డాలర్లుగా ఉంది. అంటే 27.27 శాతం మేర ఈ పెరుగుదల నమోదైంది. ఈ స్థాయిలో దిగుమతులు పెరుగుదల బంగారంపై పెట్టుబడిదారులకు ఉన్న నమ్మకాన్ని సూచిస్తోంది. ముఖ్యంగా అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, బ్యాంకుల నుంచి డిమాండ్, ధరల పెరుగుదల కారణంగా దిగుమతుల విలువ పెరుగుతోంది. ప్రస్తుతం 10 గ్రాముల మేలిమి పసిడి ధర దేశ రాజధాని ఢిల్లీలో రూ.98 వేలు పైనే పలుకుతోంది. ఇటీవల పెరుగుదలకు అమెరికా అధ్యక్షుడు అనుసరిస్తున్న వాణిజ్య విధానాలే కారణమని అనలిస్టులు పేర్కొంటున్నారు. ఇక వెండి దిగుమతులు మాత్రం 85 శాతం మేర తగ్గి 119.3 మిలియన్ డాలర్లుగా నమోదైనట్లు వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. పూర్తి ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 11.24 శాతం మేర తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి. భారత్ దిగుమతి చేసు కుంటున్న బంగారంలో 40 శాతం వాటాతో స్విట్జర్లాండ్ అగ్రస్థానంలో ఉంది. యూఏఈ 16 శాతం, దక్షిణాఫ్రికా 10 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. దేశంలోకి దిగుమతయ్యే మొత్తం దిగుమతుల్లో దీని వాటా 8 శాతం అని వాణిజ్య మంత్రిత్వశాఖ తెలిపింది. టన్నుల్లో చూసుకుంటే 202324 ఆర్థిక సంవత్సరంలో భారత్ 795.32 టన్నుల బంగారాన్ని దిగుమతి చేసుకోగా 2024 25 ఆర్థిక సంవత్సరంలో 757.15 టన్నులకు తగ్గింది. ఫిబ్రవరి నెలలో 62 శాతం మేర తగ్గగా.. అంతకుముందు జనవరిలో 40.8 శాతం, 2024 డిసెంబర్‌లో 55.39 శాతం మేర దిగుమతులు పెరగడం గమనార్హం. ప్రస్తుతం చైనా తర్వాత రెండో అతిపెద్ద దిగుమతిదారుగా భారత్ ఉంది. ముఖ్యంగా జువెలరీ ఇండస్ట్రీ నుంచి డిమాండ్



## ఇన్ఫి నారాయణ మూర్తి మనవడికి రూ.3.3కోట్ల డివిడెండ్

ముంబై, ఏప్రిల్ 18: దేశీయ రెండో అతిపెద్ద ఐటీ సేవల సంస్థ ఇన్ఫోసిస్ తాజా త్రైమాసిక ఫలితాల సందర్భంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి తుది డివిడెండ్‌ను ప్రకటించింది. ఒక్కో షేరుకు రూ.22 చెల్లించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. దంపతుల సంతానం ఏకాగ్రహ్ రోహన్ మూర్తి. కంపెనీలో తన వాటా షేర్లలో ఏకంగా 15 లక్షల షేర్లను మనవడి పేరు మీద రిజిస్టర్ చేశారు. ఈ షేర్లను రోహన్ నాలుగు నెలల వయసు ఉన్నప్పుడే బహుమతిగా ఇచ్చారు. బహుమతి ఇచ్చే సమయంలో ఈ షేర్ల విలువ రూ.240 కోట్లకు పైగా ఉంది. ఇక తాజాగా ఇన్ఫోసిస్ నాలుగో త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి తుది డివిడెండ్ కింద ఒక్కో షేరుకు రూ.22 దీంతో ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి మనవడు ఏకాగ్రహ్ రోహన్ మూర్తి ఇన్ఫీ నుంచి రూ.3.3 కోట్లు అందుకోనున్నారు. ఐటీ సంస్థ ఇన్ఫోసిస్‌లో ఉన్న షేర్ల ద్వారా ఈ ఆదాయం సమకూర నుంది. నారాయణమూర్తి కుమారుడు రోహన్ మూర్తి, అపర్ణ కృష్ణన్ చెల్లించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. ఏకాగ్రహ్ 15 లక్షల షేర్లు కలిగి ఉండటంతో డివిడెండ్ రూపంలో రూ.3.3 కోట్లు అందుకోనున్నారు. దీంతో ఇప్పటివరకు ఏకాగ్రహ్ అందుకున్న మొత్తం డివిడెండ్ ఆదాయం రూ.10.65 కోట్లకు చేరుకుంటుంది. ఫలితంగా అతిపిన్న వయస్కులైన మిలియనీర్లలో నారాయణమూర్తి మనవడు ఒకడిగా నిలిచాడు. ఇక కుమార్తె అక్షత మూర్తి ఇన్ఫోసిస్‌లో 1.04శాతం వాటా కలిగి ఉన్నారు. ఇన్ఫోసిస్ డివిడెండ్ ప్రకటన ద్వారా రూ.87.51 కోట్ల భారీ ఆదాయం పొందనున్నారు. ఇక నారాయణ మూర్తి రూ.33.3 కోట్లు, ఆయన భార్య సుధామూర్తి రూ.76 కోట్లు అందుకున్నారు. ఇన్ఫోసిస్ మరో 240 మంది ట్రైనీలపై వేటు వేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు వారికి మెయిల్స్‌ను పంపినట్లు కథనాలు వస్తున్నాయి. కంపెనీ నిర్వహించిన అంత గ్రత పరీక్షల్లో విఫలమవడంతో వారిని తొలగించినట్లు సమాచారం. ఇదే కారణంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో 300 మందికి పైగా ట్రైనీలకు లేఆఫ్‌లు ప్రకటించిన విషయం తెలిసిందే.



## శాటిలైట్ టోల్ విధానంపై కేంద్రం క్లారిటీ!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: శాటిలైట్ ఆధారిత టోల్ విధానం అమలుపై కేంద్రం క్లారిటీ ఇచ్చింది. మే 1 నుంచి దేశవ్యాప్తంగా అమలు చేయడంపై ఇంకా ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదని స్పష్టం చేసింది. ప్రస్తుత ఫాస్టాగ్ ఆధారిత టోల్‌విధానం స్థానే శాటిలైట్ టోల్ విధానాన్ని మే 1 నుంచే అమలు చేయబోతున్నారంటూ కొన్ని వార్తలు వచ్చాయి. దీనిపై కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రకటన ప్రకారం, ఫీజు వసూలుకు టోల్ ప్లాజాల వద్ద వాహనాలు ఆపే అవసరం లేకుండా ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ విధానాన్ని తొలుత ఎంపిక చేసిన టోల్‌ప్లాజాల వద్ద అమరుస్తారు. ఇందులో ఎఎన్‌పిఆర్‌తో పాటు ఫాస్టాగ్ కలగలిపి సేవలందిస్తారు. అంటే ఎఎన్‌పిఆర్ కెమెరాలు వాహనం నంబర్ ప్లేట్లను గుర్తిస్తే, వాహనాలు ఆగకుండానే ఫాస్టాగ్ రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ ద్వారా టోల్ వసూలు చేస్తారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఇ-నోటీసులు జారీ చేస్తారు. ఫాస్టాగ్ రద్దు, పెనాల్టీలు విధిస్తారు. ఎప్పటి నుంచి అమలుచేయాలనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఆ శాఖ తెలిపింది.



## ఉద్యోగుల తొలగింపు అవాస్తవం: టిసిఎస్

వాషింగ్టన్, ఏప్రిల్ 18: ప్రముఖ ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్)పై పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. అమెరికా ఉద్యోగులపై ఐటీ దిగ్గజం వివక్ష చూపిస్తోందని దక్షిణాసియాయేతర మాజీ ఉద్యోగులు విమర్శిస్తున్నారు. దీనిపై అమెరికాలో సమాన ఉపాధి అవకాశాల కమిషన్ (ఇఇఒసి) దర్యాప్తు చేపట్టింది. ఈ విషయాన్ని కథనంలో పేర్కొంది. ప్రధానంగా 40 ఏళ్లు పైబడిన దక్షిణాసియా యేతర మాజీ ఉద్యోగులు టీసీఎస్ తీరుపై పక్షపాత లే ఆఫ్‌లు అమలు చేస్తోందని ఆరోపణలు చేశారు. హెచ్1 బీ వీసా కలిగిన భారతీయ ఉద్యోగులపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు విమర్శించారు. ఈ ఆరోపణల్ని టీసీఎస్ ఖండించింది. ఈ మాటల్లో వాస్తవం లేదని కేవలం తప్పుదారి పట్టించడానికి చేస్తున్న ప్రయత్నమని స్పష్టం చేసింది. తాము అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపింది. ఇదే తరహా ఆరోపణలు గతంలో బ్రిటన్‌లోని ఓ ఉపాధి ట్రైబ్యునల్‌లోనూ వెలుగులోకి వచ్చాయి. అక్కడ ముగ్గురు టీసీఎస్ ఉద్యోగులు వయసు, జాతీయత ఆధారంగా వివక్షకు గురైనట్లు ఆరోపించారని ది గార్డియన్ నివేదించింది. ఇదిలా ఉండగా, ఇప్పటికే ఫలితాలను ప్రకటించిన టీసీఎస్, అమెరికా కార్యకలాపాల నుంచి వచ్చే ఆదాయం గత ఏడాదితో పోలిస్తే 5.3 శాతం పెరిగి రూ.64,479 కోట్లకు చేరిందని పేర్కొంది. నాలుగో త్రైమాసికంలో ఉద్యోగుల తొలగింపు రేటు 13 శాతం నుంచి 13.3 శాతం పెరిగిందని తెలిపింది. అమెరికా టారిఫ్‌ల కారణంగా ప్రపంచ వ్యాప్తంగా తలెత్తిన అనిశ్చితి మధ్య 6.07 లక్షల మంది ఉద్యోగులకు వేతన పెంపును వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.




## ఫెడ్ చైర్మన్‌ను తొలగిస్తాం: ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్, ఏప్రిల్ 18: అమెరికా ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ తొలగింపు త్వరగా జరగకూడదని భావిస్తున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరోక్షంగా హెచ్చరించారు. పావెల్ పనితీరుపట్ల ట్రంప్ మండిపడ్డరు. ఇతర సెంట్రల్ బ్యాంకులు వడ్డీరేట్లను తగ్గిస్తున్నా తాను అనుకున్న విధంగా అమెరికా వేగంగా వాటిని తగ్గించడం లేదని అభిప్రాయ పడ్డారు. తీవ్ర అనిశ్చితి పరిస్థితుల నేపథ్యంలో అమెరికా ఆర్థిక వ్యవస్థ మందగమనంలోకి అడుగుపెట్టొచ్చని ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ ఇటీవల ఓ సమావేశంలో తెలిపారు. వినియోగదారుల వ్యయంలో మందగమనం సంభవించే అవకాశముందని, ముఖ్యంగా ఆర్థిక పరిస్థితులపై తీవ్ర అనిశ్చితి కొనసాగుతోందని వ్యాపార వర్గాల్లో అంచనాలు నెలకొన్న సమయంలో ఫెడ్ చైర్మన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ ప్రభుత్వ విధానాలు ఆర్థిక వ్యవస్థపై ఎలాంటి ప్రభావం చూపుతాయో అన్న అంశంపై స్పష్టత వచ్చే వరకు ఫెడ్ వడ్డీ రేట్లను తగ్గించడంలో ఏ మాత్రం తొందర పడబోమని పావెల్ స్పష్టం చేశారు. కానీ ట్రంప్ త్వరగా వడ్డీరేట్ల కోతను కోరుకుంటున్నారు. ఇమిగ్రేషన్,టాక్సేషన్, నియంత్రణలు, టారిఫ్ వంటి విధానపరమైన మార్పుల వల్ల ఆర్థిక వ్యవస్థపై కలిగే ప్రభావం పట్ల ఫెడరల్ రిజర్వ్ స్పష్టత కోరుతోందని పావెల్ పేర్కొన్న మరుసటి రోజే ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. యూరోపియన్ సెంట్రల్ బ్యాంకు (ఇసిబి)ఎప్పుడో రేట్లు తగ్గించిందని ట్రంప్ అన్నారు. ఇకనైనా పావెల్ రేట్ల కోతకు పూనుకోవాలని సూచించారు. ఫెడరల్ రిజర్వ్ చైర్మన్‌గా జెరోమ్ పావెల్ తొలగింపు త్వరగా జరగకూడదని భావిస్తున్నట్లు ట్రంప్ పరోక్షంగా హెచ్చరించారు. పావెల్ పదవీ కాలం 2026 చివరి వరకు ఉంది. ఆయనను 2017లో ట్రంప్ ప్రతిపాదించారు. త్వరలో 2022లో బైడెన్ మరో నాలుగేళ్ల పాటు ఫెడ్ చైర్మన్‌గా కొన సాగించారు.



## సివిలియన్ హెలికాప్టర్లకు డిమాండ్!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: భారత్‌లో వచ్చే ఐదేళ్లలో సివిలియన్ హెలికాప్టర్ల సంఖ్య రెట్టింపు అవుతుందని ఎయిర్‌బస్ హెలికాప్టర్స్ అంచనా వేసింది. మెడికల్ ఎమర్జెన్సీలు, డిజాస్టర్ రిలీఫ్, లా ఎన్‌ఫోర్స్‌మెంట్, టూరిజం రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతుండడం ఇందుకు కారణమని తెలిపింది. ఇది కీలకమైన సేవల కోసం హెలికాప్టర్లపై ఆధారపడడాన్ని సూచిస్తుంది. దేశంలో ప్రస్తుతం 250 సివిల్ హెలికాప్టర్లున్నాయి. ఇది ప్రపంచ సివిలియన్ ఫ్లీట్‌లో సుమారు ఒక శాతంగా ఉంది. ఈ వాటా ప్రస్తుతానికి స్వల్పంగానే ఉన్నప్పటికీ, దేశంలోని వైవిధ్యమైన భౌగోళిక పరిస్థితులు కారణంగా ఎయిర్‌బస్ హెలికాప్టర్లకు అపారమైన మార్కెట్ ఉంటుందని అంచనా వేస్తుంది. కొండ రాష్ట్రాలు, మారుమూల ప్రాంతాలు, ప్రకృతి వైపరీత్యాలకు గురయ్యే ప్రాంతాల్లో హెలికాప్టర్ కార్యకలాపాలు అధికంగా ఉండే అవకాశం ఉంది. భారత ప్రభుత్వం కూడా ఈ సర్వీసులను ప్రోత్సహించేందుకు అనేక కార్యక్రమాలను ప్రారంభించింది. ప్రాంతీయ హెలికాప్టర్ సేవలతో సహా సరసమైన విమాన కనెక్టివిటీని అందించేందుకు ఉడాన్ పథకాన్ని తీసుకొచ్చింది. ప్రాజెక్టు సంజీవని ద్వారా మారుమూల ప్రాంతాల్లో వేగవంతమైన వైద్య సహాయం అందించేందుకు చర్యలు చేపడుతుంది. కొన్ని ప్రాంతాల్లో ప్రత్యేకంగా హెలిపోర్టులను ఏర్పాటు చేసేందుకు మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నారు. ఎయిమ్స్ రిషికేశ్‌లోహెలికాప్టర్ అంబులెన్స్ సర్వీసులకు ఆదరణ పెరిగింది. ఇక్కడ ఎయిర్‌బస్ హెచ్125 హెలికాప్టర్ అత్యవసర వైద్య సేవల కోసం సిబ్బందిని, రోగ్యులను తరలిస్తున్నారు.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.